07-02Pg1fB 1 VJA_07-02Pg1fB.qxd 06/Feb/26 11:15 PM Page 1







తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 07 పేజీలు: 12 వెల: 6.50













## ఇక డిజిటల్ పాస్‌బుక్‌లు

>> వివరించారు. ఎవరైనా భూ రికార్డులను తారుమారు చేస్తే కఠిన శిక్షలు అమలు చేసేలా నిబంధనలు తీసుకొ చ్చామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 279 గ్రామాల్లో సర్వే చేపట్టి 1.16 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 37.40 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయని, ఇంకా 62 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. 9500 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 2027 డిసెంబరు నాటికి ప్రతి అర్హుడికి పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్‌ను కేవలం రూ.100తో పూర్తి చేసే విధానాన్ని అమలు చేస్తున్నా మని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 9వ తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తూ, ఎటువంటి లంచాలు లేకుండా పాస్ పుస్తకాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులకు లాభదాయక సాగు విధానాలను ప్రోత్సహిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల ముందుకు వచ్చి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో కరవుతో ఇబ్బందులు ఎదుర్కొన్న రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 200 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచి వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ సహా పలు పథకాల ద్వారా నీటి వనరులను విస్తరించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పశ్చిమ కర్నూలుకు కూడా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వేదవతి, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. తుంగభద్ర జలాలను కర్నూలు జిల్లాకు మరింతగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు విషయంలో పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు.

**పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం:** పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని అందిస్తూ, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లిస్తున్నామని చెప్పారు. నీరు అందుబాటులో ఉంటే వ్యవసాయం మాత్రమే కాదు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గొల్లపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి కియా మోటార్స్‌కు నీటి సరఫరా కల్పించినట్లు తెలిపారు.

**గత పాలనలో భారీగా ప్రజాధనాన్ని ఖర్చు! :** గత పాలనలో భూ వివాదాలు పెరిగాయని, రైతుల భూములను 22ఏ కింద పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల్లో 80 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని చెప్పారు. సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించేందుకు భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజల పన్నుల డబ్బులను దుర్వినియోగం చేశారని విమర్శించారు.

**భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోము!** ప్రజలకు భారం పడకుండా భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులను చెల్లించాల్సి రావడం వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పెరిగిందని పేర్కొన్నారు.

## ఏకసభ్యకమిటీతో 'కల్తీనెయ్యి'లో మలుపులేనా!

### -మొత్తం తప్పిదాలకు కీలక వ్యక్తులే టార్గెట్‌గా పరిణామాలు!



**తిరుమల,ఫిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి ప్రభుత్వంలోని గత వైసిపి బోర్డు పెద్దల అనూహ్య నిర్ణయాలతో తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసు బాగోతం చిలికిచిలికిగాలివానలా తయారైంది. 250కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగిందనే ఆరోపణలపై ఈ కేసులో గత ఏడాదే సుప్రీంకోర్టు కలుగజేసుకుని ఏకంగా సిబిఐ, రాష్ట్రపోలీస్ అధికారులను, ఫుడ్అనాలతసిస్ విభాగం నిపుణులతో సిట్ పేరుతో కమిటీ నియమించింది. ఈ కమిటీలోని అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కీలక విషయాలను నివేదికగా ప్రభుత్వానికి అందజేశారు. పాత్రధారులను తేల్చిన సిట్ అసలు సూత్రధారుల జోలికెళ్ళకపోవడం ఇప్పుడు మరింత రచ్చకు కారణమైంది. కల్తీనెయ్యి బాగోతంలో టెండర్ నిబంధనలు మార్చి వారికి అనుకూలంగా తయారుచేసుకోవడం, ఆపై కల్తీనెయ్యిగా గుర్తించినా రద్దుచేయకపోవడం వంటివి ఇప్పుడు కీలకంగా దర్యాప్తు సాగనుంది. ఇందుకు రాష్ట్రప్రభుత్వం,మంత్రిమండలి స్వయంగా ఏకసభ్యకమిటీని నియమించేందుకు సిద్దమైంది. కల్తీ వ్యవహారంలో కర్త,కర్మ,క్రియ ఎవరున్నా రనేది తేల్చాలని గట్టిగా పట్టుబడుతున్నారు. మరీ ఆ ఏకపక్ష కమిటీ దర్యాప్తు చేపడితే ఎలాంటి పరిణామాలు చోటు చేసు కోబోతున్నాయనేది కూడా అందరిలోనూ ఆందోళనకలిగిస్తోంది. తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం తరువాత అంతే పవిత్రంగా తయారుచేసే లడ్డూలకు 2019-2024 మధ్యకాలంలో కల్తీ నెయ్యి సరఫరా చేసినా టిటిడిలో పట్టించుకోని పాపంలో కీలక సూత్రధారులను తేల్చే పనిలో ప్రభుత్వం పట్టుదలగా ముందుకు కదులుతోంది. ఏకపక్ష కమిటీని న్యాయవిభాగానికి చెందిన జడ్జితో ఏర్పాటుచేస్తారా అనేది తేలాల్సి ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో 2020-24వరకు కల్తీనెయ్యి సరఫరా చేశారనే అంశంలో తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్,సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పూనంబాక)సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను సిబిఐ అధికారులు కటకటాల్లోనికి పంపడం,బెయిల్‌పై బయటకు రావడం జరిగింది. ఇంకా వైష్ణవీ డైరీకి సంబంధించి నెయ్యిసరఫరా కేసులో లారీ డ్రైవర్లే డైరెక్టర్లుగా కాగితాలపై చలామణి అయ్యి ఈ లోపాయికారి ఒప్పందం, తప్పిదాలు చేశారనేది సిబిఐ విస్తుపోయే నిజాలు సేకరించినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో నాణ్యతలేని, కల్తీ నెయ్యి తక్కువ ధరకు సరఫరా చేస్తామని డైరీల యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడం, కల్తీ నెయ్యేగాక ఏకంగా జంతువుల కొవ్వు, పామాయిల్, పందికొవ్వు , చేపనూనెతో బాటు ఇతరత్రా సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆలివ్,గోధుమబీన్, మొక్క జొన్న, పత్తిగింజలతో నూనె వినియోగించారనేది నిందితుల రిమాండ్ రిపోర్టులో చోటుచేసుకున్న విషయం. గత ఐదేళ్ళలో పనిచేసిన టిటిడి అధికారులు, గత టిటిడి బోర్డుకు ఈ వాస్తవాలు తెలియవా?! తెలిసినా నోరుమూసుకుని పాలనసాగించారా అనేది ఇప్పుడు ఏకపక్షకమిటీ తేల్చుతుందనేది చర్చమొదలైంది. 2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో తొలుత రెండుసంవత్సరాలు స్వయాన జగన్ బాబాయి ,మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా కొనసాగారు. టిటిడిలో తిరుమల జెఇఒ పోస్టును అప్‌గ్రేడ్ చేసి అదనపు ఇఒ పోస్టుగా సృష్టించి కేంద్రంలోని రక్షణవిభాగంలో ఉన్న ఏవి ధర్మారెడ్డిని ఆ స్థానంలో కూర్చోబెట్టారు. అదే సమయంలో టిటిడి ఇఒగా డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డిని నియమించుకుని రెండేళ్ళు కొనసాగారు. గత ప్రభుత్వంలో లడ్డూల నాణ్యత, రుచిపై తీవ్రస్థాయిలో అసహనం, అసంతృప్తి, భక్తులు ఏకంగా డయల్ యువర్ ఇఒకు కూడా విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. తిరుమలలో లడ్డూ తయారీకి ప్రతిరోజూ 500లీటర్ల వరకు నెయ్యిని వినియోగిస్తుంది. ఇ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెయ్యి సరఫరా చేసుకునే టిటిడి నెయ్యినాణ్యత పరీక్ష ల్యాబ్ తిరుమలలోనే ఉంది. అప్పట్లో కొంతవరకు లడ్డూల నాణ్యతపై దుమారం రేగుతూనే ఉన్నా చివరకు 2023లో ధర్మకర్తలమండలి మార్పుజరిగింది. ఈ మార్పుతో టిటిడిలో పూర్తిగా నెయ్యిసరఫరాలో నాణ్యతలేదని, దీనివెనుక టిటిడిలో ఉన్నతాధికారి హస్తం, తమిళనాడుకు చెందిన ఓ నేత ప్రమేయం ఉందని సిబిఐ దర్యాప్తు అధికారులు విస్తుబోయే నిజాలు రాబట్టారు. ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీ కల్తీనెయ్యికి కీలకమనేది నివేదికలో పొందుపరిచిన విషయం. కల్తీనెయ్యి వినియోగించారనే సంచలన బాగోతంలో పలు రకాలుగా పలు కీలక విషయాలు తెలిసినా సూత్రదారులు అప్పట్లోనే కొనుగోలుకమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల నుండి కమీషన్లు వంటివి ఇప్పుడు ఏకపక్ష కమిషన్ తేల్చనుంది. తిరుమల లడ్డూల తయారీకి 60లక్షల కిలోల కెమికల్స్ వాడారని సిట్ వెలుగులోకి తెచ్చింది. ఈ కల్తీనెయ్యితో 20కోట్ల లడ్డూలు తయారుచేసిభక్తులకు విక్రయించారని కూడా పేర్కొంది.మొత్తం 36మంది నిందితులుగా పేర్కొంటూ అందులో 12మంది టిటిడి అధికారులు ప్రమేయం కూడా ఉందని సంచలనరిపోర్టులో వెల్లడించడం కొసమెరుపు.

## బాత్‌రూమ్ రసాయనాలతో తయారీ?

>> స్వామివారి లడ్డూలను తయారు చేయించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు గారు విమర్శించారు. నెయ్యి కల్తీ కాలేదని సీబీఐ లేదా సిట్ క్లీన్ చిట్ ఇచ్చాయని వారు మాట్లాడుతున్నారని, కానీ వాస్తవానికి వారి కుటుంబ సభ్యులే కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని గుర్తు చేశారు. గత టీటీడీ ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి గారే స్వయంగా కల్తీ జరిగిందని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్‌దే

>> అంబ్రిష్ సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. 2022 ఎడిషన్ తర్వాత టీమిండియా విజేతగా నిలిచింది. అప్పుడు కూడా ఇంగ్లండ్‌పైనే భారత్ విజయం సాధించడం గమనార్హం.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175) విధ్వంసకర శతకంతో చెలరేగగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే(51 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీ సాధించాడు. అభిజ్ఞాన్ కుండు(40), విహాన్ మల్హోత్రా(30), వేదాంత్ త్రివేది(32), కాన్షిక్(37 నాటౌట్) దూకుడుగా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ రెండేసి వికెట్లు తీయగా, జేమ్స్ మింటో(3/63) మూడు వికెట్లు పడగొట్టాడు. మన్నీ లమ్స్‌డెన్ ఒక వికెట్ తీసాడు. అనంతరం ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కాలెబ్ ఫాల్కోనర్(67 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లతో 115) సెంచరీతో రాణించినా.. బెన్ డాకిన్స్(56 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అంబ్రిష్(3/56) మూడు వికెట్లు తీయగా, దీపేష్ దేవంద్రన్(2/64), కాన్షిక్ చౌహన్(2/63) రెండేసి వికెట్లు తీయగా, ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో వికెట్ తీసారు.ఇప్పటి వరకు ఈ టోర్నీలో 10 ఫైనల్స్ ఆడిన టీమిండియా 6 సార్లు విజేతగా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022, 2026లో భారత్ విజేతగా నిలిచింది. విధ్వంసకర శతకంతో చెలరేగిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది.

## జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కేసులో కీలక ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

### - అరెస్ట్‌పై మధ్యంతర ఉత్తర్వులు, తొందరపడి చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశం




హైకోర్టు నేపథ్యంలో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే, జనసేన నేత అరవ శ్రీధర్ లైంగిక వేధింపుల కేసుపై ఇవాళ హైకోర్టు స్పందించింది. తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.ఎమ్మెల్యే దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు... పోలీసులకు కీలక ఆదేశాలు ఇచ్చింది.గత నెలలో రైల్వే కోడూరు నియోజకవర్గంలో పంచాయతీ ఆఫీసులో పనిచేస్తున్న హర్ష వీణ అనే ఉద్యోగిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై లైంగిక వేధింపులు,సంబంధం ఆరోపణలు చేసింది. అనంతరం పలు వీడియోలు కూడా విడుదల చేసింది. దీనిపై స్పందించిన జనసేన పార్టీ ఆయన్ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచింది. పోలీసులు కూడా కేసు నమోదు చేశారు. దీంతో అరవ శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.ఆదేశాలు ఇచ్చింది. అరవ శ్రీధర్ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వ్యవహారంలో ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఎమ్మెల్యేపై అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఒకవేళ అరెస్టు చేయాల్సి వచ్చినా రాతపూర్వకంగా కారణాలను నమోదు చేయాలని పోలీసులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లాయర్లు తమ క్లయింట్ పై రాజకీయ కక్ష్యతో ఈ కేసు పెట్టారని, అందుకే దీన్ని కొట్టేయాలని కోరారు.

## వారం - వర్జ్యం

07-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
షష్ఠి రా. 2.56
చిత్త రా. 2.30
వర్జ్యం : ఉ. 8.41-10.28
దు.ఉ. 6.30-8.06
రాహుకాలం - ఉ. 9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** విన్నూత్నరీతిలో రాజీయత్నాలు చేసికొన్ని అంశాలను అనుకూలంగా మార్చు కుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**వృషభం :** మీకు నచ్చిన ఒక వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని అదే బాటలో పయనించాలని నిశ్చయించుకుంటారు.

**మిథునం:** తనఖాలను విడిపిస్తారు. ప్రయత్నాలను ప్రారంభిస్తారు. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**సింహం:** అంతంత మాత్రంగా ఉన్న సంబంధాలను నిలుపుకోవడానికి గాను చేసే యత్నాలు ఫలిస్తాయి.వాహనసౌఖ్యం.

**కన్య :** నిష్కారణమైన నిరాశ, నిస్పృహల మధ్య కాలం వెళ్ళదీస్తారు. దైవబలాన్ని ఎక్కువగా నమ్ముతారు. వస్త్రలాభం.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్య క్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనసౌఖ్యం. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**వృశ్చికం:** సన్నిహితులతో స్వల్ప అభిప్రాయభేదాలు ఏర్పడే సవకాశాలు ఉ న్నాయి. జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** తియ్యని మాటలతో మోసగించే వ్యక్తులు తారసపడతారు. అప్రమత్తంగా ఉండండి.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** ప్రజాకర్షణతో ముడిపడిన వ్యవ హారాలు సానుకూల పడతాయి. విహారయాత్రలు చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కుంభం:** పట్టుదలను అధికంగా కలిగివుంటారు. అవగాహన లోపం వలన ఓ సందర్భంలో ఇబ్బంది పడతారు.

**మీనం :** వ్యాపారస్థులు జాగరూకతతో మెలగవలసి ఉంటుంది. గృహావసరాల ఖర్చులు అధికంగా ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న నూతన ఇఒ ముద్దాడ

## భక్తుల విశ్వాసం చూరగొనేలా పనిచేస్తా

### - అందరి సలహాలు,సూచనలతో ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడతా

### - టిటిడి నూతన ఇఒ ముద్దాడ రవిచంద్ర

**తిరుమల,:ఫిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి సేవకుడిగా కోట్లాదిమంది భక్తులకు సేవచేసే భాగ్యం దక్కిందని, భక్తుల విశ్వాసం చూరగొనేలా పరిపాలన సాగిస్తానని టిటిడి నూతన ఇన్‌ఛార్జి ఇఒ ,సిఎంఒ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర తెలిపారు. ఇదివరకు టిటిడిలో పనిచేసిన పూర్వ ఇఒలు,అనుభవజ్ఞుల సూచనలతో మరింత చక్కగా పనితీరు ఉంటుందని అభిప్రాయం వెల్లడించారు. టిటిడి బోర్డు, అధికారులతో బాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానని అన్నారు. ధార్మిక సంస్థలో ఏ విషయంలో కూడా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూస్తానని, శ్రీవారిపై భక్తివిశ్వాసాలు సన్నగిల్లకుండా తదనుగుణంగా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతన ఇఒగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు స్వీకరించడానికి ముందే ఆయన సామాన్యభక్తుడిగానే వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మీదుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ ,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకున్న ముద్దాడ దంపతులు,కుటుంబసభ్యులు తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం ఆనందనిలయంలోపల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో ఇఒగా ముద్దాడ రవిచంద్రకు ఇన్‌ఛార్జి ఇఒ వెంకయ్యచౌదరి బాధ్యతలు అప్పగించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇన్‌ఛార్జి ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. అంతకుముందు ఉదయం ముద్దాడ దంపతులు తిరుమల క్షేత్రసాంప్రదాయం పాటిస్తూ తొలుత శ్రీవరాహస్వామిని దర్శనం చేసుకున్నారు.

## తెలంగాణలో మళ్లీ వచ్చేది కెసిఆర్ సర్కారే: హరీష్ రావు

### మంచిర్యాల జిల్లా నస్పూర్ కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ నేత

**నస్పూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మళ్ళీ రాబోయేది కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత తన్నీరు హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు చేసిన సమ్మెతో ఢిల్లీ దద్దరిల్లిందని గుర్తు చేశారు. ఎంతో మంది అమరవీరుల బలిదానాలు, త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని వివరించారు. 200 రూపాయల పెన్షన్ ను 2000 రూపాయలకు పెంచి ఆసరాగా నిలిచామని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీష్ రావు కొనియాడారు. 30 ఏళ్ల మంచిర్యాల జిల్లా ఆకాంక్షను కేసీఆర్ సాకారం చేశారని గుర్తు చేశారు. జిల్లాకు మెడికల్ కాలేజీతో పాటు అద్భుతమైన కలెక్టరేట్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. సింగరేణిని అద్భుతంగా తీర్చిదిద్దడమే కాకుండా, కారుణ్య నియామకాలు అమలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 3200 మందికి పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో 1,67,000 ఉద్యోగాలు కల్పిం చడంతో పాటు 1000 గురుకుల పాఠ శాలలను ప్రారంభించినట్లు వెల్లడించారు. రెండున్నరేళ్ల పాలనలో రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు 2500 రూపాయలు, వృద్ధులకు 4 వేల పెన్షన్, యువతులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, నిరుద్యోగ భృతి ఊసే లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాతాళానికి పడిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ కు అధికారం ముఖ్యం కాదని, ప్రజల క్షేమమే ముఖ్యమని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ మ్యాచ్ పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

## స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు నిర్మాణమే లక్ష్యం

>> చంద్రబాబునాయుడు లక్ష ్యం మేరకు విజన్ 2047లో భాగంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్‌ను సాధించడమే లక్ష ్యమన్నారు. జిల్లా, మండల స్థాయి అర్బన్ లెవల్ స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులందరులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో వేర్వేరు క్యాడర్‌లలో ఉన్న అధికారులందరికీ నేడు ఇప్పుడు పదోన్నతులు లభించాయని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేదని, అయితే మెరుగైన పర్యవేక్షణ కోసం నేడు వాటిని సమన్వయం చేస్తూ స్వర్ణ గ్రామ సచివాలయాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న సుమారు 20,000 పోస్టులతో కలిపి మొత్తం 1,40,000 మంది సిబ్బంది స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ శాఖలో పనిచేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి (రేషనలైజేషన్) సేవలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను బలోపేతం చేస్తూ 10 మంది అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. మండల స్థాయిలో అధికారులకు సహాయంగా ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ ను నియమించామన్నారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మంది, ఇతర నగర పంచాయతీలలో జనాభాను బట్టి 4 నుండి 10 మంది వరకు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. క్లస్టర్ ఆధారిత సేవలను అందిస్తూ, సంబంధిత విభాగాలతో (లైన్ డిపార్ట్‌మెంట్స్) సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గుర్తుచేశారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల , పట్టణ స్థాయిల్లో ఖిస్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డుఖి శాఖలో పదోన్నతి పొందిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని ప్రజలకు గౌరవ, వేగవంతమైన సేవలను అందించాలన్నారు. స్వర్ణ గ్రామం/ స్వర్ణ వార్డు కేవలం పేరు మార్పు మాత్రమే కాదని 2047 నాటికి మన దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే ప్రక్రియలో భాగంగా ఈ మార్పు జరిగిందన్నారు. ప్రతి గ్రామం, వార్డులో మెరుగైన మౌలిక సదుపాయాలు (రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీ వ్యవస్థ) కల్పించి, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. సాంకేతికత వేగంగా మారుతోందని, ప్రభుత్వం ఇప్పటికే చాట్ బాట్లను ఉపయోగించి ఉత్తర్వులు జారీ చేసే స్థాయికి చేరిందని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలిగి, పనులను నిర్ణీత సమయంలో, నిబంధనల ప్రకారం గౌరవంగా పూర్తి చేయాలన్నారు. బయోమెట్రిక్ వంటి పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం లేని విధంగా, ప్రతి అధికారి తమ బాధ్యతను గుర్తించి సక్రమంగా పని చేయాలన్నారు. ఒక సామాన్య పౌరుడు ఆఫీసుకి వస్తే మనం ఎలా స్పందించాలో ఆలోచించి, సేవలందించాలని కార్యదర్శి కాటమనేని భాస్కర్ కోరారు.

## కొత్త బీమా పథకం

>> ప్రభుత్వం నేరుగా పర్యవేక్షించే బీమా పథకం కావటంతో దీని విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.ఈ పథకం అమలు బాధ్యత ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీకి అప్పగించబడింది. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, భద్రతలను పర్యవేక్షించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది. ఇక ఈ పథకం పొందాలి అనుకునే విదేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు, వలస కూలీలు, వ్యాపారవేత్తలు ఈ పథకానికి అర్హులు.ఆసక్తి గలవారు ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ స్కీం గురించి మరింత సమాచారం కోసం 24/7 అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్ నంబర్లు 08632340678, వాట్సాప్ నంబర్ 8500027678 ద్వారా సంప్రదించవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాలకు వెళ్లి మన రాష్ట్రం గౌరవాన్ని పెంచుతున్న ప్రతి తెలుగు వ్యక్తికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అందుకే ఈ బీమా పథకం వారి భరోసా కోసం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Amaravati-522 237, Andhra Pradesh State.

**E PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
| --- | --- | --- |
| 1 | 45/MAU61-USI0HB(OTH)/517/2025-HB, Dt:02/02/2026 | APCRDA-"Providing Housekeeping, Sanitation, Pest Control Services, including consumables for interim Government Complex (Building-1 to Building-6) at Velagapudi in Amaravati, Andhra Pradesh for a period of 2 years (24 months)". |

The bid can be downloaded on AP e-procurement portal from **07.02.2026 to 21.02.2026 up to 14.00 Hrs**. Due date for submission of Bid is **21.02.2026 up to 15.00 Hrs**, Technical bid opening **21.02.2026 @ 16.00Hrs**

**E-PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
| --- | --- | --- |
| 1 | 116/MAU61-EE0ENV/1/2026-ESM Dt. 06.02.2026 | APCRDA - "Request for Proposal (RFP) for Selection of a Private Developer for Development of Project Facility on Design, Build, Operate and Dismantle (DBOD) Basis for 50 TPD Construction & Demolition (C&D) Waste Processing Plant for Amaravati Capital City". |

The bid can be downloaded on AP e-procurement portal from **07.02.2026 to 23.02.2026 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **23.02.2026 up to 15.00 Hrs**, Technical bid opening **23.02.2026 @16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Amaravati

7-2Pg3exHMNWJQEV 3 vja_7-2Pg3exHMNWJQEV.qxd 07/Feb/26 12:53 AM Page 1

గత వారం రోజుల్లో ఏం జరిగిందో తెలుసుకుందాం... 

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 07 పేజీలు: 12 వెల: 6.50

## చర్చలు విఫలమైతే బలప్రయోగమే

9లో

## కీలక వడ్డీరేట్లు యధాతథం: ఆర్బీఐ గవర్నర్

# ఎపిలో 3 విద్యుత్ డిస్కంలకు రూ.24,420కోట్ల నష్టం

### ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రశ్నకు కేంద్రం జవాబు

విజయవాడ,ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలోని 3 డిస్కంలకు 2025 మార్చి 31 నాటికి రూ.29,420 కోట్ల నష్టాలు ఉన్నట్లు కేంద్ర విద్యుత్తుశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. అప్పటికి డిస్కంల అప్పులు రూ.77,583 కోట్ల మేర ఉన్నట్లు చెప్పారు. లోక్ సభలో అడిగిన ఒక ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని డిస్కంల సగటు సరఫరా, వాణిజ్య నష్టాలు 7.87 శాతం ఉన్నట్లు చెప్పారు. 2021 జులైలో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం ని ప్రారంభించారు. దీన్ని అనుసరించి 28 రాష్ట్రాల్లోని 45 డిస్కంలకు స్మార్ట్ మీటరింగ్ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి దేశ వ్యాప్తంగా 4.19 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీలో 56,08,846 మీటర్లకు గాను 22,88,414 మీటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో 20202024 మధ్య కాలంలో 1,629 బస్సు ప్రమాదాలు జరిగినట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రైవేట్ బస్సు ప్రమాదాల పై ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులు ఇచ్చారు. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా 58,987 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు.ఏపీలో గత 6 ఏళ్లలో 3,443 కిలోమీటర్ల నేషనల్ హైవేల నిర్మాణం జరిగిందని మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా 34 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఇదిలా ఉండగా మరోవైపు జాతీయ రహదారి విస్తరణ మొదట ప్రతిపాదనల ప్రకారం మల్కాపురం నుంచి విజయవాడ శివారులోని గొల్లపూడి దగ్గర పశ్చిమ బైపాస్ వరకు ఇప్పుడు ఉన్న 226 కిలోమీటర్లు 4 లైన్ల నుంచి 6 లైన్లుగా విస్తరించాలి. దీనికి రూ.8 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గొల్లపూడి వరకు కాకుండా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను హైవే అథారిటీ అధికారులు లేవనెత్తారు.



శుక్రవారం అండర్-19 వన్‌డేలో ఇంగ్లండ్‌పై గెలిచిన భారత్ జట్టు విజయోత్సవ హేల

# అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్‌దే

### ఆరోసారి గెలిచిన ఇండియా

### 80 బంతుల్లోనే 175 పరుగులు తీసిన వైభవ్ సూర్యవంశీ

### 2022లోనూ ఇంగ్లండ్ జట్టును ఓడించి టైటిల్‌ను సాధించిన భారత్



**న్యూఢిల్లీ:** అండర్ 19 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో ఆరో టైటిల్‌ను ముద్దాడింది. ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 100 పరుగుల తేడాతో గెలుపొం దింది. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ, బౌలింగ్‌లో

>>2

## ప్రవాసాంధ్రుల కోసం కొత్త బీమా పథకం



### విదేశాల్లో పనిచేస్తున్న తెలుగువారికి ఆర్థికభద్రత లక్ష్యం: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** విదేశాలల్లో ఉండే ప్రవాసాంధ్రులకు అండగా ఉండేందుకు కొత్త బీమా పథకాన్ని అమలులోకి తీసుకుని వచ్చినట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు.సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వా రా ప్రవాస ఆంధ్రా భరోసా పేరిట ఈ పథ కాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. విదే శాల్లో పనిచేస్తున్న ఆంధ్రులకు ఆర్థిక భద్రత, పూర్తి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు.ఇది ప్రవాసాంధ్రుల కుటుంబాలకు భీమా తో ధీమాను, భరోసాను అందించి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ పథకం ద్వారా ఉద్యోగం, విద్య లేదా వ్యాపారం కోసమైనా విదేశాలకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ నివాసితులకు బీమా రక్షణ లభిస్తుంది. ప్రవాసాంధ్ర భరోసా భీమా పథకం ప్రధాన లక్ష్యం ఇదే ముఖ్యంగా, విదేశాల్లో చదువుకునే వారికి, పని చేసేవారికి ఊహించని ఆకస్మిక సంఘటనలు ఎదురైనప్పుడు, వారి మరణం సంభవించినప్పుడు ప్రవాసాంధ్రుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా నివారించడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. పథకంలో నమోదైన వ్యక్తికి ప్రమాదవశాత్తు మరణం సంభవించినా లేదా శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా, వారి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఇస్తారు. ఈ పథకం పొంద టానికి వీరే అర్హులు ఇది రాష్ట్ర

>>2

# ఇక డిజిటల్ పాస్‌బుక్‌లు



రైతులకు పాస్‌బుక్‌లు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

### రైతుల భూములకు పూర్తి భద్రత

### 2027 జూన్‌లోపే పోలవరం పూర్తి చేస్తాం

### ఉద్యానహబ్‌గా రాయలసీమ

### నేను 1995 నాటి చంద్రబాబునే: ముఖ్యమంత్రి

**ఎమ్మిగనూరు క్రైం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రైతుల భూములకు సంపూర్ణ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కు ఎవరైనా భంగం కలిగిస్తే తాట తీస్తానని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చ రించారు. ఎమ్మిగనూరు మండలం కలుగట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన విస్తృతంగా ప్రసంగించారు. రాజముద్రతో, విశిష్ట భద్రతా ఫీచర్లతో కూడిన భూ యాజమాన్య పత్రాలను రైతులకు అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భూమి రైతుకు నమ్మకం, విశ్వాసం, అమ్మతో సమానమని ముఖ్యమంత్రి అన్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై ఎవరూ అక్రమంగా హక్కు చెలాయించకుండా భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో భూ రికార్డులను తారుమారు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా వివాదాస్పద భూములపై పెత్తనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ చట్టాన్ని రద్దు చేసి పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ సహా పలు భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని

>>2

## వెంకన్న లడ్డూ నెయ్యి బాత్‌రూమ్ రసాయనాలతో తయారీ?

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై గత ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రతిష్టను దెబ్బ తీసేలా అపవిత్ర పనులు చేశారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యిని వాడటం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి నాణ్యతపై వివరిస్తూ, బాత్రూంలను శుభ్రపరిచేందుకు ఉపయోగించే ప్రమాదకరమైన రసాయనాలతో ఆ నెయ్యిని తయారు చేయించారని ముఖ్యమంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాటు ఇలాంటి కల్తీ నెయ్యితోనే

>>2

## జగన్ పర్యటనలో అపశ్రుతి ఇద్దరు మృతి

**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆయనను చూసేందుకు వచ్చిన ఒక యువ కార్యకర్త, నాయకుడు మరణించారు. ఇబ్రహీంపట్టణంలో జోగి రమేష్‌ను పరామర్శించేందుకు ఆయన వచ్చారు.ఈ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్సీపీ నాయకుడు డి. రాంబాబు జోగి ఇంటి సమీపంలో మృతి చెందాడు. జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న రాంబాబు ఇంటి సమీపంలోనే పల్స్ పడిపోయి కుప్పకూలాడు. సమీప ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. ఇబ్రహీంపట్నంలోని చిల్లకల్లు వైఎస్సార్సీపీ గ్రామ అధ్యక్షుడిగా డి. రాంబాబు ఉన్నారు. ఈ విషయంపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని,రాంబాబు హృద్రోగ సమస్యతో ఉన్నారని,జగన్‌పై అభిమానం కార్యక్రమానికి వచ్చారని వైకాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. రాంబాబు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని,ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని తన్నీరు తెలిపారు.ఇక జగన్ వస్తున్నారనే ఉత్సాహంతో బైక్ పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్ ను గుద్దుకుని ఒక యువకుడు మృతి చెందారు.అతన్నియువకుడు భార్గవ్ గా గుర్తించారు.ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు

>>2



శుక్రవారం అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

# స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు నిర్మాణమే లక్ష్యం

### ప్రతి ఉద్యోగి భాగస్వామికావాలి: మంత్రి డోలాబాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ,వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యమని అని అన్నారు. ముఖ్యమంత్రి నారా

>>2

## మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకి 573 కోట్లు మంజూరు

### విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్65 ఆరులేన్లుగా విస్తరణ: కేంద్రమంత్రి గడ్కరీ



**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో ఎన్‌హెచ్ నెట్‌వర్క్ అభివృద్ధికి నిరంతర నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంటులో తెలిపారు.తన సామాజిక మాధ్యమంలోను కీలకం ఈ విషయం వెల్లడించారు. మచిలీపట్నం పోర్టుకు ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్ 216 జంక్షన్ నుంచి ఆరు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ.573.77 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ట్వీట్‌లో నితిన్ గడ్కరీ వివరించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా ఫ్రైట్ టర్న్‌అరౌండ్ టైమ్ సహా ట్రాఫిక్ కంజెస్టన్ తగ్గుతుందని కేంద్రం వెల్లడించారు. విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలు నేరుగా మచిలీపట్నం పోర్టుకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అనుసంధాన హైవే నిర్మాణానికి రూ.573.77 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో 8 కి.మీ. మేర ఆరు వరుసలతో దీనిని నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్)

>>2



## ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు

9లో

### 31మందిపైగా దుర్మరణం

### 160మందికిపైగా గాయాలు

వార్త

ఆపదలు రెండు రకాలు. ఒక రకం మనకు దురదృష్టాన్ని తెచ్చిపెడితే, ఇంకోరకం ఇతరులకు అదృష్టాన్ని ఆర్జించిపెడుతుంది.

-ఆంబ్రోస్ బియర్స్

# కాలుష్యం కట్టడికి దారేది?

పంచభూతాలు కాలుష్యమౌతున్న ఈ రోజుల్లో ఊరేమిటి? పేరేమిటి ఎక్కడైనా కాలుష్యమయమే. ఇటీవలి కాలం వరకు దేశ రాజధాని న్యూఢిల్లీ కాలుష్యం గురించి బాగాచెప్పుకునేవారం. అంతకుమించి కాలుష్యం హైదరాబాద్‌లో ఉందంటే నమ్మాల్సిందే. ఢిల్లీ కాలుష్య లెక్కలు ఢిల్లీవి. హైదరాబాద్‌లో లెక్కలు హైదరాబాద్‌వి. జల, వాయు, నీటి కాలుష్యాలతో పోటీ పడిన చాలా విషయాలు ఆశ్చర్యం గొల్పుతాయి. దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ ఇప్పుడు కాలుష్య రాజధానిగా నిర్ధారితమైంది. ముంబయి నగరంతో పోల్చిచూసుకున్నా తెలంగాణలో పారిశ్రామికకాలుష్యం గురించిన హెచ్చరికలు బాగా వెలుగు చూస్తున్నాయి. గత రెండు మూడేళ్లుగా జంట నగరాల్లో కాలుష్యం ఈప్రాంత ప్రజల ఆరోగ్యాలను కబళిస్తోంది. ఆరోగ్యపరమైన వాతావరణం కోసం ప్రభుత్వాలు పరిశ్రమల తరలింపు ప్రయత్నాలు చేస్తున్నాయన్న వార్తలు వినిపిస్తున్నా వాటికి నిర్దిష్టమైన రూపం వెలుగు చూడలేదు. హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడంతో తీవ్ర వాయు కాలుష్య సంక్షోభంలో అల్లాడుతోంది. గత యేడాది ఈ రోజుల్లోనే అనేక ప్రాంతాలలో గాలి నాణ్యతా సూచి (ఏక్యూ) 150కి దాటింది. పిఎం 2.5, పిఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్‌ల హానికర కాలుష్య కారకాల సాంద్రతలు బాగా పెరిగాయి. కొన్ని ప్రాంతాలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన పరిమితుల కన్నా100రెట్లు అధికంగా హానికర కాలుష్యంనగరమంతా వ్యాపించి ఉంది. క్షీణిస్తున్న గాలి నాణ్యత కారణంగా శ్వాసకోస వ్యాధుల తీవ్రత పెరిగింది. నగరమంతటా ఆస్మా రోగగ్రస్తుల సంఖ్య తక్కువేమీ కాదు. పైగా వారికి దీర్ఘకాలిక దగ్గు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కేసులు విపరీతంగా పెరిగాయి. యేడాది పొడవునా కాలుష్యస్థాయి పెరిగితే అందులో శీతాకాలంలో అనారోగ్య ప్రభావాన్ని తీవ్రతరమౌతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కంటే రెట్టింపు స్థాయిలో సూక్ష్మ ధూళికణాలు వ్యాప్తి చెందినందున ప్రధాన ట్రాఫిక్ కారిడార్లన్నీకాలుష్య కేంద్రాలుగా మారిపోయాయి. ఢిల్లీ, ముంబయి వంటి నగరాలతో పోల్చి చూసినా గాలి నాణ్యతను బట్టి కాస్త మెరుగ్గా ఉందనిపించిన ఎప్పుడు ప్రమాదకర పరిస్థితిని సమీపిస్తుందోనని కాలుష్య నియంత్రణ మండలిఆందోళన పడ్తోంది. ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్' సదస్సులో విడుదల చేసిన నాణ్యతా గణాంకాలు నగర వాసులనుఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల మేరకు 40మైక్రోగ్రాములు ఉండాల్సి ఉంది. కానీ హైదరాబాద్‌లో 82 నుంచి 88 ఎంజీల వరకు ఉంటోంది. రెట్టింపు కాలుష్యాన్ని పీలుస్తున్నామన్న మాట. కేంద్ర కాలుష్య మండలి పరిమితి60ఎంజీతో పోల్చిచూస్తే హైదరాబాద్‌లో 35 శాతం అధిక కాలుష్యం ఉంది. గతంలో ఒక్కరోజు కూడా గాలినాణ్యతా సూచీలు(ఏక్యూఐ)సంతృప్తి స్థాయిలో ఉన్న దాఖలాలు లేవు. స్వచ్ఛమైన గాలి పీలుస్తా మనుకున్న సందర్భాలు లేవు. ఈ యేడాది జనవరిలో పిఎం-10 స్థాయి గరిష్టంగా 105ఎ.జి వరకు చేరుకుంది. అంటే గాలిలో విషతుల్యత పెరుగుతోందన్న విషయం స్పష్టమౌతోంది. వీటికి కారణమేంటని పరిశీలిస్తే పారిశ్రామిక కాలుష్యానికి తోడుగా వాహన కాలుష్యం స్థాయి కూడా పెరిగింది. ఢిల్లీలో మాదిరిగానే హైదరాబాద్‌లోనూ కాలుష్య సమస్య పరిష్కారానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడమొక్కటేనన్న సూచనలు అందుతున్నాయి. జంటనగరాల మొత్తం కాలుష్యంలో సగం కన్నా ఎక్కువ వాహన కాలుష్యానిదేనన్న దృఢమైన నిర్ధారణతో ఎలక్ట్రిక్ వాహనాలకి రాజమార్గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. కాగా హైదరాబాద్ నగరంలో ఇటీవల 20వేల సిఎన్‌జి, ఎల్‌పిసి ఆటోలకు అనుమతి దొరికింది. సిఎన్‌జి వాహనాలతో కార్బన్ డైఆక్సైడ్ విడుదలవుతుంది. 2008-2020ల మధ్య హైదరాబాద్ ఏటా5552 మంది వాయు కాలుష్యానికి బలికాగా, 2023లో మాత్రం 1597 మరణాలను నమోదుచేసింది. ఆ లెఖ్ఖన ఇండియాలోనే హైదరాబాద్ ప్రమాదకర చావుల్ని కలుగ చేసే ఆరో నగరంగా నమోదైంది. నగరంలో పాశమైలారం, బొల్లారం పారిశ్రామిక ప్రాంతం, సనత్‌నగర్‌లు కాలుష్యస్థాయిలు అధికంగా ఉండే ప్రాంతాలుగా అందరికీ తెలిసిందే. కొంపల్లి, కుకట్‌పల్లి, ఖైరతాబాద్, కోటి, మెహదీపట్నం, హైటెక్‌సిటీల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో పిఎం 25, పిఎం 10లు గుర్తించారు. అంటే కాలుష్య వ్యర్థాలు వెలువడే ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ యేడాది తొలినాడే సగటున 339పాయింట్లు కాలుష్య ఇండెక్స్‌లో నమోదైంది. కోవిడ్ సమయంలో ట్రాఫిక్ లేనేలేదు. జనం రద్దీలేదు అలాంటప్పుడు కాలుష్యం అప్పట్లో ఎక్యూఐ స్థాయి 98 నుంచి 100వరకు తగ్గింది. ఒకపక్క విద్యుత్ వాహనాల అవసరాన్ని నిపుణులు నొక్కిచెబుతున్న పరిస్థితుల్లో మరో పక్క కాలుష్యకారక వాహనాలకు అనుమతినీయడం ఎవరూ జీర్ణించుకులేకపోతున్నారు. 30నుంచి 40 శాతంగా ఉన్న వాహన కాలుష్యాన్ని కట్టడిచేయడానికి విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే పూర్తిబాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. మరో విషయమేమిటంటే హైదరాబాద్ వంటి నగరాల్లో రానున్నా వేసవిలో జలకాలుష్యం కూడా ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవలే మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌లో కొన్నిమరణాలు నమోదయ్యాయి. నగరంలో వాయుకాలుష్యం పెరగడానికి నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులు, పారిశ్రామిక ఉద్గారాలు కూడా ప్రధాన కారణమే. వీటి వలన గాలి నాణ్యత పడిపోకుండా చూడాలి. జల, వాయు కాలుష్యాలు పోటీ పడి ప్రభావం చూపుతున్నప్పుడే అప్రమత్తత అవసరం.

జీవితంలో తృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎన్నడూ విచారానికి గురికాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దు:ఖానికి గురౌతూనే ఉంటాడు.



జార్జి ఇలియట్

మనం ఇష్టపడినది దక్కనప్పుడు, మనకు దక్కిన దానినే ఇష్టపడాలి.



రామకృష్ణ పరమహంస

# ఇంకెన్నాళ్లీ కంచి గరుడ సేవ?

**పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించకూడదు. ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారసులనో అందలంఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీ పరి స్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. క్రమేణ క్షేత్రస్థాయిలో పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు దూరమైపోతున్నారు. కూలీకి తీసుకువచ్చి డబ్బులతోపాటు, బిర్యాని ప్యాకెట్, మద్యం సీసా ఇచ్చి కార్యకర్తలుగా చూపించుకోవాల్సిన దౌర్భాగ్యపరిస్థితులు దాపురించాయి. ఒక్కటిమాత్రం వాస్తవం కార్యకర్తలు లేని పార్టీ, పునాదులు లేని భవనాల్లాగా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

'కూడు గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతాం' అన్నట్టుగా ఉంది కార్యకర్తల పట్ల రాజకీయ పార్టీల వైఖరి. ధర్నాలంటారు, రాస్తారోకోలంటారు, పార్టీ సమావేశాలంటారు, కార్యకర్తల మీటింగ్‌లంటారు, శిక్షణాతరగతులంటారు, పార్టీ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలంటారు, బహిరంగ సభలకు జనాన్ని తరలించుకు రావాలంటారు. ఇలా ఒక్కటేమిటి యేడాది పొడుగునా ఏదో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూనే ఉంటారు. పైకి ఏమనలేకపోయినా జీతభత్యం లేని ఈ కంచిగరుడ సేవ ఇంకెన్నాళ్లనుకునేవారి సంఖ్య ఎక్కువైపోతున్నది. ముఖ్యంగా దిగువ శ్రేణి నాయకులకు ఆర్థికభారం ఎలా భరించాలన్నదే సమస్యగా పరిణమిస్తున్నది. కొందరు కార్యకర్తలు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఏనాటికైనా తమ సేవలను గుర్తించకపోతారా? ఏదో పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. గతంలో ఇలా రాజకీయ కార్యకర్తలుగా జీవనం ప్రారంభించిన వారెందరో సర్పంచులుగా, సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, పార్లమెంటు సభ్యులుగా, కేంద్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడినప్పుడు కార్యకర్తలే నాయకత్వం వహించి పెద్దపెద్ద పదవులను అధిష్టించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో నూతన నాయకులు పుట్టుకొచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఆనాడు వెనుకబడిన తరగతుల వర్గాల నుంచి ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దింది. అలా నాయకులుగా ఎదిగిన వారెందరో అటు పాలనలోనూ, ఇటు ప్రజాభిమానం పొందడంలోనూ గుర్తింపు కలిగిన స్థానం సంపాదించుకోగలిగారు. మొన్నటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో కార్యకర్తలు మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా ఎదగడమేకాదు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఇలాంటివారిని ఆదర్శంగా తీసుకొని కొందరు కార్యకర్తలు ఏళ్లతరబడి జెండాలుమోస్తూ నాయకత్వం ఇచ్చినఆదేశాలను తు.చ తప్పకుండా పాటిస్తూ అవిరామంగా కృషిచేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడుతమ సేవను గుర్తించకపోతారా? అవకాశం ఉన్నప్పుడు నామి నేటెడ్ పదవుల్లో తమతమ స్థాయిని బట్టి నియమించక పోతారా? అనేదే వారి ఆశ, తపన, ఆరాటం. కానీ పరిస్థితులు మారిపోయాయి. దాదాపు అన్నిపార్టీల్లోనూ క్షేత్రస్థాయి లో అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరిస్తున్నారే మోననిపిస్తున్నది. పార్టీలపరంగా సిద్ధాంతాలు ఏర్పరుస్తున్నా అందులో తమకు ఎలా లాభం, అవకాశాలు దక్కించుకోవాలనే ఆరాటం అధిక శాతం నేతల్లో కన్పిస్తున్నది. అందుకే యువతకు ప్రాధాన్యత అంటే కుమారులనో, అల్లుళ్లనో కొందరు నేతలు ముందు పెడుతున్నారు. మహిళలు అంటే కుమార్తెలనో, భార్యల పేర్లనో చెబుతున్నారు. రానురాను రాజకీయ వారసులు ఎక్కువైపోతున్నారు. చివరకు సర్పంచ్ పదవులను కూడా వదిలిపెట్టడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య కార్యకర్తలకు భవిష్యత్‌లో కూడా కనుచూపు మేరలో అవకాశాలు కన్పించడం లేదు. పెద్దపెద్ద పదవుల సంగతి దేవుడెరుగు. వార్డుమెంబర్లు లాంటి చిన్న పదవులకు కూడా ఈ సంప్రదాయం విస్తరిస్తున్నది. అందరికి పదవులుఇవ్వడం అనేది సాధ్యమయ్యేపనికాదనేది వాస్తవం కావొచ్చు. అసలు ప్రజాసేవ, ప్రజాభిమానం వంటి కొలమానంతో పదవులు ఎంపిక చేసే రోజులకు కాలం చెల్లిపోయింది. దాదాపు ప్రతి పార్టీ కూడా గెలుపు గుర్రాలకోసమే అన్వేషణ. ఆర్థిక స్తోమత

ఒక్క మాట

ఉందా? ఖర్చు పెట్టగలిగే శక్తిఉందా? కుల బలం ఏమిటి? ఏ నాయకుడికి తోకగా, భాకాగా వ్యవహరిస్తున్నారని చూస్తున్నారే తప్పప్రజలకు, పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని పట్టించుకునే రోజులు పోయాయి. రాజకీయమే ఒక ఖరీదైన వ్యాపారంగా రూపుదాల్చింది. పెట్టుబడులుపెట్టడం, ఎన్నికల్లో గెలవడం, తిరిగి రాబట్టుకోవడం, మళ్లీ పెట్టుబడి ఇలా ఒక విషవలయంగా మారి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఈ విష వలయంలోకి రాగలుగుతున్నారు. సామాన్యులెవరూ ఆవైపు కన్నెత్తిచూసే ధైర్యం చేయలేకపోతున్నారు. ప్రజలతో సంబంధం లేనివారు నేరుగా మంత్రులైపోతున్నారు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా ఇవేపరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్ పదవికూడా లక్షలాది రూపాయల డబ్బు, మద్యం వెచ్చించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఇదేదో కొత్తవిషయం కాదు. అందరికి తెలిసిందే. కానీ ఈ సంప్రదాయం రానురాను శృతిమించిపోతున్నది. 2004లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో కోటీశ్వర్లు ముప్పైశాతంఉంటే, 2024 నాటికి తొంభైమూడు శాతా నికి పెరిగింది. ఇక దేశవ్యాప్తంగా 492 మంది ఎమ్మెల్యేల ప్రమాణపత్రాలను ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఎడిఆర్)గత యేడాది పరిశీలిస్తే మూడువేల మూడువందల ఎనభైఎనిమిది మంది శాసనసభ్యులు కోటీశ్వరులు కాగా, మరో ఆరువందల తొంభై నాలుగు మంది లక్షాధికారులని ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన అఫిడెవిట్‌లోనే వెల్లడించారు. ఇక రాత్రికిరాత్రి పార్టీలు మార్చే దుస్సంప్రదాయం కూడా విస్తరిస్తున్నది. ప్రత్యర్థిపార్టీలో ఉండి విమ ర్శలు కురిపించి తెల్లవారేసరికి పార్టీ మార్చి అధికారం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రజాసేవ కోసమే తాము అధికార పార్టీలోకి మారుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ శిక్షణలు, సిద్ధాంతాలు, మానిఫెస్టోలు ఎందుకు అనే అనుమానాలు రాకతప్పదు. ఒకవేళ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణ, ప్రజా సేవల గురించి శిక్షణ ఇవ్వాల్సి వస్తే ముందుగా పదవులు వెలగబెడుతూ పార్టీపరువు, ప్రతిష్టను బజారున పెడుతున్న పెద్దలకు ఇవ్వాలి. పార్టీలోనే ఉంటూ గోతులుతవ్వే నాయకులకు ఇవ్వాలి. కేవలం అధికారంకోసం కప్పదాట్లకు సిద్ధపడే నేతలకు ఇవ్వాలి. ఎన్నిశిక్షణలు ఇచ్చినా, ఎన్ని నిబంధ నలు పెట్టుకున్నా పాటించేవారే లేకుండాపోతున్నారు. దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉండి ప్రజాభిమానం చూరగొని పార్టీ ద్వారా పదవులు, సకలసౌకర్యాలు అనుభవించి తరతరాలకు సరిపోయే సంపద కూడపెట్టుకొన్నవారు కూడా కప్పదాట్లకు పాల్పడుతుండడం అత్యంత దురదృష్టకరం. కొందరునేతలు తమవ్యాపారాల రక్షణ, విస్తరణ కోసం, మరికొందరు వారసులపై వాత్సల్యంతో వారిని ఎన్నికల్లో దింపేందుకు ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తున్నారు. ఇలా రకరకాల కారణాలతో పార్టీల మార్పిడికి తెగబడుతున్నారు. ఈపార్టీ, ఆపార్టీ అనికాదు అన్ని పార్టీల్లోనూ దాదాపు ఇదేపరిస్థితి నెలకొన్నది. ఇక క్రమశిక్షణ అన్నది చాలా పార్టీలు ఏనాడో మరచిపోయాయి. పార్టీకి నష్టం తెచ్చే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా మనవాడేకదా అని సర్దుకుపోతే మళ్లీమళ్లీ ఇలాగే జరుగుతుంటుంటాయి. ప్రజల దృష్టిలో పార్టీచులకన అవుతుంది. ఇంటి దీపమే కదా అని ముద్దు పెట్టుకుంటే మూతికాలక తప్పదనే విషయాన్ని విస్మరించకూడదు. క్రమశిక్షణలో విఫలమై, ప్రజలకు దూరమైన పార్టీలు, నేతలు ఎందరో ఉన్నారు. ప్రజల్లో ఎంతోచైతన్యం వచ్చింది. ప్రతినాయకుడి కదలికల ను, ప్రవర్తనా శైలిని ప్రజలు వెయ్యి కళ్లతో గమనిస్తున్నారు. ముఖ్యంగా కష్టం కలిగినప్పుడు పార్టీని వదిలివెళ్లి, ఇష్టం వచ్చినప్పుడు తిరిగి రావొచ్చనే దుస్సంప్రదాయానికిఅడ్డుకట్ట వేయాలి. అధికారంలో ఉన్నప్పుడు సకలసౌకర్యాలు అనుభ వించి ఆర్థికంగా స్థిరపడి, అధికారం కోల్పోగానే అంతవరకు తాముివిమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలుకాదు. కొందరు నేతలే. పేర్లురాసి వారిని ఇబ్బందిపెట్టడం ఎందుకు కానీ, వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియంది కాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల నేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలుమోస్తూ పార్టీకి, ప్రజలకు సేవచేస్తున్నకార్యకర్తలను విస్మ రించకూడదు. ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్త లకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారసులనో అందలం ఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీపరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. క్రమేణా క్షేత్రస్థాయిలోపార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు దూరమైపోతున్నారు. కూలీకి తీసుకువచ్చి డబ్బులతోపాటు, బిర్యాని ప్యాకెట్, మద్యంసీసా ఇచ్చి కార్యకర్తలుగా చూపించుకోవాల్సిన దౌర్భాగ్యపరిస్థితులు దాపురించాయి. ఒక్కటిమాత్రం వాస్తవం కార్యకర్తలు లేని పార్టీ, పునాదులు లేని భవనాల్లాగా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు. ●

# ధరల భారంతో కుంగుతున్న సామాన్యుడు..

లాడెల చిన్న ఈరన్న

ఆం సామాన్యుడి జీవితంలో 'నెల ఎలా గడిచింది?'అనే ప్రశ్న ఇప్పుడు 'నెల ఎలా గడపాలి?'అనే ఆందోళనగా మారింది. ఆదాయం స్థిరంగా ఉన్నా, ఖర్చులు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. కూరగాయలు, బియ్యం, పప్పులు, పాలు, వంట నూనె వంటి నిత్యావసరాల ధరలు ప్రతి వారం కొత్త రికార్డు సృష్టిస్తున్నాయి. దీనికితోడు సామాన్యులు తమ పుత్ర, రత్నాలకు తమకు తోచిన విధంగా పెండ్లిల్లు చేయాలంటే బంగారం, వెండి వస్తువుల వైపు చూడాల్సి వస్తుంది. అవి కూడా ఆకాశాన్ని తాకుతూ వస్తున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో నిపుణులకే అర్థం కావడం లేదు. సరే ఇదే రేట్లు రైతులు పండించిన పంటల్లో ఉన్నాయా అంటే అలా లేదు. వారి దగ్గర ఏమో తక్కువ రేటు ఇక్కడేమో ఎక్కువ రేటు కొనబోతే కొరివి అమ్మ బోతిఅడివి అన్నచందంగా తయారైంది ప్రస్తుత సామాన్యుల పరిస్థితి. ఒకప్పుడు మార్కెట్కు వెళ్లిన కుటుంబాలు, ఇప్పుడు జాబితా చేతిలో పెట్టుకుని ఒక్కో వస్తువు తీసుకునే ముందు రెండు సార్లు ఆలోచించే పరిస్థితికి చేరుకున్నాయి. ధరల పెరుగుదల సామాన్యుడి జీవనశైలినే మార్చేస్తోంది. అవసరాలు తగ్గించుకోవడం, కోరికలను వాయిదా వేయడం, కొన్నిసార్లు అవసరాలకే తాళం వేయడం నేటి వాస్తవంగా మారింది. ధరల భారంతో కుటుంబ బడ్జెట్ పూర్తిగా కుదేలైంది. జీతం వచ్చిన రోజే అద్దె, విద్యుత్ బిల్లు, గ్యాస్ ఖర్చులు పోయి చేతిలో మిగిలేది చాలా తక్కువగా ఉంటోంది. పిల్లల చదువు ఖర్చులు, వైద్యఅవసరాలు, అదనపు భారం అవుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాల్లో పొదుపు అనేమాట దాదావు కనుమరుగవుతోంది. పేద కుటుంబాల పరిస్థితి మరింత కఠినంగా మారింది. రోజు కూలీపై ఆధారపడే కుటుంబాలు పనిదొరికినా, వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని నడపలేనిస్థితికి చేరుతున్నాయి. ఈ పరిస్థితి కేవలం ఆర్థిక సమస్యగానే కాదు, మానసిక ఒత్తిడిగా కూడా మారుతోంది. ధరల పెరుగుదల వెనుక కారణాలు ఎన్నోఉన్నా, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. సరఫరా వ్యవస్థలో లోపాలు, దళారుల ఆధిపత్యం, నిల్వలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి అంశాలు ధరలను పెంచుతున్నాయి. కానీ వీటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన చోటప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధరల నియంత్రణపై స్పష్టమైన వ్యూహం లేకపోవడం సామాన్యుడిలో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజల జీవన వ్యయం పెరిగితే, పాలనపై విశ్వాసం తగ్గడం సహజమే అనే భావన బలపడుతోంది. ధరల భారం నుంచి సామాన్యుడికి ఊరట కల్పించాలంటే కఠిన నిర్ణయాలు అవసరం. నిత్యావసర వస్తువుల ధరలపై కట్టుదిట్టమైన నియంత్రణ, మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత, దళారులపై కఠినచర్యలు తీసుకోవడం అత్యవసరం. అదే సమయంలో ఆదాయ వర్గాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలి. సామాన్యుడి జీవితం సులభమైతేనే సమాజం స్థిరంగా ఉంటుంది. ధరల భారం తగ్గిన రోజే సామాన్యుడి ముఖంలో ఆశ, భవిష్యత్తుపై నమ్మకం మళ్లీ కనిపిస్తుంది. ధరల నియంత్రణ ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అయినప్పటికీ, ఆ బాధ్యత సరిగ్గా నిర్వర్తించబడుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్కెట్లో ధరల పెరుగుదలపై పర్యవేక్షణ లేకపోవడం, దళారుల ఆధిపత్యం, సరఫరా వ్యవస్థలో లోపాలు సామాన్యుడిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకోవాల్సిన చోట, ప్రకటనలకే పరిమితమవుతున్న పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ధరల భారం నుంచి సామాన్యుడికి ఊరట కల్పించాలంటే మాటలు సరిపోవు, కార్యాచరణ అవసరం. మార్కెట్ నియంత్రణను బలోపేతం చేయడం, నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించే విధానాలను కఠినంగా అమలు చేయడం, ఆదాయవర్గాలకు అనుగుణంగా సంక్షేమ చర్యలు తీసుకోవడం అత్యవసరం. ●



# ప్రజావాక్కు



## సెల్‌ఫోన్లకు బానిసలవుతున్న యువత

సెల్‌ఫోన్లకు విపరీతంగా బానిసలై పోతున్నారు ఈనాటి యువత. ఈఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య రానురాను పెరుగుతోంది. దీనికి విరుగుడు కనుచూపుమేరలో కనిపించడంలేదు. అందరూ సాంకేతికత పెరుగుదలను పొగుడుతున్నారేకాని ఆప్రక్కనే ఉన్న అపాయాలను ఊహించలేదు. ముఖ్యంగా విద్యార్థుల చేతులలో పుస్తకం బదులు సెల్‌ఫోన్లే కనిపిస్తున్నాయి. మొన్నీమధ్య ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు కొరియన్ గేములకు బానిసలై బడికి వెళ్ళకపోతే తల్లిదండ్రులు మందలించగా ఈపిల్లలు తొమ్మిదోఅంతస్తు నుండి దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఎంతసేపు లేకఎంతకాలంపిల్లలనుకాపు కాయాలి? ఆత్మహత్యలు బహుతేలికైపోయాయి. కొన్ని దేశాలలో మైనారిటి దాటని పిల్లలను ఫోన్లువాడడం నిషేధించింది. వీటిలో అర్థం పర్థం లేని సమాచారాన్ని వీడియోలను చట్టపరంగా నిషేధించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## దేవుడు లేనిదెక్కడ?

మన్నులో, రాయిలో, కొమ్మలో, రెమ్మలో, ఆకులో, పూవ్వులో ప్రతిమనిషిలోసర్వజీవుల్లో అణువణువుల్లో భగవత్ స్వరూపం నిండి ఉంది. ఆ స్వరూపాన్ని దర్శించుకోవాలి. అయితే ఇలాంటివి తెలియక దేవుడు గుడిలో, చెర్చిలో, మసీదులో ఉంటాడనుకుని అమాయకంగా భక్తజనంవ్యయ ప్రయాసల కోర్చి దేవుడి కోసం ఎక్కడికక్కడ వెళుతుంటారు. మరికొంత మంది రాజకీయవేత్తలు రాముడే దేవుడంటారు. ఆయన భజన చేస్తున్నారు. ఓట్లకోసం రాముడి పేరును ఉపయోగిస్తున్నారు. పథకాలకు కూడా ఆరాముడి పేరే పెడుతున్నారు. రామభక్తులు ఎప్పుడూ ఇలా చేయరు.

- మిథునం, హైదరాబాద్

## భూమి అభివృద్ధి లోనే..అసలు ఉపాధి

**భూమి** అభివృద్ధి చేసిన తరవాత వాటిని వినియోగంలోకి తెమ్మని ఆ దిశగాఅడుగులు వేయమని చెప్పాల్సిన బాధ్యత పంచాయితీ కార్యదర్శుల మీద ఉంటుంది. ఇక్కడ రెండు అంశాలను పరిశీలిస్తే ఎక్కువ మంది కూలీలకు ఒకేదగ్గర పనిచేసే అవకాశం దొరుకుతుంది. సగటు వేతన రేట్ కూడా ఎక్కువ. ప్రభుత్వం నుండి రావాల్సిన రైతు భరోసా నిధులు సమాకూరుతాయి. అంతమాత్రమే కాదు పీయం కిసాన్ యోజన కూడా అదనం.

-భారత అవినాష్, జనగాం

## అవుట్ సోర్సింగ్ కీలకపాత్ర

**నేటి** ఉపాధి రంగంలో అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొన్నిఏజెన్సీల అక్రమధోరణులు కార్మికులకు శాపంగా మారుతున్నాయి. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంస్థలు భారీ మోసాలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం లేదా ప్రైవేట్ సంస్థల నుండి వచ్చే నిధులను కార్మికులకు పూర్తిస్థాయిలో అందించకుండా మధ్యలోనే దారి మళ్లిస్తున్నాయి. సరైన వేతనాలుచెల్లించకపోవడంతో పాటు చట్టబద్ధంగాఅందాల్సిన ప్రయోజనాలను కాలరాయడం ఆందోళన కలిగించే అంశం. నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగికి ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల రాష్ట్ర బీమా, గ్రాట్యుటీ, వైద్య సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కానీఅనేక ఏజెన్సీలు కార్మికుల వేతనాల నుండి పీఎఫ్ వాటాను కోత విధిస్తున్నప్పటికీ, ఆ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. అలాగే వైద్య అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన ఈఎస్ఐ సౌకర్యాన్ని కూడా గాలికి వదిలేస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యం బారిన పడినప్పుడు కార్మికులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## గంజాయి సరఫరా

**దేశంలో** చట్టాలు కఠినమవుతున్నాయన్న భావన ఉన్నప్పటికీ, గంజాయి సరఫరామాత్రం అడ్డుకట్టలేకుండా విస్తరిస్తోంది. పట్టణాల నుండి పల్లెలవరకు ఈనిషేధిత మత్తుబారిన పడుతున్నది ముఖ్యంగా యువత. ఇది చట్టసంబంధ సమస్యమాత్రమే కాదు సమాజంపై పాకుతున్న మహమ్మారి. సరిహద్దు రాష్ట్రాల నుండి భారీగా రహస్య రవాణా, పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయంఇవన్నీ సంఘటిత నేరవ్యవస్థగా మారాయి. అరెస్టులు జరిగినప్పటికీ, డిమాండ్ పెరగడంవల్ల ఈ వ్యాపారం ఆగట్లేదు.

-కె.రామారావు, నల్గొండ

## ప్రతిభను ప్రోత్సహించాలి

**తల్లిదండ్రులు** తమ పిల్లలను బాగా చదివిపైకి రావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏ రంగంలో ఆసక్తిగలదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ఉపాధ్యాయులు విలువగల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. చిన్నచిన్న తప్పులను క్షమించి మరో సారిపునరావృతం కాకూడదని గట్టిగాహెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్, బెంగళూరు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పెరుగుతున్న జిడిపి ఎవరి పాలు?



డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ఇనీక్వాలిటీ రిపోర్ట్ ప్రకారం మనదేశంలో మొత్తం 100 రూపాయలు జీడీపీ ఉత్పత్తుల్లో పై వర్గానికి, 60 రూపాయలు మధ్యతరగతికి, దిగువన ఉన్నవారికి 15 రూపాయలు పొందుతున్నారు. ప్రపంచ అసమానతల నివేదిక చూస్తే పైనున్న10 శాతం మంది కుబేరుల జాతి ఆదాయంలో 58శాతం సంపాదిస్తున్నవైపరీత్యాన్ని చెబుతున్నది. ఇది 2022 లో కన్నా అధికం అయితే మరోవైపు అడ్డఅడుగున 50 శాతం మంది కేవలం 15 శాతంమాత్రమే పొందగలుగుతున్నారు. 2025 సెప్టెంబర్‌లో చూస్తే పన్ను మినహాయింపు తర్వాత పెట్టుబడి లాభాల నిష్పత్తి 1.47 శాతంగా ఉంటుందని అంతులేని దోపిడీతో పోగుబడినహద్దు మీరిన లాభాల ప్రత్యక్షదృశ్యం ఇది. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో ప్రవేట్ పెట్టుబడులో పెరగకపోగా విదేశీ పెట్టుబడులు కూడా దేశంలోకి రావడం తగ్గిపోయాయి. మన పెట్టుబడిదారులు విదేశాల్లోపెట్టుబడులు పెట్టడంఎక్కువైంది. అధిక ఆదాయం పొందుతున్న వారు అధిక పన్ను కట్టాల్సి ఉండగా ఈ వర్గాన్ని ముట్టుకునే సాహసం నేటి ప్రభుత్వాలు చేయడం లేదు. కార్పొరేట్ రంగానికి లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారు. వీరు ఈ దేశంలో పెట్టుబడులు పెట్టకుండా ఇక్కడ సంపాదించుకున్న డబ్బులు పోగుచేసుకునే విదేశాల్లో పెట్టుబడులు పెట్టుటకు పరుగులెత్తుతున్నారు. 2014 నుంచి 2025 వరకు 26500మంది మన సంపన్నులు వేరే దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకువెళ్లిపోయారు. ఫలితంగా జిడిపిలో పారిశ్రామిక ఉత్పత్తిగణనీయంగా తగ్గిపోయింది. మ్యాను ఫ్యాక్చరింగ్ రంగంలో పనిచేసే కార్మికులు కూడా ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దీనికితోడు మేక్ ఇన్ ఇండియా ఆత్మనిర్భర భారత్ ఉత్పత్తి అనుబంధ రాయితీలు మొదలైనవి ఉద్యోగ కల్పనలో విజయవంతం కాలేదు. సీఎంఐ డేటా ప్రకారం కార్పొరేటర్లు తాముపెట్టిన పెట్టుబడిపై పొందుతున్న లాభాలు గత 14ఏళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా పొందుతున్నారు. నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన తరువాత ప్రపంచీకరణ పుణ్యమా అని, పేదలకూ సంపన్నులకూ మధ్యపూడ్చలేనంత వ్యత్యాసం ఏర్పడింది. ఆర్థికసంస్కరణల వల్ల సృష్టించబడే సంపద అట్టడుగున ఉన్న పేదల వరకూ చేరుతుందనీ ఆర్థికవేత్తలు, పాలకులు పేర్కొన్నారు. అయితే, సంస్కరణల పేరుతో సాగిన ప్రైవేటీకరణ కారణంగా సృష్టించబడిన సంపదలో సింహభాగం పైస్థాయి ఉన్నత ఆదాయ వర్గాల వారికి చేరింది. పెరిగిన జీడీపీలో నామమాత్రపు భాగం మాత్రమే కింది వర్గాలకు చేరుకుంది. దేశం తలసరి ఆదాయం ప్రస్తుతం 3000 డాలర్లు ఉండగా ఉన్న




త ఆదాయ వర్గాల పైభాగంలో ఉన్న పది శాతం ధనికుల తలసరిఆదాయం 14వేల మిలియన్ డాలర్లుగా ఉంది. ఫలితంగా, ఆర్థిక అసమానతలు అంతకుముందెన్నడూలేనంతగా దేశంలో పెరిగిపోయి, నేడు దేశంలో 10శాతం ప్రజల వద్ద 77శాతం దేశ సంపద పోగుపడింది. కింది స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల వద్ద నామమాత్రంగా 4.1శాతం సంపద మాత్రమేఉంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం2022-23 ఆర్థిక సంవత్సరంలో 22.3శాతం జాతీయాదాయాన్ని 1శాతం మంది ఎగరేసుకుపోయారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఇంకా విపులంగా చెప్పాలంటే, ప్రముఖ అమెరికన్ పత్రిక ఫోర్బ్స్ కథనం ప్రకారం, 1991లో భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీర్ ఉన్నాడు. 3దశాబ్దాల కాలంలో అమలైన సంస్కరణల ఫలితంగా, బిలియనీర్‌ల సంఖ్య నేడు దేశంలో 350కు చేరుకున్నారు. ఈ 350మంది నయాకుబేరుల సంపద జాతీయాదాయం పెరుగుదలలో 25శాతంగాఉంది! ఆర్థిక సంస్కరణల ప్రయోజనాల్ని కొందరు పారిశ్రామికవేత్తలు పొందుతున్న తీరు, అందుకు కొందరు పాలకులు సహకరిస్తున్న విధానం, వారికి లబ్ధి చేకూరేలా తీసుకుంటున్న పాలసీల కారణంగాసంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా, కార్పొరేట్లకు పన్ను విధానాలను అవలంబించడంవల్ల జాతీయాదాయానికి భారీగా నష్టమవుతున్నది ఫలితంగా ఆర్థిక అసమానతలు భారీగా పెరిగాయి. ఫలితంగా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయాల్సిన దుర్గతిపట్టింది. స్థూలజాతీయ ఉత్పత్తిలో ప్రభుత్వం అప్పుల శాతం80శాతానికి పైబడింది. సహజవనరుల్ని కొద్దిమందికి ధారాదత్తం చేయకుండాఉంటే, ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. అప్పుడు ప్రజలు ఉచితాలతో బతికే అవసరం ఉండదు. నిరుద్యోగం, పేదరికం, అప్పుల కారణంగా దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నదని వేసుకొంటున్న లెక్కలు నిజమే కావచ్చు. ఆర్థిక వ్యవస్థలోని అసమానతల్ని తగ్గించకుండా, కేవలం జీడీపీ లెక్కలతో మురిసిపోతే ప్రయోజనం ఏమిటి? ఆకలి చావుల సూచికల్లో ప్రపంచ దేశాలలో మన దేశం 123 దేశాలలో 102వ స్థానంలోఉంది. ఆర్థికఅసమానతలు లేకుండా ప్రపంచంలోని ఏ దేశమూ ఉండదన్న మాటనిజమే. అగ్రరాజ్యాలుగా చెప్పుకుంటున్న అమెరికా, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి. మన దేశ ఆర్థికవ్యవస్థలో అంతర్గతంగా ఇమిడిఉన్న పలు బలహీనతలను సవరించకుండా, పెరుగుతున్న స్థూల జాతీయాభివృద్ధి ఫలాలు అందరికీ చెందేలా చర్యలు తీసుకోకుండా, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చాటుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ఇది ప్రజాశ్రేయస్సు మాత్రం కాదు. ఒకమాటలో చెప్పాలంటే మనది ఉచితాల ఆర్థిక వ్యవస్థ. అప్పుల ఊబిలోఉన్న ఆర్థికవ్యవస్థ. విపరీతమైన ఆర్థిక అసమానతలు ఉండటమే దేశంలో ప్రధానమైన సమస్య. దీనిని నివారించకుండా ప్రజా శ్రేయస్సును పెంపొందించలేం. ఇది పాలకుల వైఫల్యమే. దేశంలో పాలకులు, ప్రభుత్వాలు, కార్పొరేట్‌లు ప్రజల ఆదాయాలు పెరిగే విధానాన్ని అవలంబించితే తప్పజిడిపి పెరుగుదల సాధ్యంకాదు. ●

# పల్నాడు జిల్లా వార్త



## 'కూటమి' ప్రభుత్వ విధానాలు,అభివృద్ధిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్ళాలి: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,ఫిబ్రవరి6,ప్రభాతవార్త: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ అధ్యక్షులు,పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ అధ్యక్షులు,పరిశీలకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. నియోజకవర్గాల వారీగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వ విధానాలు,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి సమర్థ



వంతంగా తీసుకెళ్లే బాధ్యతను పార్టీ నాయకులు, పరిశీలకులు సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపై దిశానిర్దేశం చేశారు. రాబోయే రాజకీయ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని చెప్పారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు.

## 11న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,ఫిబ్రవరి6,ప్రభాతవార్త: ఈ నెల 11 నుండి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్‌జీవీ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం టీడీఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్‌ల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు నూరు శాతం హాజరు కావాలన్నారు. ప్రతిపక్ష వైసీపీ సభ్యులకు ప్రజాస్వామ్య విలువలపై చిత్తశుద్ధి ఉంటే సభకు హాజరవ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయకత్వం



లో ఈ నెల 14వ తేదీన జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఛీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు ప్రభుత్వ విప్‌లు కాల్వ శ్రీనివాసులు,పిజివిఆర్ నాయుడు ( గణబాబు),యార్లగడ్డ వెంకట్రావు,బొలిశెట్టి శ్రీనివాస్,బొమ్మిడి నాయకర్,యనమల దివ్య,తంగిరాల సౌమ్య, టీడీఎల్పి సెక్రటరి కోనేరు సురేష్ పాల్గొన్నారు.

## వినుకొండ కొండను సందర్శించిన హైదరాబాద్ నిపుణుల బృందం

### ఆలయ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన

వినుకొండ,ఫిబ్రవరి6,ప్రభాతవార్త: ఏపీ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ కొండపై వెంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణంకు మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు హైదరాబాద్ నిపుణుల బృందం శుక్రవారం కొండను సందర్శించారు. కార్యక్రమంలో సేవిల్స్ గణేష్ రాజు బృందం దేవాదాయ శాఖ మాజీ ఇ.ఇ అశోక్ కుమార్, దేవస్థానం ఈఓ సుధాకర్ రెడ్డి,చైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు,కొండ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మాచర్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక 28వ వార్డు వినాయకుని గుట్ట కాలనీలో రూ.21 లక్షలతో సీసీ రోడ్లకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువతకు అండగా నిలచే విధంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తుందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, సాగునీరు, రహదారులు, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జూలకంటి



బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, టీడీపీ సీనియర్ నాయకులు కజ్జం సైదయ్య, బీజేపీ నాయకులు ఓర్పు క్రాంతికుమార్, బూత్ ఇన్‌ఛార్జి దానంబాబు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వరుల్ల, బాదంబాయి, దేగల యాకోబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'జనసేన' ఫ్లెక్సీ ధ్వంసం




మాచర్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై ప్రజలకు తెలియజేసే క్రమంలో పార్కు సెంటర్ వద్ద జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని దుండగులు చించివేశారు. దీనిపై జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీని చించిన దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లెక్సీని చించివేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మాదక ద్రవ్యాలతో దుష్పలితాలపై అవగాహన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వరకు తిరిగి కన్యాకుమారి నుంచి న్యూఢిల్లీ వరకు సుమారు 3500 కి.మీ.లు డ్రగ్స్ ఫ్రీ ఫ్యూచర్ అనే నినాదంతో కాలినడక సాగిస్తున్న శ్యామ్, కిరణ్‌లు శుక్రవారం మండలంలోని తుమ్మలచెరువు టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. వీరిని పోలీసు అధికారులు పిడుగురాళ్లలోని జడ్పీహెచ్ స్కూల్ వద్దకు ఆహ్వానించి ప్రజలకు, విద్యార్థులకు వీరు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పలితాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.




## మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

పెదకూరపాడు,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: ఎలుకల నిర్మూలన పేస్ట్ సేవించి బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పెదకూరపాడు లో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ గిరిబాబు, తెలిపిన వివరాల ప్రకారం పెదకూరపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ సుభాని కుమారుడు షేక్ ఇమ్రాన్ (22) జనవరి 29వ తేదీన ఎలుకలను నివారించే పేస్టును తిని అపస్మారస్థితిలోకి వెళ్లారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి పెదకూరపాడు సామాజిక వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి ఇమ్రాన్ ను సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మెరుగైన వైద్య నిమిత్తం మంగళగిరి ఎన్నారై వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇమ్రాన్ మృతి తో పెదకూరపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. అహ్మదాబాద్‌లో బీటెక్ రెండవ సంవత్సరం పూర్తి చేసుకుని, ఇంటి వద్ద ఉంటున్నాడు. కుమారుడు మరణ వార్త తెలుసుకున్న ఫాతిమా అపస్మార స్థితిలోకి చేరగా ఆమెని గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఇమ్రాన్ మృతదేహాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి సుభాని కుటుంబానికి సానుభూతిని తెలిపారు.



## పేదల ఆరోగ్యానికి 'కూటమి' ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :: నరసరావుపేట నియోజకవర్గంలోని పేదల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. శుక్రవారం టీడీపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద బాబు 33 మంది లబ్ధిదారులకు రూ 20.17 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 18 నెలల కాలంలో నరసరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 729 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్ల 81 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎల్ఓసీ (లెటర్ అఫ్ క్రెడిట్) ద్వారా 173 మంది లబ్ధిదారులకు రూ.1.37 కోట్ల ఎల్ఓసి చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ వారికి అండగా నిలుస్తోందన్నారు. అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తోడ్పాటును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే అరవింద బాబు నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ వ్యక్తిగత, సామాజిక, భూ సంబంధిత, పింఛన్లు, రేషన్, రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు వంటి పలు అంశాలపై అర్జీలు సమర్పించారు. సమస్యల తీవ్రతను తెలుసుకున్న వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




## బడ్జెట్ సమావేశంలో ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపుకు చొరవ చూపండి: యుటిఎఫ్ వినతి

నరసరావుపేట టౌన్,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ::ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపుకు చొరవ చూపాలని కోరుతూ యుటీఫ్ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి మోహనరావు మాట్లాడుతూ 11వ పిఆర్ సిలో జరిగిన ఆర్థిక నష్టానికి కూటమి హయాంలో న్యాయం జరుగుతుందని ఆశించి భంగపడ్డామన్నారు. 2023 జులై నుండి అమలు కావాల్సిన పిఆర్సి కమీషన్ నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఆర్,పెండింగ్ డిఏలు, మెడికల్ రీయంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని అన్నారు. బకాయిలు చెల్లిస్తున్నప్పటికీ చెల్లించాల్సిన ఇతర బకాయిలు పేరుకుపోతున్న నేపథ్యంలో పిఆర్సి కమీషన్ చైర్మన్ ను వెంటనే నియమించి సమస్యలు పరిష్కరించి 29 శాతం ఐఆర్ ప్రకటించాలని అన్నారు.పెండింగ్ డిఏలను విడుదల చేసి ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు కృషి చేయాలన్నారు.సిపిఎస్ రద్దు చేయాలని మెమో 57 ప్రకారం 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో"ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాంమన ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో రూపొందించిన గోడ ప్రతులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఇతర వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు.తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగేలా వసతులపై విస్తృత ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపునకు యుటిఎఫ్ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులుఎం.రామాంజనేయులు,ఎన్.సుందరరావు,టి.వెంకటేశ్వర్లు, నరసరావుపేట ప్రాంతీయ శాఖల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 'కృష్ణవేణి' విద్యార్థులకు అత్యధిక మార్కులు

నరసరావుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 5వ సెమిస్టర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచార ని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వివరాలను తెలియజేశారు. వివిధ కోర్సుల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు.విభాగాల వారీగా టాపర్లు:బి.స్సీ (సిఎస్ ఫిజిక్స్): 95.16 బి.ఎస్సీ ( బొటాని ): 94.21 (895 మార్కులు)బి సి.ఎ: 94 (893 మార్కులు)బి.స్సీ లో 93.79 (891 మార్కులు)బి.స్సీ (ఎ ఐ): 92.84 (882 మార్కులు)బి.స్సీ (సి ఎస్ స్టాట్): 92 (874 మార్కులు)బి.స్సీ (జూ): 92.21 (876 మార్కులు)బి.కాం (సి ఎ): 90.82 (772 మార్కులు) సాధించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "క్రమశిక్షణతో కూడిన చదువు, అధ్యాపకుల అందరూ బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నా రు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆకాంక్షి ంచారు.కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎం.ఆర్.కె. సతీష్ బాబు, సర్దార్ తో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## సంజీవరెడ్డికి డాక్టర్ 'గజ్జల' ఘననివాళి

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: లంకెల కూరపాడు గ్రామానికి చెందిన అంబటి రామచంద్రారెడ్డి కుమారుడు సంజీవరెడ్డి గుండెపోటుకు గురై మృతిచెందారు.సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ..డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి.. లంకెల



కూరపాడు గ్రామంలోని సంజీవరెడ్డి నివాసానికి వెళ్లి వారి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇందూరి నరసింహారెడ్డి , మారూరి జగన్మోహన్ రామలింగారెడ్డి రెండేద్దుల వెంకటేశ్వర్ రెడ్డి , గ్రామ సర్పంచ్ మోర్తాల వెంకటరమణారెడ్డి, కిక్కూరు రామిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## భక్తాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవం

సత్తెనపల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్నం మహారాష్ట్ర వీధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం 26వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ అర్చక స్వామి వేదాంతం విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకములు, హోమము,విశేష అలంకార కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఫిరోజి, కిషోర్,బాజీ నాయన, పవన్,రాజేశ్వరి,వసుంధర, సుకన్య, ఉష, వెంకటేశ్వర్లు, శివాజీ,శివప్రసాద్ మొదలగువారు పాల్గొని ఏర్పాట్లు చూశారు ఈ సందర్భంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, అష్టోత్తర శతనామ పూజ కార్యక్రమాలు వైభవంగా జరిగినాయి



## కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

నరసరావుపేట,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ::మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండలో నిర్వహిస్తున్న వార్షిక తిరునాళ్ల ఏర్పాట్లను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం తెల్లవారుజామునే ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కోటప్పకొండకు ఆలయ పరిసర ప్రాంతాలు, భక్తుల రాకపోకలకు ఏర్పాటు చేసిన మార్గాలు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుద్ధం, వైద్య శిబిరాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. గత సంవత్సరం కోటప్పకొండ తిరునాళ్లకు 20 లక్షలకు పైగా భక్తులు హాజరైనట్లు పేర్కొన్న ఎమ్మెల్యే, ఈసారి భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తిరునాళ్ల సమయంలో పారిశుద్ధ్యాన్ని కచ్చితంగా పాటిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగాలని అధికారులను ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఇంత భారీ స్థాయిలో జరిగే తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించగలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఎలాంటి అవాంతరాలు లేకుండా పండుగ వాతావరణంలో తిరునాళ్ల జరగేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే అరవింద బాబు కోరారు. ఘాట్ రోడ్డులోని జింకల పార్క్ ను, ఫిష్ ఆక్వేరియం, తదితరుల ప్రాంతాలు పరిశీలించి అటవీ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం త్రికోటేశ్వర స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



## 'భావన' విద్యార్థుల ప్రతిభ

రొంపిచర్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ 3, 5 ఫలితాలలో స్థానిక భావన (విక్టరీ) డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి మార్కులను సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ పి. వేణుగోపాల్ తెలిపారు. 5వ సెమిస్టర్లో బి. మైత్రి (బిఎస్సి) 95 , వి. స్వర్ణ బిందు (బిసిఏ) 89 , వి. భాగ్య శ్రీజ 93 , అలాగే, 5వ సెమిస్టర్ లో జె. విజయ కుమారి 93 , (బీఎస్సీ (సిఎస్)), సిహెచ్. బాధలమ్మ 91 (బీఎస్సీ (డిఎస్)), ఏ వి. దీక్షి త (బీసీఏ) 93 , పి. కృష్ణవేణి (బికాం) 93 సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ బద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, అధ్యాపక అధ్యాపకే తెలిసి సిబ్బంది అభినందించారు.



## అక్రమంగా మసీదు కమిటీల ఏర్పాటు: ముస్లిం మహిళల ఆందోళన

నరసరావుపేట క్రైమ్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : :పట్టణానికి చెందిన రహమత్ అలీ అనే వ్యక్తి తన సొలాభంకోసం పట్టణంలోని జామియా మసీదుకు తానే ఓ కమిటీ ఏర్పాటు చేసుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తూ అవకతవకలకుపాల్పడుతున్నాడని స్థానిక వరవకట్టకు చెందిన పలువురు ముస్లిం మహిళలు ఆరోపించారు. శుక్రవారం స్థానిక జామియా మసీదు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడాడు. ఈ రహమత్ అలికి జామియా మసీద్ కి ముతవల్లి కాదని, అతనికి మసీదుకు సంబంధం లేదన్నారు. ముస్లిం పెద్దలకు సంప్రదించకుండా, తన ఇష్టానుసారం మసీదు కమిటీలను ఏర్పాటు చేసుకొని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తున్న ముస్లిం సోదరులపై చీటింగ్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారని తెలిపారు. అంజుమన్ కాంప్లెక్స్ లో తనకు ఒక షాపు ఉందని, షాపుకు సంబంధించిన కరెంటు బిల్లు తన పేరుతో కాకుండా జామియా ఇస్లాం పేరుతో కాకుండా రహమత్ అలీ పేరుతో ఎలా వస్తుందని గతంలో తాను జిల్లా కలెక్టరేట్లో జరిగే గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చినట్లు జమీల అనే ఓ ముస్లిం మహిళ చెప్పారు. ఆ తరువాత రహమత్ అలీ తనకు ఎటువంటి నష్టం చేకూర్చనని హామీ ఇవ్వడంతో కేసును విత్ డ్రా చేసుకున్నానని చెప్పారు. అయినా ఆ తర్వాత కూడా షాపు తన పేరుతో రాలేదని పేర్కొన్నారు. అంజుమన్ కాంప్లెక్స్ లోని షాపులను ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సంబంధించిన శాఖ అధికారులు పోలీసులు విచారణ చేపట్టి, తమకు న్యాయం జరిగేలా చేయాలని కోరారు. సమావేశంలో పలువులు ముస్లిం మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.



## చేనేత, హస్తకళ ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : : స్థానిక భువనచంద్ర టౌన్ హాల్లో ఏర్పాటు చేసిన హస్తకళ–చేనేత వస్త్ర ప్రదర్శనను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాల చేనేత కార్మికులు తయారు చేసిన సంప్రదాయ హస్తకళ ఉత్పత్తులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని తెలిపారు. చేనేత కార్మికులు తమ కళను నిలబెట్టుకుంటూ ముందుకు సాగేందుకు ప్రభుత్వం తోడ్పాటుతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. స్థానికంగా తయారయ్యే హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు.



## 'నిప్స్'లో ఇండో-యూరోపియన్ సదస్సు

నరసరావుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :: స్థానిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అంతర్జాతీయ ఇండోయూరోపియన్ సదస్సు నిర్వహించారు. కళాశాల, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రిన్సిపల్ డా.జె.ఎన్. సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు .ప్రస్తుత పరిస్థితుల్లో ఫార్మసీ రంగ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహనను అతిథులు కల్పించారు. ఔషధ రూపకల్పన, ఔషధ విజ్ఞాన శా ఉపన్యాసాలు నిర్వహించారని తెలిపారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు ఫార్మసీ విద్య నవసమాజ పునాది అని ఉద్ఘాటించారు.అసోసియేషన్ ఏపీ ప్రతినిధి డాక్టర్ చెన్నుపాటి సురేష్, వెల్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలాజి పాండియన్, విజయ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు ల్యాబ్‌లో ఔషధ పరిశోధనపై విజ్ఞాన విషయాలు బోధించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ నూతన ఔషధాల పనితీరు, ఆరోగ్య విషయాలువివరించారు.20192025 బ్యాచ్ ఫార్మ్‌డి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ చక్రవర్తి, డైరెక్టర్ కిషోర్ కుమార్, సెక్రటరీ మిట్టపల్లిరమేష్ డిగ్రీలు అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులు, అధ్యాపకులకు అవార్డులు ప్రదానం చేశారు.భారతదేశ వివిధ రాష్ట్రాల 700 మంది పాల్గొని పరిశోధన పత్రాలు ప్రదర్శించారు. బహుమతులు ఇచ్చారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ యం. రమ్యతేజ, కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## చలామరెడ్డికి డాక్టర్ 'గోపిరెడ్డి' ఘననివాళి

రొంపిచర్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త::నరసరావుపేట నియోజకవర్గంలో వైయస్సార్సీపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. పార్టీ నాయకుల కుటుంబాలను ఆయన కలిసి మాట్లాడారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో గాదె చలామారెడ్డి కనుమూసిన సమాచారం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతి పట్ల సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. గ్రామ పెద్దలు పార్టీ నాయకులతో ఈ సందర్భంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట వైయస్సార్సీపి నాయకులు పొన్నపాటి విజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కారంపూడి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఒప్పిచర్ల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి మండోజి వీరబ్రహ్మాచారి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం, శనివారం రెండు రోజులపాటు తిరునాళ్ల జరుగుతుందన్నారు. మహోత్సవంలో భాగంగా విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించి విగ్రహ ఊరేగింపు జరుగుతుందన్నారు. భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్తు ప్రభలతోపాటు నృత్య కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు.

## నరమాలపాడు గ్రామ కమిటీ ఎంపిక



కారంపూడి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కారంపూడి మండలం నరమాలపాడు గ్రామ కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిశీలకులు, కరసాల రమేష్, గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, రావూరి నాగ, గుద్దేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో పోటీల్లో బ్రహ్మనాయుడు విద్యార్థుల హవా

కారంపూడి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఈ నెల 1, 2 తేదీల్లో విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించచిన బాల మహోత్సవ క్రీడా పోటీల్లో అండర్-14, అండర్-17 ఖోఖో విభాగాల్లో స్థానిక బ్రహ్మనాయుడు పాఠశాల విద్యార్థులు హవా చాటారు. అండర్-14



విభాగంలో ప్రథమస్థానం, అండర్-17 విభాగంలో ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం ఐ.శివశేషిరెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ రవికుమార్ పాల్గొని విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని రెండింట్లో రాణించిన వారికి ఆరోగ్యంతోపాటు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గెలుపొందిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజు, అమల, సుష్మితలను అభినందించారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి కళ్యాణ మహోత్సవం

యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు కోట పైన వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామి



వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని, కార్యక్రమాలను పరాంకుశం శ్రీధరాచార్య స్వామి తిరుమల వారి అధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఉదయం స్వామి వారికి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించటం జరిగిందని, ఇందులో పరిసర గ్రామాల నుండి భక్తులు విచ్చేసి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనటం జరిగిందని అలయ అర్చకులు నారాయణం అజయ్ స్కంధ తెలిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించామన్నారు.

## పర్యాటకులకు ఇబ్బందులు కలుగ కుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు : సిఐ



యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : కొండవీడు కోటలో ఏర్పాటుచేస్తున్న కొండవీడు కోట ఉత్సవాల సందర్భంగా పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న చిలకలూరిపేట సిఐ సుబ్బనాయుడు తెలిపారు. అయన వివరిస్తూ జిల్లా ఎస్పీ కృష్ణారావు, డిఎస్పీ హనుమంతరావు అధ్వర్యంలో రెండు వందల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రధానంగా పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడైనా ఎటువంటి ఇబ్బందులు ఉంటే వెంటనే సిబ్బందికి తెలియజేయాలన్నారు.

## కొండవీడు కోటకు చేరిన హెలికాప్టర్



యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు కోట ఉత్సవాలలో భాగంగా పర్యాటకులకు కను విందు కలుగ జేసే కార్యక్రమంలో భాగంగా చెన్నై తంబి ఏవియేషన్ సంస్థ నుండి శుక్రవారం కొండవీడుకు చేరుకుంది. పర్యాటకులను హెలీ రైడ్ చేసేందుకు దీనిని అధికారులు రప్పించారు. సుమారు అయిదు నుండి ఏడు నిమిషాల హెలీ రైడ్‌లో పది కిలోమీటర్ల రౌండ్ ట్రిప్పుకు సంబందించి ఒక్క వ్యక్తి మూడు వేల అయిదు వందల రూపాయలుగా ధరను నిర్ణయించారు. గత సంవత్సర ఉత్సవాల సమయంలోను సుమారు నాలుగు వేల మంది వరకు హెలీ రైడ్ చేసి నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇప్పుడూ మంచిగా అకట్టుకుంటుదని అంటున్నారు.

## విద్యుత్ కాంతులతో మెరుస్తున్న కొండవీడు ఘాట్ రోడ్డు



యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు కోటకు సంబంధించిన ఘాట్ రోడ్డు విద్యుత్ లైన్‌ను క్రమబద్ధీకరించారు. గత కొంత కాలంగా మరుగున పడిన ఈ విద్యుత్ లైన్‌ను ఉత్సవాల నేపధ్యంలో అధికారులు మరలా అచరణలోకి తీసుకు రావటం జరిగింది. ఇందులో భాగంగానే ఉత్సవాల నేపధ్యంలో శుక్రవారం సాయంత్రం ఘాట్ రోడ్డు విద్యుత్ బల్బులు ఒక్కసారిగా అన్‌చేయటంతో కొండ అంతా వివిధ రంగుల విద్యుద్దీకరణతో మెరిసి పోయింది.

## మిట్టపల్లిలో క్యాంపస్ ఎంపికలలో ఎంపికైన విద్యార్దులు



యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపికృష్ణ మరియు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగం వారి సంయుక్త అధ్వర్యంలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతన్న సిఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి అండ్ ఇసిఇ, విద్యార్ధిని, విద్యార్దులు శుక్రవారం నిర్వహించిన ఎంపికలలో పదివేల కోడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఇందులో 12 మంది విద్యార్థిని, విద్యార్దులు ఎంపిక కావటం జరిగిందన్నారు. వీరికి నెలకు 3.5నుండి8లక్షల వరకు వేతనం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎమ్‌బివి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఎం కిశోర్ కుమార్ ఎంపికైన విద్యార్దిని, విద్యార్దులకు అభినందనలు తెలియజేసారు. వారు వివరిస్తూ ఈ పోటీ ప్రపంచంలో రాణించాలంటే అధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎవో సిహెచ్ శ్రీనివాసరావు, టిపివో కె విజయకుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## గుంటూరులో భారత్ రంగ్ ..నాటకోత్సవాల సందడి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: సాంస్కృతిక కేంద్రమైన గుంటూరు నగరం అంతర్జాతీయ నాటక వైభవానికి వేదికైంది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ), వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు సంయుక్త ఆధ్వర్యంలో భారత్ రంగ్ మహోత్సవ్ అంతర్జాతీయ నాటక మహోత్సవాలు శుక్రవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 6 నుండి 10వ తేదీ



వరకు ఐదు రోజుల పాటు సాగే ఈ కళాయజ్ఞం తొలిరోజే నగరవాసులను మంత్ర ముగ్ధులను చేసింది. వివిధ కళాసంస్థలు అట్టహా సంగా వేడుకలు ప్రారంభం కార్య



క్రమం ఆరంభంలో ఉత్సాహం ఉరకలెత్తింది. మంగళగిరి సుధాకర్ డప్పు బృందం తమ లయబద్ధమైన వాయి ద్యాలతో, నృత్యాలతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఆనందోత్సవాల నడుమ వివిధ కళాసంస్థల నిర్వాహకులు, కళాకారులు, ఇతర ప్రముఖులు పోటీల నిర్వాహకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నాటకోత్సవాల ఫ్లెక్సీలు, జాతీయజెండాలతో చేసిన ఈ ర్యాలీ నగరంలో పండుగ వాతావరణాన్ని నింపారు. వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు నేతృత్వంలో ఆయన సతీమణి ముత్తవరపు అరుణకుమారి, కుమార్తె డాక్టర్ భార్గవిచౌదరి రిబ్బన్ కట్‌చేసి వెంకటేశ్వర విజ్ఞాన మందిర ప్రాంగణంలోని బళ్లారి రాఘవ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఉత్సవాలను ప్రారంభించారు. అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు బళ్లారి రాఘవ ఓపెన్ ఎయిర్ థియేటర్ వేదికగా విద్యార్థుల కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భాష్యం స్కూల్ (చంద్రమౌళినగర్) విద్యార్థులు ప్రదర్శించిన భద్రాద్రి రామ కోలాటం భక్తిభావాన్ని చాటింది. కస్తూర్బా బాలిక విద్యాలయం (నరసరావుపేట) రేపల్లె వాడలో చిన్ని కృష్ణుడు జానపద నృత్యం ప్రేక్షకులను అలరించింది. ఈశ్వర్ ఇంజినీరింగ్ - ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ, జానపద నృత్యాలు వేదికపై నూతన వెలుగులు నింపాయి.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రత్తిపాటి కృషితోనే చిలకలూరిపేట అభివృద్ధి: మున్సిపల్ చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అకుంఠిత దీక్షతోనే చిలకలూరిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి చిరునామా పత్తిపాటి పత్తిపాటి పుల్లారావు ఈ నియోజకవర్గం నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండు పర్యాయాలు



మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారని రఫాని గుర్తుచేశారు. "అభివృద్ధి అంటే పత్తిపాటి.. పత్తిపాటి అంటే అభివృద్ధి" అనే స్థాయికి నియోజకవర్గాన్ని ఆయన తీసుకెళ్లారని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే నాయకుడని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ, వారి వినోదం కోసం ఎడ్ల పందాలు నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపడంలోనూ పత్తిపాటి ముందుంటారని అన్నారు. పర్యాటక కేంద్రంగా కొండవీడు కోటరాష్ట్రంలోనే చారిత్రాత్మక నేపథ్యం కలిగిన కొండవీడు కోటను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే పత్తిపాటి పుల్లారావు గారి ప్రధాన లక్ష్యమని చైర్మన్ పేర్కొన్నారు.

## షరీఫ్ మృతికి 'మర్రి' సంతాపం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం మద్దినగర్ వాస్తవ్యుడు షేక్ మగ్బుల్ కుమారుడు షేక్ షరీఫ్ వుద్దీన్ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస



విడిచారు. విషయం తెలుసుకొని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ వారి స్వగృహం వద్ద ఉన్న పార్థీవదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన అత్తులూరి షరీఫ్ , షేక్ కాలేషా తదితరులున్నారు.

## 'కొమ్మినేని'లో అత్యాధునిక వైద్యసాయం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: చిలకలూరిపేట కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అత్యాధునిక వసతులు తో మెరుగైన వైద్యం అందిస్తున్నామని హాస్పిటల్ అధినేత డాక్టర్ కొమ్మినేని వీర శంకర్ రావు తెలిపారు. శుక్రవారం చిలకలూరిపేట పట్టణంలో ని శ్రీ పదం రెసిడెన్సీ లో ఖిలీశి శిలీశి వైద్యుల సమావేశం జరిగింది. ముఖ్య అదితి గా డాక్టర్లు కొమ్మినేని వీర శంకర్ రావు, డాక్టర్ మక్కెన వంశీ కృష్ణ, డాక్టర్ కొమ్మినేని రేష్మ,డాక్టర్ దొంతినేని కృష్ణ చైతన్య, డాక్టర్ నవీన్ కృష్ణ, డాక్టర్ ప్రదీప్, శ్రీకాంత్, లీలా నవీన్ లు పాల్గొన్నారు. ఖిలీశి శిలీశి కమ్యూనిటీ పారా మెడికల్



వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వైద్యులు కు పలు సూచనలు సలహాలు అందించారు. పలువురు ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీర శంకర్ రావు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోనే అత్యాధునిక వసతులు తో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న హాస్పిటల్ కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అని ,తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చిలకలూరిపేట ప్రజలు కు అందిస్తున్న మని పేర్కొన్నారు. వైద్యశాల నందు ఎన్టీఆర్ వైద్య సేవ అందుబాటులో ఉందని, పేద రోగులకు ఈ పథకం ఉపయోగ పడుతుందని వివరించారు.సిటీ స్కాన్,, అంబులెన్స్ సదుపాయాలు, సీరియస్ కేసులు కొరకు ఇంటి వద్దకే చికిత్స మొదలు పెట్టె విధంగా అంబులెన్స్ ను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖిలీశి శిలీశి అసోసియేషన్ అధ్యక్షుడు అల్లడి మాధవ్, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి అన్నపురెడ్డి శ్రీను, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి తిరుపతి రావు, ట్రెజరర్ అన్నపురెడ్డి సుదర్శన్, గౌరవ సలహా దారులు అల్లడి అదిబాబు,తదితరులు పాల్గొన్నారు.

## కొండవీడు ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన చైర్మన్ రఫానీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: ఘనంగా కొండవీడు ఉత్సవాలు ఏర్పాట్లను పరిశీలించిన మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫానికొండవీడు చారిత్రక కొండవీడు కోటపై 7,8 తేదీలలో అనగా రేపు, ఎల్లుండి నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు, మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫానినేడు కొండవీడును సందర్శించి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యం ఉత్సవాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం త్రాగునీరు, వసతి, మరియు భద్రతా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు కోట వైభవాన్ని చాటిచెప్పేలా రెండు రోజుల పాటు వివిధ



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.నిరంతర పర్యవేక్షణ ఉత్సవాలు విజయవంతం అయ్యేలా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూస్తామని చైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, ఇతర ముఖ్య నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## కొండవీడు - అప్పుడు.. ఇప్పుడు... ఎప్పుడూ ఆంధ్రులకు గర్వకారణమే : ప్రత్తిపాటి

యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : దక్షిణ భారతదేశంలోని అతి కీలకమైన చారిత్రక ప్రదేశం కొండవీడు. శత్రు దుర్భేధ్యంగా తమ రక్షణ కోసం నాటి రాజులు నిర్మించిన అతి కీలకమైన వ్యూహాత్మక కోటలలో కొండవీడు ప్రధానమైంది. దాదాపు 1200 అడుగుల ఎత్తులో కొండపైన నిర్మితమైన అబ్బురపరిచే నిర్మాణ సౌథం. 3 కి.మీ మేర నిర్మించిన భారీ కుడ్యాలు (గోడలు), రాజప్రాసాద అవశేషాలు, గుప్త సొరంగాలు, కొండపైనే నిర్మించిన జలాశయాలు (చెరువులు), ఆయుధ శాలలు, ఆధ్యాత్మిక జీవనం పెంపొందించేందుకు నిర్మించిన అపురూప ఆలయాలు ఇంతటి సమ్మిళిత నిర్మాణ విశిష్టత కొండవీడు కోటకు



మాత్రమే సొంతం. వీటికి అదనంగా సహజ రక్షణతో కూడిన అద్భుతమైన సైనిక నిర్మాణ నమూనాల కేంద్రం కొండవీడు. ఇంతటి ఘన చారిత్రక వైభవం. అద్భుత నిర్మాణ శైలికి ప్రతిరూపమైన కొండవీడును గత పాలకులు పూర్తిగా విస్మరించారు. అక్కడి నిర్మాణాల్లోని గొప్పతనం, వైభవం వారి కళ్లకు కనిపించకపోవడం నిజంగా విచారకరం.రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనమైన కొండవీడు విశిష్టత, ఖ్యాతిని గుర్తించిన నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కరే. ఆయన నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వం కొండవీడు కోటను హెరిటేజ్ టూరిజం హబ్ గా మార్చాలనే లక్ష్యంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుని, వాటిని వెంటనే ఆచరణలో పెట్టింది. కొండవీడు కోట విశిష్టతను తెలుగుజాతితో పాటు.. యావత్ దేశానికే తెలియచేయాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కోట సందర్శనకు అనువుగా అందమైన ఘాట్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టారు. కొండపైన చారిత్రక కట్టడాల రక్షణకు ప్రాధాన్యమిస్తూనే, పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేశారు. రోప్ వే ప్రాజెక్ట్ చేపట్టాలని ప్రతిపాదించారు. అలానే లైట్ అండ్ సౌండ్ షో, లేజర్ షో, ట్రెక్కింగ్, వ్యూ పాయింట్ల అభివృద్ధి వంటి అనేక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆనాడే కొండవీడును ఆంధ్రప్రదేశ్ హెరిటేజ్ క్యాపిటల్ గా ప్రచారం చేయాలనే ఉన్నతమైన ఆలోచన చంద్రబాబు చేశారు. ఏపీ టూరిజం సర్క్యూట్ లో కొండవీడుకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారు. నాటి ఆయన చర్యల ఫలితంగా కొండవీడుకు సందర్శకుల తాకిడి పెరిగింది. రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలు, దేశ, విదేశాల నుంచి కూడా ఏపీకి వచ్చే పర్యాటకులకు కొండవీడు కోట వీక్షణం ఒక మరుపురాని మధుర జ్ఞాపకంగా మారింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ కృషితో కొండవీడు కోట ఆంధ్రులకు గర్వకారణమైన పర్యాటక ప్రదేశంగా అవతరించింది. ఆ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుందనుకుంటున్న తరుణంలో టీడీపీ ప్రభుత్వం స్థానంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. దాంతో కొండవీడుకు గ్రహణం పట్టింది. నాటి వైభవం పూర్తిగా మసకబారిపోయింది. టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులన్నీ పిచ్చిచెట్ల పాలయ్యాయి. మరలా 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాకే కొండవీడు కోటకు మహర్దశ మొదలైంది. గతంలో తన మనసులోని ఆలోచనలకు కార్యరూపమిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కొండవీడు పునర్వైభవంపై దృష్టి సారించారు. ఆ క్రమంలో గతంలో నిర్మించిన ఘాట్ రోడ్డుకు అనుసంధానిస్తూ, రాజధాని ప్రాంతం నుంచి కొండవీడుకు తరలివచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం చౌడవరం వద్ద రూ.220 కోట్లతో కొండను తొలిచి టన్నెల్ నిర్మించే ప్రతిపాదనపై దృష్టి పెట్టారు.ప్రపంచ పర్యాటక ప్రదేశంగా కొండవీడును తీర్చిదిద్దాలన్న పాలకుల ఆశయంలో భాగంగా ఈ నెలలో 7, 8 తేదీల్లో భారీ స్థాయిలో కొండవీడు ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ రెండు రోజులు నిర్వహించే ఉత్సవాలతో కొండవీడు ప్రాంత ఖ్యాతి నలుదిశలా వ్యాపించడం ఖాయం. వారం రోజులు నుంచి అధికార యంత్రాంగం నిర్విరామ కృషితో కొండవీడు కోటకు వెళ్లే రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులతో పాటు.. కోటపైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగింది. ఉత్సవాలకు వచ్చే పర్యాటకుల భద్రత, ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి అంశాన్ని సునిశితంగా గమనించి ఏర్పాట్లు చేయడం జరిగింది. తొలిరోజు (శనివారం) ఉదయం యోగాతో ప్రారంభమయ్యే ఉత్సవాలు.. ఆదివారం రాత్రి వరకు కొనసాగే సాంస్కృతిక కార్యక్రమాలతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా హెలికాప్టర్ రైడ్, శాండ్ ఆర్ట్, రాక్ క్లైంబింగ్, ఫైర్ క్రాకర్స్ షో, హార్స్ రైడింగ్, ఫ్లవర్ షో, బోటింగ్, చిన్నారులకు ప్రత్యేక ప్లే జోన్, ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాట్లు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి. జబర్దస్త్ బృందం నవ్వుల విందు.. గాయనులు గీతామాధురి, సమీరా భరద్వాజ్ సంగీత విభావరితో కూడిన ఆటపాటలు, విందువినోదాలతో అలసిపోయిన పర్యాటకుల అభిరుచికి తగినట్టు.. నోరూరించే రుచులతో ఫుడ్ ఫెస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్ని విశిష్టతలు.. విభిన్నతలు.. విందు, వినోదాలకు నిలయమైన కొండవీడు కోట అందాలను, చారిత్రక వైభవాన్ని ప్రతి ఒక్కరూ కన్నులారా, మనసునిండా ఆస్వాదించాలని కోరుతున్నాం. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవాదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు చేతులమీదుగా నేడు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యే ఉత్సవాలకు. ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం." అని మాజీమంత్రి ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

యడ్లపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : కొండవీడు ఉత్సవాల్లో భాగంగా ఏర్పాట్ల అంశంలో అధికారులు అలసత్వానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు.



కొండవీడు కోటను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పర్యాటకుల హెలీరైడ్ సౌకర్యం కోసం సిద్ధం హెలీకాప్టర్ను వీక్షించారు. కొండపైన విద్యార్థుల పర్యాటకులు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన నిర్మించిన వేదిక పరిశీలించారు. కొండ దిగువ బజర్దస్త్ తదితర వినోద, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వేదిక, పార్కింగ్, పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. శనివారం ఉదయం లోపు అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డీఎఫ్వో కృష్ణప్రియ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌చే ఎమ్మెల్యే 'కన్నా' ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గారు మరియు లోకేష్ గారు 20 లక్షల మందికి ఉద్యోగఅవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారో హామీల్లో భాగంగా.ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన





18నెలల్లోనే మూడవసారి జాబ్ మేళా నిర్వహించడం జరిగింది.నలభై కంపెనీలు మెగా జాబ్ మేళాలో పాల్గొన్నాయి. పదకొండు వందలమంది జాబ్ మేళాలో పాల్గొన్నారు. 382 మందికి పైగా ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వడం జరిగింది సెలెక్ట్ అయిన వారికి నియామక పత్రాలు అందించడం జరిగింది. రానున్న రోజుల్లో మరల తిరిగి జాబ్ మేళా నిర్వహించి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తెలియజేసారు.

## జెండర్స్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాత వార్త: సత్తెనపల్లి రూరల్ మండలం దూళిపాళ్ల గ్రామం భాగ్యనగర్ కాలనీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నశాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. స్వయం సహాయక సంఘాలు (కమ్యూనిటీ బెస్ట్ ఆర్గనైజేషన్ లు) తమకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించడానికి, సేవలను అందించే సంస్థలతో





సంబంధాలు ఏర్పంచుకోవడానికి. సంబందిత శాఖ నుండి అవసరమైన సహాయం పొందడానికి వేదికగా జెండర్ రిసోర్స్ సెంటర్ లు పని చేయడం అలాగే మహిళలు మరియు సమాజంలోని పీడిత వర్గాలపై జరిగే హింస మరియు వివక్షకు కారణమయ్యే వ్యవస్థా పరమైన మరియు సామాజిక అడ్డంకులను తొలగించడానికి ప్రచారం చేయడం జరుగుతుంది.సామాజికంగా పీడిత వర్గాల హక్కుల కోసం ప్రచారం చేయడం ద్వార మరియు సమూహ చర్యల శక్తిని ప్రాముఖ్యతగా చూపించడం ద్వార విధాన స్థాయిలో మార్పులను ప్రభావితం చేయడం జరుగుతుందన్నారు.

## 'ప్రజావేదిక'లో ప్రజల అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: సత్తెనపల్లి కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ .ప్రజలు



తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. నా దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు




# మహిళల స్వయం ఉపాధి కల్పన లక్ష్యం

# పెట్టుబడి లేకుండా ఎగ్‌మార్ట్‌లు

• ఒంటరి మహిళలకు ప్రాధాన్యం • అన్ని జిల్లాల్లో ఎగ్ మార్ట్‌ల ఏర్పాటుకు నెక్‌తో మెప్మా ఒప్పందం

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పన లక్ష్యంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడి లేకుండా పట్టణాల్లో ఎగ్‌మార్ట్‌లు ఏర్పాటు చేస్తోంది. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. వీటి నిర్వహణకు అవసరమైన ఖర్చుతో పాటు విలువైన సామాగ్రిని, శిక్షణను ఉచితంగా అందిస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తుంది. మహిళలు ఆర్థిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో తోడ్పాటు అందిస్తోంది. కోడిగుడ్లతో తయారు చేసే ఉత్పత్తుల విక్రయంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు చర్యలు చేపడుతోంది. అన్ని జిల్లాలోని పట్టణాల్లో ఎగ్ మార్ట్‌ల ఏర్పాటుకు నేషనల్ ఎగ్‌కో ఆర్డినేషన్ కమిటీ (నెక్)తో మెప్మా ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.తద్వారా పట్టణ పేద మహిళల ఉపాధికి కొత్తగా ఎగ్‌మార్ట్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రతి జిల్లాకు 10 చొప్పున ఏర్పాటు చేయనున్నారు. అనగా మొత్తం 260 మార్ట్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ పథకంతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎన్ఇసీసీ) ఆధ్వర్యంలో ఒక్కో మార్ట్ ఏర్పాటుకు రూ.50,000 చొప్పున నిధులు సమకూర్చనున్నారు. మొదట రూ.35 వేలతో పాటు కార్ట్ (బండి), అవసరమైన ఇతర సామగ్రి అందజేస్తారు. మరో రూ.15,000 విలువైన గుడ్లు సరఫరా చేస్తారు. గుడ్లతో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో ఇప్పటి వరకు ఎలాంటి ఉపాధికి నోచుకోని వారికి, ఒంటరి మహిళలకు ఎగ్‌మార్ట్‌ల ఏర్పాటులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అర్హులైన మహిళలను మెప్మా అధికారులు ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయనున్నారు. వచ్చే నెలలో ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.

పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులతో రూపాయి పెట్టుబడి లేకుండా ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయడం ఇదే మొట్టమొదటిసారి. ఇప్పటివరకు ఇటువంటి యూనిట్ల ఏర్పాటుకు మహిళలు చేసిన పొదుపు మొత్తాల నుంచి బ్యాంకులు రుణాలు ఇచ్చేవి. ఇప్పుడు నెక్ మొత్తం పెట్టుబడి పెడుతోంది. మహిళల ఉపాధికి అరుదైన అవకాశమని మెప్మా అధికారులు చెబుతున్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండే ఒంటరి మహిళలకు ఎగ్‌మార్టుల ఏర్పాటుకు అవకాశం ఇవ్వనున్నారు. వారిలోనూ ఉత్పత్తుల తయారీలో అనుభవం ఉన్న వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. వీటిని అల్పాహార విక్రయ కేంద్రాలుగా రూపొందిస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వినియోగదారులను ఆకర్షించే రీతిలో తక్కువ జాగాలో వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

### జిల్లాకు పది చొప్పున మొత్తం 260 మార్ట్‌లు ఏర్పాటు

ఒక్కో మార్ట్ ఏర్పాటుకు రూ.50,000 చొప్పున సమకూర్చుకున్న నిధులు రూ.35 వేలతో కార్ట్ (బండి), ఇతర సామగ్రి మరో రూ.15 వేల విలువైన గుడ్లు సరఫరా గుడ్లతో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# సీమకు ఏం చేశారో చెప్పండి

## వైసిపి నేతలను నిలదీసిన కాల్వ శ్రీనివాసులు



గుంటూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు పచ్చి అబద్ధాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే జగన్ మోహన్ రెడ్డి 'చలో పోతిరెడ్డిపాడు' అనే సరికొత్త రాజకీయ నాటకానికి తెరలేపారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో విమర్శించారు. రాయలసీమలో ఉనికి కోల్పోయిన వైసీపీ, మళ్లీ తన ఉనికిని చాటుకోవడానికే ఇటువంటి పసలేని యాత్రలు చేస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును ప్రారంభించింది టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగుగంగ ద్వారా సీమ, నెల్లూరుకు సాగునీరు అందించాలనే గొప్ప సంకల్పం టీడీపీది. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వచ్చింది టీడీపీ ప్రభుత్వంలోనే రాయలసీమకు నీళ్ల అందించింది ఎన్టీఆర్, చంద్రబాబులు మాత్రమే అని అన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను గాలికొదిలేసి, నేడు "సీమ బిడ్డ" అని చెప్పుకుంటూ యాత్రలు చేయడం సిగ్గుచేటు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని 2020లోనే ఎన్జీటీ అడ్డుకుంటే, అప్పట్లో జగన్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయడంలో కూడా విఫలమైంది. డీపీఆర్ సిద్ధం చేయకుండానే పనులు మొదలుపెడతామని చెప్పి, కమిషన్ల కోసం ప్రాజెక్టును బలిపెట్టిన చరిత్ర వైసీపీది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి, రాజకీయ పబ్బం గడుపుకోవడానికే వైసీపీ నేతలు "ఛలో పోతిరెడ్డిపాడు" డ్రామాకు తెరలేపారని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి పంపించిన ఈ "రెడ్డి బృందం" మాటలను నమ్మే స్థితిలో రాయలసీమ ప్రజలు లేరని ఆయన స్పష్టం చేశారు.

# తిరుమల నెయ్యి కల్తీ కేసులో కర్త, కర్మ, క్రియ జగన్ రెడ్డే

## మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపణ

గుంటూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల తిరుపతి దేవస్థానం మహా ప్రసాదం అపవిత్రమైందని, గత ఐదేళ్లు సరఫరా చేసిన నెయ్యిలో అసలు నెయ్యే లేదని సాక్షాత్తూ టిటిడి ఛైర్మన్‌గా పనిచేసిన వైవి సుబ్బారెడ్డి ఒప్పుకున్నారని, సీబీఐ చార్జ్‌షీట్‌లో కొంతమంది అధికారుల పాత్ర బట్టబయలైందని అసలు పాలే లేకుండా నెయ్యిని సృష్టించినటువంటి ఘనుడు జగన్ రెడ్డి అని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డికి స్వామి వారిపై నమ్మకం లేదు, డిక్లరేషన్ ఇవ్వరన్నారు. చివరికి సామాన్య ప్రజలకు ఇచ్చే ప్రసాదాన్ని కూడా కల్తీ చేసినందుకు సిగ్గుపడాల్సింది పోయి అడ్డగోలుగా వాగుతున్నారన్నారు. కల్తీ లడ్డులనే పవిత్రమైన రామమందిర నిర్మాణ సమయంలో సాక్షాత్తు ప్రధానమంత్రికి ఇచ్చారన్నారు. చేయాల్సిన అరాచకాలు, దుర్మార్గాలు చేసి శాలువాలు కప్పండి అంటున్నారని,. ఆ దేవదేవుడి నెయ్యిని కల్తీ చేసినందుకు మీకు శాలువాలు కప్పాలా? సన్మానాలు చేయాలా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి అపవిత్ర కార్యక్రమాలు చేశారనే అనుమానాలున్నాయని అన్నారు.

వైవి సుబ్బారెడ్డి చెప్పిన దానికి వైసీపీ నేతలు ఏం సమాధానం చెప్తారు? అంటూ నిలదీశారు. గత ఐదేళ్లలో జరిగిన ప్రతి దుర్మార్గాన్ని వెలికి తీస్తామని. తప్పు చేసిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

# క్వాంటం వ్యాలీతో సాంకేతిక విప్లవం

## నేడు కేంద్రమంత్రితో కలిసి సిఎం చంద్రబాబు శంకుస్థాపన



క్వాంటం వ్యాలీ ఊహాచిత్రం

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: భారతదేశ భవిష్యత్ సాంకేతిక రంగాన్ని మలుపుతిప్పే చారిత్రక ఘట్టానికి అమరావతి శనివారం వేదికగా నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడుతోంది. దీని ద్వారా భారతదేశం క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి రానుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో "క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. మధ్యాహ్నం 2.45 గంటలకు క్యాంప్ ఆఫీస్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి 3.00 గంటలకు ఉద్దండరాయునిపాలెం చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే క్వాంటమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు.

### రాష్ట్రానికి, దేశానికి మైలురాయి

అమరావతిలో రూపుదిద్దుకుంటున్న క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, ఉత్పత్తి, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెట్టారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టం విస్తరణ, లక్షలాది యువతకు నైపుణ్య శిక్షణ, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సాధ్యం కావాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు.

### సామాన్యుడి జీవితంలో మార్పు

క్వాంటమ్ టెక్నాలజీతో సామాన్యుడి జీవితంలో మార్పు వస్తుంది. క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతం కావడం, వ్యాధుల నిర్ధారణ మెరుగుపడడం, వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితత్వంతో ఉండడం, బ్యాంకింగ్‌డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందనున్నాయి. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబర్ కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాయకత్వం వహించినట్లే..., అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచంలోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలుస్తుంది. భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుంది.

# నెయ్యిలో కల్తీ లేదని తాడేపల్లి ల్యాబ్ చెప్పిందా జగన్?

ఎమ్మెల్యే కూన రవికుమార్



గుంటూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న యాత్రలపై ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ బయటకు వస్తున్నాడంటేనే ప్రజలు, ముఖ్యంగా తల్లులు భయపడే పరిస్థితి వచ్చిందని ఆయన విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ చేసే యాత్రలు ప్రజల కోసం కాదని, గంజాయి స్మగ్లర్లు, కల్తీ మద్యం అమ్మేవారు, భూకబ్జాదారుల కోసమని మండిపడ్డారు. జనాదరణ లేని తన యాత్రలకు జునీశ్రీ టెక్నాలజీతో కలర్ కొట్టి, పార్టీ బతికే ఉందని భ్రమ కలిగించడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. మొన్న అంబటి ఇంటికి వెళ్లడానికి 30 నిమిషాల ప్రయాణానికి 7 గంటలు ప్రయాణం చేశారన్నారు. శుక్రవారం కల్తీ నేత జోగి రమేశ్ అని పేర్కొంటూ ఆయన్ని పరామర్శించడానికి 15 నిమిషాల ప్రయాణానికి 10 గంటలు సమయం తీసుకుంటూ, డ్రామాలు ఆడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. నాడు జగన్ నాటిన కొడాలి నాని, జోగి రమేష్, అంబటి రాంబాబు, వల్లభనేని వంశీ, రోజా వంటి విషపు మొక్కలే నేడు వృక్షాలుగా మారి వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు తొక్కేశాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆ విషపు వృక్షాల కొమ్మలను కత్తిరించుకోకపోతే జగన్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. యువతకు మందు, గంజాయి ఇచ్చి రోడ్లపై ఫీట్లు చేయిస్తూ, వారి ప్రాణాలతో జగన్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోజు మీ రాజకీయ ప్రచారం కోసం సింగయ్యను కారు కింద నలిపి చంపేశారు. ఈరోజు మీరు చేస్తున్న ఈ పరామర్శ డ్రామా యాత్రలో మరో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ వరుస మరణాలకు పరోక్షంగా మీరే కారణం. కేవలం మీ రాజకీయ ఉనికిని చాటుకోవడానికి, కిరాయి మనుషులతో చేస్తున్న ఈ ప్రదర్శనల వల్ల అమాయకులు బలి అవుతున్నారన్నారు.



# ప్రేమించి పెళ్ళి చేసుకుందని కుమార్తెకు తల్లిదండ్రులు కర్మకాండలు నిర్వహణ

## - చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పిళ్ళారికుప్పంలో సంచలనం

చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కుమార్తె ప్రేమించి పెళ్ళి చేసుకుందని ఆగ్రహానికి గురైన తండ్రి కుమార్తె మృతి చెందిందని ఇంట్లో అంత్యక్రియలు నిర్వహించి సంచలనం సృష్టించిన సంఘటన చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పిళ్ళారికుప్పం గ్రామంలో జరిగింది. పిళ్ళారికుప్పం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డికి ఇద్దరు కుమార్తెలు. ఇందులో ఒక కుమార్తె తిరుపతిలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈమె గ్రామంలో అదే కులానికి చెందిన అబ్బాయిని గత కొంతకాలంగా ప్రేమిస్తోంది. అయితే వీరి ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియదు.

గ్రామంలో అబ్బాయి పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తుండగా తిరుపతి సిటీలో వుండి బిటెక్ చదువుతున్న అమ్మాయి ఇష్టపడింది. వీరిద్దరు తమ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నించారు. అయితే అమ్మాయి తరపు నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో తనను ప్రేమించిన యువకుడి వైపు ఆ అమ్మాయి మొగ్గు చూపింది.

గ్రామం నుండి గురువారం ప్రేమించిన ఇద్దరు మాయం అయ్యారు. గుడికి వెళ్ళి వివాహం చేసుకుని ఒకటయ్యారు. ఈ క్రమంలో తన కుమార్తె తాను అంగీకరించని యువకుడిని పెళ్ళి చేసుకుందని ఆగ్రహానికి గురైన తండ్రి ఇకపై తనకు ఒక కుమార్తె లేదని, ఆమెకు గురువారం అంత్యక్రియలు నిర్వహించాడు.

ఇంట్లో తన కుమార్తె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, బంధువులు, గ్రామస్తులను ఇంటికి పిలిచి భోజనం పెట్టాడు. ఇదే తరహాలో ఇదే గ్రామంలో ఇది వరకు సైతం ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. శ్రీరంగరాజపురంలో తన మాట వినలేదని సొంత కుమార్తెకు తండ్రి అంత్యక్రియలు నిర్వహించడం సంచలనం కల్గించింది.

# రాజముద్రతో పాస్ పుస్తకాలు

• రైతులకు ఇబ్బంది లేకుండా చూడటం మా బాధ్యత • ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



ముత్తుకూరు (నెల్లూరు), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: రైతులకు ఇబ్బంది లేకుండా చూడటం మా బాధ్యతని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముత్తుకూరు తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు రాజముద్ర, క్యూర్ కోడ్‌తో కూడిన పట్టదారు పాసుపుస్తకాలు అందిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో రీసర్వే పేరుతో నేరాలు ఘోరాలు జరిగిపోయాయని, మన తాతలు ఇచ్చిన భూములకు సంబంధించిన పాసుపుస్తకాలపై జగన్ రెడ్డి ఫొటోలు వేయించుకున్నారని అన్నారు. రీసర్వేలో జరిగిన భారీ తప్పిదాలను సరిదిద్దడం ప్రస్తుతం అధికారులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. ఉదాహరణకు మామిడి పూడిలో 180 ఎకరాల భూమి వాగు పొరంబోకుగా నమోదైందని తెలిపారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర అన్ని పత్రాలు ఉన్నప్పటికి రైతులు హక్కులు కోల్పోయిన దుస్థితి అని అన్నారు. పొదలకూరు మండలంలో అయితే ఊళ్లకు ఊళ్లను 22ఏలో పెట్టి రైతులను సమస్యల్లోకి నెట్టారని అన్నారు. పార్లపల్లి, మర్రిపల్లి, మహ్మదాపురం, వెలికంటిపాళెం గ్రామాల్లో వందల ఎకరాలను 22ఏ, గయాళుగా పెట్టేశారు. ప్రస్తుతం రెండు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించగా, మిగిలిన గ్రామాల సమస్యల పరిష్కారం ప్రాసెసింగ్‌లో ఉందన్నారు. ఏ ఊరికి వెళ్లినా, కార్యాలయంలో కూర్చున్నా భూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో రెవెన్యూ అధికారులకు అధికారం లేకుండా రిటైర్డ్ అధికారుల చేతిలో భూముల పెత్తనం పెట్టారు. రైతుల పాలిట ప్రమాదభరితంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని, పట్టాదారు పాసు పుస్తకాలపైనా రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించి రాజముద్రతో అందిస్తున్నామన్నారు. ముత్తుకూరు మండలంలో 5480 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 2370 మందికి అందించారు. గతంలో చోటుచేసుకున్న పొరపాట్లను సరిదిద్దిన తర్వాతే రైతులకు అందిస్తున్నారు. రైతులు తమ భూములపై హక్కులు పొందే విషయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడటం మా బాధ్యత అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రజాధర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను నిర్దేశిత కాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవి కుమార్ రెడ్డి, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పలం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగల శివకృష్ణ, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, అక్కయ్య గారు ఏడుకొండలు, శంకర్, సర్వేపల్లి ఐటిటిపి నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు, నన్నం దీనయ్య, నాయకులు పాల్గొన్నారు.



# క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తేనే భూమి వివరాలు

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, (నెల్లూరు), ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌వెంకటేశ్వర్లుతో కలసి ఎమ్మెల్యే రైతులకు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త తరహా పాసుపుస్తకాల్లో క్యూఆర్ కోడ్, భూమి విస్తీర్ణం, లాంగిట్యూడ్, లాటిట్యూడ్ వివరాలు ఎనిమిది దిక్కుల హద్దులు పొందుపరచడం ద్వారా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే పత్రంలో లభిస్తుందని తెలిపారు. ఇక బ్యాంకులోన్ కోసం అధికారులు రైతుల పొలాలకు రావల్సిన అవసరం లేకుండా, క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తేనే భూమి వివరాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. దీంత రుణాల ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. గత ప్రభుత్వ కాలంలో పాసుపుస్తకాలపై వ్యక్తిగత పోటోలు ముద్రించడాన్ని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. 120ఏళ్ళ తరువాత భూములకు రీసర్వే చేపట్టి, పాత రికార్డుల గందరగోళాన్ని తొలగిస్తూ కొత్త హద్దులను ఖరారు చేశామని వివరించారు. రైతుల తమ పాసుపుస్తకాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే తహశీల్దార్ కార్యాలయం లేదా సచివాలయ ద్వారా ధరఖాస్తు చేసుకుని సవరణ చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ, తహశీల్దార్ శ్రావన్‌కుమార్, రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం స్మగ్లర్ అరెస్టు



యర్రావారిపాలెం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: వాహనంతో సహా ఎర్రచందనంను స్వాధీనం చేసుకుని స్మగ్లర్ ను అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వి. సాయిబాబా ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఉస్తికాయలపెంట అడవికి సమీప ప్రాంతాల నుంచి వాహనంలో తమిళనాడు రాష్ట్రానికి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు రేంజ్ సిబ్బంది, బేస్ క్యాంపు, స్ట్రైక్ ఫోర్స్ ప్రొటెక్షన్ వాచర్లు ఉస్తికాయలపెంట బీట్ పరిధిలోని ప్రసాద్ నగర్ సమీపంలో కాపుకాస్తుండగా తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో అనుమానిత వాహనం రావడాన్ని గమనించి ఆపేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా యల్లమంద జంక్షన్ వైపు అత్యంత వేగంగా పారిపోయాడు. అప్రమత్తమైన అటవీ సిబ్బంది సినీ పక్కీలో వాహనాన్ని వెంబడించి, ఎస్‌వైబీ ఎల్లమంద మ్యాంగో మండి వద్ద వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ వాహనం నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించగా, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. వాహనంతో సహా సుమారు రూ.35 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు. అశోక్ లేలాండ్ దోస్త్ వాహనంతో పాటు 763 కిలోల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వాహనం, ఎర్రచందనం విలువ సుమారు రూ.35 లక్షలుగా అంచనా వేశారు. పట్టుబడిన నిందితుడు చిత్తూరు జిల్లా గుడిపాల మండలానికి చెందిన జే.పవన్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓబి మునిస్వామి నాయక్, ఎఫ్ బి ఓలు కె.లక్ష్మి ప్రసాద్, ఎంఎల్ సదాశివయ్య, వై. రాజేష్ కుమార్, జి. ప్రదీప్ చంద్, జే.బి.నిఖిల్, బేస్ క్యాంపు, స్ట్రైక్ ఫోర్స్ ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి తగాదాతో రైల్వే ఉద్యోగి దారుణ హత్య



కావలి, (నెల్లూరు) ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఆస్తి తగాదా, కుటుంబ కలహాలతో రైల్వే గేట్‌మాన్ దారుణ హత్యకు గురైన సంఘటన కావలి రూరల్ మండలం, రుద్రకోట ఎస్సీ కాలనీలో జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు రుద్రకోట గ్రామానికి చెందిన ఆరే చినకొండయ్య రైల్వేలో గేట్‌మెన్‌గా పనిచేస్తూ విఆర్ఎస్ ఇచ్చి ఉద్యోగమును చిన్న కొండయ్య మొదటి భార్య రెండో కుమారుడైన నాగరాజుకు(47) ఇచ్చినటుల తెలిపారు. ప్రస్తుతం నాగరాజు కావలి టౌన్‌లోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద రైల్వేగేట్ నందు ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. నాగరాజుకు సుమారు 28సంవత్సరాల క్రితం మృతుడి మేనత్త కుమార్తె మాధవితో వివాహమైనట్లు తెలిపారు. వీరికి ముగ్గురు కుమారులు సంతానమైనట్లు తెలిపారు. వీరిద్దరికి మనస్పర్ధలు కారణంగా 10సంవత్సరాల కిందట ముగ్గురు కుమారులని తీసుకొని చిన్నగంజాంలో ఉన్న తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు తెలిపారు. నాగరాజు రుద్రకోట ఎస్‌సికాలనీలో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తుండేవాడని తెలిపారు. నాగరాజు ఉంటున్న ఇల్లుని మృతుని అత్త అంకమ్మ స్థలం కొని ఇట్లు కట్టించినట్లు తెలిపారు. ఇంటిని నాగరాజు తన పేరు మీద మార్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఆ విషయం గురించి నాగరాజుకి ఆయన అత్త, భార్య కుమారులకు గొడవ ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల కిందట మృతుడు రెండవ కుమారుడైన నవీన్ వచ్చి ఉండి గురువారం రాత్రి ఎప్పుడో ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపారు.

శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో మృతుడు పిన్నమ్మ శేషమ్మ వచ్చి చూడగా మృతుడు శరీరంపై బలమైన గాయాలు తగిలి చనిపోయి ఉన్నట్లు విషయంను భర్త అంజమ్మకు మృతుని తండ్రి ఆరే చిన్నకొండయ్యకు ఫోన్ ద్వారా తెలియజేడయం జరిగిందన్నారు. మృతుడు తండ్రి అతని మూడో భార్య అయిన శాంబవి ఇతని కుమారుడైన సాయిఈశ్వర్ వచ్చి చూసి మృతుని మరణంపై అనుమానం ఉన్నటుల కావలి రూరల్ పోలీసేటషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సంఘటన ప్రదేశాన్ని కావలి రూరల్ పోలీసులు, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం పరిశీలించడం జరిగింది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు

## 31 మందికిపైగా దుర్మరణం, 160 మందికి పైగా గాయాలు

## క్షతగాత్రులలో పలువురి పరిస్థితి విషమం

## ఓ ప్రార్ధనామందిరం వెలుపల జరిగిన ఆత్మాహుతి దాడి

## ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధింపు



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద శుక్రవారం జరిగిన ఈ పేలుడులో సుమారు 31 మందికిపైగా మరణించగా.. 160 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం షియా ప్రార్థనా మందిరం ప్రధాన ద్వారం వద్ద ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. భారీ దాడిలో ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. బాంబర్‌ను ముందుగా ద్వారాల వద్దే సెక్యూరిటీ అధికారులు నిలిపివేశారు. ప్రధాన మందిరంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని అక్కడి అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకున్నాడని చెప్పారు. ఒకవేళ ప్రధా ప్రార్థనా స్థలంలో పేలు జరిగితే భారీ సంఖ్యలో భక్తులు మరణించేవారని చెబుతున్నారు. భక్తులు బయటకు వస్తున్న సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. పేలుడు తీవ్రతతో ప్రార్థనా మందిరం ప్రవేశద్వారం పూర్తిగా ధ్వంసమవ్వగా, చుట్టుపక్కల భవనాల కిటికీలు పగిలిపోయాయి. రోడ్లపై శిథిలాలు చెల్లా చెదురుగా పడిపోయాయి.

ఇది బలోచిస్థాన్ లిబరేషనన ఆర్మీ (బిఎల్ఎ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు.

గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబరులో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

# కీలక వడ్డీరేట్లు యధాతథం

## - ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



**ముంబయి, ఫిబ్రవరి 6:** కీలక వడ్డీరేట్లలో రిజర్వ్ బ్యాంక్ ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బిఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆబిఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదవ్వొచ్చని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసినట్లు వివరించారు.

**డిజిటల్ మోసాల్లో బాధితులకు రూ.25 వేల సాయం:** సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోతున్న క్రమంలో బాధితులకు అండగా నిలిచేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం కీలక ప్రకటన చేశారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు బ్యాంకింగ్ కస్టమర్లకు పరిహారం అందేంచేలా ఆర్బీఐ కొత్త నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులకు రూ.25 వేల వరకు పరిహారం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ ఖాతాదారులు నష్టపోయిన సమయంలో కొంతమేర ఆర్థిక సాయం అందించేందుకు ఈ పరిహారం ఉపయోగపడుతుంది. డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు భద్రత కల్పించడం, కస్టమర్ల ప్రయోజనాలను కాపాడటం, తక్షణ ఆర్థిక సాయం అందించే విధంగా ప్రతిపాదించినట్లు వివరించారు. త్వరలో దీనిపై మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేస్తామన్నారు.

**ఖాతాదారుల భద్రతకు పెద్దపీట.. మూడు కీలక అంశాలపై కొత్త రూల్స్:** బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలకు పరిహారం, ఆర్థిక ఉత్పత్తుల మిస్‌సెల్లింగ్‌కు అడ్డుకట్ట, లోన్ రికవరీ ఏజెంట్లపై ఏకరీతి నిబంధనలు తీసుకురానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఈ మూడు కీలక అంశాలపై త్వరలోనే ముసాయిదా మార్గదర్శకాలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

చిన్న విలువ గల మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు వినియోగదారులకు పరిహారం అందించేందుకు కొత్త నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలలో కస్టమర్ల బాధ్యతను పరిమితం చేస్తూ 2017లో మార్గదర్శకాలు జారీ చేశామని, అయితే అప్పటి నుంచి సాంకేతికతలో భారీ మార్పులు వచ్చిన నేపథ్యంలో వాటిని సమీక్షిస్తున్నామని వివరించారు. అలాగే బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సిలు) ఆర్థిక ఉత్పత్తులను, సేవలను తప్పుదోవ పట్టించేలా విక్రయించడాన్ని (మిస్ సెల్లింగ్) అరికట్టేందుకు నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు, వారి రిస్క్ సామర్థ్యానికి సరిపోని ఉత్పత్తులను విక్రయించడం వల్ల ఇరు వర్గాలకూ నష్టమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఉత్పత్తుల ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలపై సమగ్ర మార్గదర్శకాలను తీసుకురానున్నారు. ఇక, లోన్ రికవరీకి సంబంధించి రికవరీ ఏజెంట్ల నియామకం, వారి ప్రవర్తనపై ప్రస్తుతం బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సిలకు వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయని గవర్నర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్ని నియంత్రిత సంస్థలకు ఒకే రకమైన, ఏకీకృత నిబంధనలను తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అంశంపైనా ముసాయిదా మార్గదర్శకాలను త్వరలో ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

**రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణం:** చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి రిజర్వ్ బ్యాంక్ శుభవార్త అందించింది. వీరికి ఇప్పటివరకు పూచీకత్తు లేకుండా అందిస్తున్న బ్యాంకు రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి మొదలైన ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారాలకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని రుణం అందిస్తున్నారు. దీనిని ఇప్పుడు రూ.20 లక్షలకు పెంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చిన్న వ్యాపారులు చేసేవారికి ఎలాంటి హామీ లేకుండా రూ.20 లక్షల వరకు లోన్ పొందే అవకాశం లభించనుంది. కొత్తగా లోన్ తీసుకునేవారితో పాటు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునేవారికి కూడా రూ.20 లక్షల వరకు పూచీకత్తు ఉండదు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. చిన్న వ్యాపారాలు, స్టార్టప్స్ కంపెనీలకు ఈ నిర్ణయంతో ఎంతో ప్రయోజనం కలగనుంది.

## వెండికోసం వృద్ధురాలిని పడుకున్న మంచం సహా ఎత్తుకెళ్లిన దొంగలు

### రాజస్థాన్‌లో ఘటన!

**జైపూర్, ఫిబ్రవరి 6:** వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, దొంగలు దారుణంగా ప్రవర్తిస్తున్నారు. రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాలో జరిగిన ఓ ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు కిలోన్నర బరువున్న వెండి ఆభరణాల కోసం 90 ఏళ్ల వృద్ధురాలిని ఆమె పడుకున్న మంచంతో సహా ఎత్తుకెళ్లారు. ఈ షాకింగ్ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే భిల్వారా జిల్లా అర్వాడ్ ప్రాంతంలోని కోఠియా గ్రామంలో మాజీ సర్పంచ్ నత్తి దేవి మాలి ఇంట్లోకి రాత్రి సమయంలో దొంగలు చొరబడ్డారు. ముందుగా ఇంట్లోని వారిని గదుల్లో బంధించి బయట గడి య పెట్టారు. వరండాలో మం చంపై నిద్రిస్తున్న నత్తిదేవి అత్తగారైన 90 ఏళ్ల ఛోటీ దేవిని గమనించారు. ఆమె ఒంటిపై భారీగా వెండి ఆభరణాలు ఉండటంతో నోరు నొక్కి మంచంతో పాటు సమీపంలోని పొలంలోకి ఎత్తుకెళ్లారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తల్లీ బిడ్డల ఆత్మహత్యలపై వీడని మిస్టరీ

### విజయశాంతి రెడ్డి సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘట్‌కేసర్ మార్గంలో గత నెల 30వ తేదీన అర్ధరాత్రి 12.40 గంటల సమయం లో బోడుప్పల్‌కు చెందిన విజయశాంతి రెడ్డి (38) ఆమె కుమార్తె చేతనా రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (16)లు గూడ్సు రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్న ఘటనపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ ఉదంతంపై అటు ఆమె భర్త సురేందర్ రెడ్డి సహా ఇతర కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి అనుమానాలు వ్యక్తం కాకపోవడం, అటు విజయశాంతి రెడ్డి పనిచేసే కార్యాలయంలోని సిబ్బంది సైతం నోరుమెదపక పోవడంతో దీనిపై ముందు కు సాగేందుకు పోలీసులకు క్లిష్టంగా మారింది. ఈ ఘటన జరిగిన రోజున దుబాయ్‌లో వున్న విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి మరుసటి రో జు హైదరాబాద్‌కు వచ్చి ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు రోజుల అనంతరం ఆయన పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తమ కుటు ంబంలో ఎలాంటి గొడవలు లేవని, తన భార్య విజయశాంతి రెడ్డి చాలా ధైర్యవంతురాలని, ఇద్దరు పిల్లలంటే ఆమెకు ప్రాణమని, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని సురేందర్ రెడ్డి చెప్పారు. మరోవైపు విజయశాంతి రెడ్డి సోద రుడు చిరంజీవి రెడ్డి కూడా ఇదే విధంగా వాంగ్మూలం ఇచ్చారు. అయితే చివరగా విజయశాంతి రెడ్డి తన సోదరుడితోనే ఫోన్‌లో మాట్లాడడంతో అ తనితో వున్న లావాదేవీల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. చిరంజీవి రెడ్డి బ్యాంకు స్టేట్ మెంట్లను, వ్యాపార లావాదేవీలను పోలీసులు పరిశీలిం చారు. ఆయన ఇంట్లో సోదాలు చేశారని తెలిసింది. ఇదే సమయంలో విజయ శాంతి రెడ్డి ఇంట్లోనూ పోలీసులు సోదాలు చేశారు. ఆమె బ్యాంకు లా వాదేవీలను పరిశ శీలించారు. పాస్ పుస్తకాన్ని, చెక్ పుస్తకాన్ని, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. విజయ శాంతి రెడ్డి దంపతుల మధ్య ఎలాంటి త గాదాలు లేవని స్థానికులు చెబుతున్నారు. వారుండే బోడుప్పల్‌లోని అపార్ట్‌మెంట్లో సహచరులు వారి గురించి సదాభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. వా రి సొంతవూరైన మోత్కూరులోనూ వీరికి మంచి పేరే వుందని పోలీసుల విచారణలో తేలింది. ఈ దంపతులకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లే వని పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. అటువంటి సమయంలో విజయశాంతి రెడ్డి తాను ఆత్మహత్య చేసుకోవడంతో పాటు తనతో పా టు ఇద్దరు పిల్లలను కూడా ఆత్మహత్యలకు పురిగొల్పడం పోలీసులకు అంతు చిక్కడం లేదు. మరోవైపు వీరిది హత్యగా జరుగుతున్న ప్రచారాన్ని పో లీసులు ఖండించారు. వీరిది ఆత్మహత్యేనని స్వయంగా గూడ్స్ రైలు డ్రైవర్ చెప్పడం ఇందుకు బలమైన సాక్ష్యంగా పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో విజయశాంతి రెడ్డి గత నెల 30వ తేదీన సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కడెక్కడ తిరిగింది...? ఆత్మహత్య చేసుకునే వరకు వున్న సిసి ఫుటేజిలను పోలీసులు స్వాధీనం చేసుకుని వాటిని పరిశీలిస్తున్నారు. ఈ కేసులో చర్లపల్లి రైల్వే స్టేషన్ అధికారులు, ఆర్‌పిఎఫ్ పోలీసుల వైఫల్య ంపైనా పోలీసులు విచారిస్తున్నారు.

# మీకు ఏది కరెక్టయితే అదే చేయండి

## - ప్రధాని మోడీపై రాహుల్‌గాంధీ సెటైర్లు - ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోంది - ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులను మాట్లాడనివ్వరు. కానీ, విపక్షాలపై ఆరోపణలు గుప్పి స్తారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోడీ ప్రసంగంపై విపక్ష నేత విమర్శలు గుప్పించారు. జో ఉచిత్ సమో... వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్, అమెరికా డీల్‌ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోడీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు. ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటీ లేదని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు.



## క్షయ వ్యాధిని గుర్తించేలా ఎఐ స్టెతస్కోప్‌లు

### రూపొందించిన జర్మనీ వైద్య బృందం

### వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** ప్రపంచవ్యాప్తంగా మరణాలకు అత్యంత ప్రాణాంతకమైన క్షయవ్యాధి (టిబి) కొనసాగుతున్నందున, కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు క్లిష్టమైన స్క్రీనింగ్ అంతరాలను పూరించడంలో సహాయపడతాయని ఒక కొత్త అధ్యయనం చూపించింది, ముఖ్యంగా చేరుకోవడానికి కష్టతరమైన మారుమూల ప్రాంతాల్లో టిబి స్క్రీనింగ్‌లో ఉన్న లోపాలను ఈ టెక్నాలజీతో అధిగమించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జర్నల్ మెడ్ (సెల్ ప్రెస్)లో ప్రచురించబడిన కథనం ప్రకారం... డిజిటల్ టెక్నాలజీ, ఎఐతో కలిపి స్టెతస్కోప్‌లు స్క్రీనింగ్ కార్యక్రమాలలో ఎదురయ్యే సవాళ్లైన అండర్‌డిటెక్షన్, అధిక ధర, అసమాన యాక్సెస్ వంటి వాటికి వ్యతిరేకంగా మెరుగైన ఎంపికగా ఉండవచ్చని ప్రపంచ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎఐ ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు ఊపిరితిత్తుల, హృదయ సంబంధ అసాధారణతలను గుర్తించడానికి ఆశాజనకమైన ఖచ్చితత్వం, సాధ్యతను ప్రదర్శించాయి, తొలి అధ్యయనాలలో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఈ సాధనం సామర్థ్యాన్ని మరింత అన్వేషించడానికి విభిన్నమైన, అధికభారం ఉన్న సెట్టింగ్‌లలో శిక్షణ, ధ్రువీకరణ చాలా అవసరం" అని కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ పరిశోధకుడు మధుకర్ పాయ్ బృందం పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (జూబీవీ) నివేదిక ప్రకారం, ప్రస్తుత స్క్రీనింగ్ విధానాల ద్వారా ఏటా సుమారు 27 లక్షల టీబీ కేసులను గుర్తించలేకపోతున్నారు. లక్షణాలు లేని వారిని గుర్తించడం, ఎక్స్‌రే వంటి పరీక్షల అధిక ఖర్చు, రేడియేషన్ భయాలు వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ సవాళ్లకు ఏఐ ఆధా రిత డిజిటల్ స్టెతస్కోప్‌లు సరైన పరిష్కారం చూపగలవని మెడ్ (సెల్ ప్రెస్) జర్నల్‌లో ప్రచురితమైన కథనంలో అంతర్జా తీయ నిపు ణులు పేర్కొన్నారు కెనడాలోని మెక్‌గిల్ యూని వర్సిటీ పరిశోధకుడు మధుకర్ పాయ్ నేతృత్వం లోని బృందం ఈ అధ్యయనం చేసింది.



# చర్చలు విఫలమైతే బలప్రయోగమే

## ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** ఒమన్ వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య అణుచర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో ఇరు దేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నాయా అని అంతా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే బలప్రయోగానికి కూడా తమ దేశ అధ్యక్షుడు ట్రంప్ వెనుకాడబోరన్నారు. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) విలేకరులతో మాట్లాడుతూ లీవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్ చర్చల్లో ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ట్రంప్ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అణురహిత ఇరాన్ డిమాండ్‌కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ క్రమంలో దౌత్యం సాధ్యం కాకపోతే.. ట్రంప్‌నకు మరిన్ని ఎంపికలు ఉన్నాయని హెచ్చరించారు. చర్చల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు 'ఖమేనీ కలత చెందక తప్పదు' అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. రివల్యూషనరీ గార్డ్స్ స్థావరంలోని అండర్ గ్రౌండ్‌లో టెహ్రాన్ దీర్ఘశ్రేణి ఖొర్రామ్‌షహర్-4 క్షిపణులను మోహరించిందని స్థానిక మీడియా పేర్కొంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు, యుద్ధనౌకలు, నిఘా విమానాలతోపాటు అనేకమంది అదనపు దళాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే మొహరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వేలాది మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము జోక్యం చేసుకుంటామని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా యుద్ధనౌకలను ఆ దేశం దిశగా పంపించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఆ తర్వాత అణు చర్చలకు ఇరు దేశాలు అంగీకరించాయి. శుక్రవారం ఒమర్ వేదికగా ఇది జరగనున్నాయి. ఇందులో అణు చర్చలతోపాటు మరికొన్ని విషయాలపై కూడా సమాలోచనలు జరపాలని టెహ్రానన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

### ఐటి జరిమానా రూ.1.5 కోట్లు చెల్లించాల్సిందేనంటూ తీర్పు

**చెన్నై, ఫిబ్రవరి 6:** ప్రముఖ తమిళ హీరో, టివికె అధినేత విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. ఆదాయపు పన్ను శాఖ విధించిన ట్యాక్స్ పెనాల్టీని రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని శుక్రవారం తీర్పు వెలువరించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువగా చూపించారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. అప్పట్లో విడుదలైన పులి సినిమాకు తీసుకున్న పారితోషికాన్ని తగ్గించి చూపారని పేర్కొంది.

ఆ సినిమాకు రూ.15 కోట్లు పారితోషికంగా విజయ్ అందుకున్నారని, అందులో రూ.5 కోట్లను నగదు రూపంలో తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా ఆదాయపు పన్ను ఎగ్గొట్టారని ఆరోపించారు. శాఖాపరమైన దర్యాప్తులో ఈ విషయం తేలడంతో విజయ్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.1.5 కోట్ల పెనాల్టీ విధించింది. ఈ పెనాల్టీని రద్దు చేయాలంటూ విజయ్ మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు గత నెల 23న తీర్పు రిజర్వు చేసింది. శుక్రవారం తీర్పు వెలువరిస్తూ.. ఆదాయపు పన్ను శాఖ విధించిన రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది.

# సంక్షిప్తంగా..

## నేపాల్‌లో బస్సులోయలో పడి 13 మంది మృతి

**ఖాట్మండ్, ఫిబ్రవరి 6:** నేపాల్ బైతాడి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తరాఖండ్ సరిహద్దు సమీపంలో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది బజాంగ్ జిల్లాకు చెందిన వారని కర్మాండు పోలీసులు తెలిపారు. బస్సు కొండపై ప్రయాణిస్తున్న సమయంలో బ్రేక్ పైపు పగిలిపోవడంతో, డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్కిడ్ గేమ్ చూసాడని మరణదండన



**ప్యాంగ్‌యాంగ్, ఫిబ్రవరి 6:** స్కిడ్ గేమ్ వంటి దక్షిణ కొరియా టివి షోలను వీక్షించినా, కే-పాప్‌ను ఆలకించినా ఉత్తరకొరియా ప్రభుత్వం తన ప్రజలకు మరణశిక్ష విధిస్తున్నదని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తాజాగా వెల్లడించింది. దక్షిన కొరియాకు చెందిన మీడియాను వినియోగించినా స్కూలు పిల్లలను సైతం ఉత్తర కొరియా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తున్నదని ఆమ్నెస్టీ తెలిపింది. విదేశీ కంటెంట్ వాడకంపై యువజనులను హెచ్చరించడానికి బహిరంగ మరణశిక్షలను బలవంతంగా వారికి చూపిస్తున్నదని ఉత్తరకొరియా నుంచి తప్పించుకుని పారిపోయిన పౌరుల వాంగ్మూలాన్ని ఉటంకిస్తూ ఆమ్నెస్టీ వెల్లడించింది. ఆరోగ్యం, సామాజిక హోదాపై శిక్షలు ఆధారపడి ఉంటాయని, పేద ప్రజలు మరణం సహా కఠిన శిక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని, పలుకుబడి ఉన్న కుటుంబాల వారు అధికారులకు లంచాలు ఇచ్చి మరణశిక్షలను తప్పించుకుంటారని హక్కుల సంస్థ వివరించింది.

## 'ఘుష్ఖోర్ పండిట్' సినిమా నిలిపేయండి: మాయావతి





**లక్నో, ఫిబ్రవరి 6:** 'ఘుష్ఖోర్ పండిట్ ' సినిమా ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సినిమా టైటిల్ కుల తత్వానికి సంబంధించినదిగా, అవమానకరమైందిగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే సినిమాపై నిషేధం విధించాలని డిమాండ్ పెరుగుతోంది. ఇక ఈ వ్యవహారంపై బిఎస్పీ అధినేత్రి మాయావతి స్పందించారు. ఘుష్ఖోర్ పండిట్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు. సినిమాలో పండిట్ అనే పదాన్ని ప్రతికూలంగా ఉపయోగించడం వల్ల బ్రాహ్మణ సమాజంలో ఆగ్రహావేశాలు ఉన్నాయని తెలిపారు. మాయావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చిత్రం ద్వారా బ్రాహ్మణ సమాజాన్ని అగౌరవపరుస్తున్నారని తెలిపారు. సమాజంలోని పెద్ద వర్గం మనో భావాలను దెబ్బతీస్తున్నందున అటువంటి సినిమాను నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు.

## చైనా వెళుతున్న ఓడలో ఒడిశా నేవీ అధికారి మిస్సింగ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** మారిషస్ సమీపంలో ఓ నౌకలో విధుల్లో ఉన్న భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆ అధికారిని ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రోగా గుర్తించారు. బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్న వివరాల ప్రకారం గతేడాది జులైలో ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో సార్థక్ ఉద్యోగంలో చేరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం
ఏపి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నెం. 2505/DPHEO/MTM/2026 తేది: 06.02.2026
పనిపేరు: బంటుమిల్లి మండలం ములపర్రు గ్రామ పంచాయత్, యొక్క ములపర్రు గ్రామం మరియు రామన్న మోడి గ్రామం (పార్ట్-2) మధ్య పాడైన పైప్‌లైన్ యొక్క రిప్లేస్‌మెంట్. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ.14,11,294.95. స్వీకరణకు చివరి తేది/సమయం: 25.02.2026 సా.5.00గం. వరకు. తదుపరి వివరాలకు www.apeprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నం: 9849906219.
సం/-. జిల్లా ప్రజారోగ్య ఇంజనీరింగ్ అధికారి, మచిలీపట్నం.
DIPR.NO. 19011/CL/ADVT/1/1/2022-23 తేది: 06.02.2026

# విజ్ఞాన్ మహోత్సవ్ వేదికపై చైనా పీస్ సినిమా యూనిట్ సందడి

**చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి 19వ ఎడిషన్ విజ్ఞాన్ మహోత్సవ్-2కె26 రెండో రోజు కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా సాగాయి. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడుతున్న మహోత్సవ్ వేదికపై చైనా పీస్ సినిమా యూనిట్ సందడి చేయడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హీరో నిహాల్ కొదాటి, నటి శిరీష, దర్శకుడు అక్కి విశ్వనాథరెడ్డి ఈ మహోత్సవానికి హాజరైన విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసి



వేదికను ఉర్రూతలూగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో నిహాల్ కొదాటి మాట్లాడుతూ చైనా పీస్ సినిమా మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి స్పై థ్రిల్లర్‌గా, దేశభక్తి, రహస్య మిషన్లు, పొలిటికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కించామని చెప్పారు. ఇందులో భావోద్వేగాలు, ఉత్కంఠ, యాక్షన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే దేశభక్తి థీమ్‌తో విడుదలైన భగ భగ పాటకు మంచి స్పందన వస్తోందని, అలాగే ఇదేంటో జేమ్స్ బాండ్ పాట కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిందన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి విద్యార్థుల వేదికపై సినిమా ప్రమోషన్ చేయడం ఎంతో ఆనందంగా ఉందని, విద్యార్థుల ఉత్సాహమే తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. విద్యార్థులందరూ ఈ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా నటి శిరీష మాట్లాడుతూ చైనా పీస్ సినిమాలో తన పాత్ర కథలో కీలక మలుపులు తిప్పే విధంగా ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకునే బలమైన పాత్రగా ఇది నిలుస్తుందని తెలిపారు. ఈ సినిమాలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి ఉత్సాహభరిత వేదికపై విద్యార్థులతో కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నిండిన ఈ మహోత్సవ్ వాతావరణం యువతలో సృజనాత్మకతను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. దర్శకుడు అక్కి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ చైనా పీస్ మూవీ క్లాసిక్ స్పై డ్రామాతో పాటు థ్రిల్, యాక్షన్, హ్యూమర్ అన్నీ మేళవింపుతో రూపొందించామని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించిందన్నారు. సీరియస్ థ్రిల్‌తో పాటు ప్రేక్షకులను నవ్వించే కొన్ని కామెడీ ఎలిమెంట్స్ కూడా ఉంటాయన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి జాతీయస్థాయి వేదికపై సినిమా గురించి మాట్లాడే అవకాశం రావడం తమకు గర్వకారణమని అన్నారు. ఈ చిత్రాన్ని మూన్‌లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై నిర్మించారని, సినిమాకు అక్కి విశ్వనాథరెడ్డి దర్శకత్వం వహించగా, సంగీత దర్శకుడిగా ఆర్.కార్తీక్, ఎడిటర్‌గా మార్తాండ్ కే.వెంకటేష్, సినిమాటోగ్రాఫర్‌గా ఆర్.సురేష్ పనిచేశారని చెప్పారు. సినిమా యూనిట్ సభ్యులు విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం చైనాపీస్ సినిమా యూనిట్ సభ్యులు విద్యార్థులతో కలిసి సెల్ఫీలు దిగడంతో కార్యక్రమం మరింత ఉత్సాహంగా మారింది. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా సాగుతున్న విజ్ఞాన్ మహోత్సవ్‌కు సినిమా బృందం చేసిన ఈసందడి మరింత రంగు అద్దింది. కార్యక్రమంలో ఆయావిభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి : బయోలజిస్ట్ కామేశ్వరరావు

**విజయవాడ కార్పొరేషన్, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :** ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని బయోలజిస్ట్ కామేశ్వరరావు పేర్కొన్నారు. కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం కోనేరు వారి వీధి ప్రాంతంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజలు వారి ఇళ్ళల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలని వారికి అవగాహన కల్పిస్తూ, దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. దోమలవల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కోసం నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని పిలుపునిచ్చారు. తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రోణ పొందవచ్చని అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, శానిటరీ ఇనస్పెక్టర్లు, మలేరియా ఇనస్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఎఎన్‌యంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో అధ్యాపకునికి సత్కారం

**మైలవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** డా. లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైలవరం తెలుగు విభాగం శాఖాధ్యక్షులు డా. మెండా దేవానంద్ కుమార్ మేరీ స్టెల్లా అటానమస్ కళాశాల, ప్రత్యేకంగా సన్మానించారు. విజయవాడ తెలుగు శాఖ ఆధ్వర్యంలో "భారతీయ జ్ఞాన పరంపర తెలుగు సాహిత్యం" అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షత వహించారు. ప్రాచీనాంధ్ర లేఖనాల్లో జ్ఞాన సంప్రదాయాల పరిశీలన అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. భారతీయ విజ్ఞానాన్ని అధ్యయనం చేయాలంటే ఆర్య, అనార్య సంస్కృతులను అధ్యయనం చేయాలన్నారు. ఆర్య నాగరికత సింధు నాగరికత భారతదేశానికి రెండు కళ్ళు వంటివన్నారు. ఆదిమానవుల నుండి ఆధునిక మానవుడి వరకు ఒక గొప్ప గుణం ఉన్నదన్నారు అదేమిటంటే తాను తెలుసుకున్న నేర్చుకున్న సంగతులను తర్వాతి తరాలకు అందించడానికి ప్రత్యేక శ్రద్ధతో భద్రపరచడం మనం గుర్తించాల్సిన విషయం. కొండ గృహాల్లో, పైకప్పుల పైన, శాసనాల రూపంలో తాళపత్ర గ్రంథాల్లో, వస్త్రాల మీద లిఖించి భద్రపరిచిన తీరు అమోఘం. లిపి లేని రోజుల్లో మౌఖికంగా ఒక తరము నుండి మరొక తరానికి అందించారన్నారు. లిపి లన్నిటికీ తల్లి ఈజిప్టు దేశంలోని క్యూని ఫామ్ లిపి ఆధారం. భారతీయ భాషలన్నిటికి



బ్రహ్మిలిపి ఆధారం. తెలుగు దక్షిణ బ్రహ్మిలిపి కి చెందిందన్నారు. మానవుడు తాను పరిశీలించిన అంశాలను తన జీవితానికి ఉపయుక్తంగా మలుచుకోవాలి. నిప్పు, చక్రం, భాష, లిపి, మానవుడు కనుగొన్న అద్భుత ఆవిష్కరణలు. వాటిని తర్వాతి తరాలకు అందించిన విధానం మధ్యాహ్నం చేయటం ప్రతి ఒక్కరి బాధ్యత. జ్ఞానము, విజ్ఞానము మానవ జీవితానికి అత్యవసరాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు పరిశోధకులు విద్యార్థుని విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాతీయసెమినార్ లో పాల్గొని పత్ర సమర్పణ చేసినందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ పి. రంగారావు ప్రత్యేకంగా అభినందించారు.

# రోజమ్మ..ఎందుకమ్మా నీకు రాజకీయాలు

## -గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : రోజమ్మ.. ఎందుకమ్మా నీకు రాజకీయాలు, భక్తులకు ఇచ్చే తిరుపతి లెటర్లు అమ్మిన నీవా..జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి నీకు లేదని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగిరి నియోజకవర్గంలో ప్రజలు నిన్ను ఛీకొట్టిన కాని ఇంకా బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీలో చిల్లర రౌడిలు ఉన్నారని పిచ్చిపిచ్చి అభూత కల్పనలు చేయవద్దని రోజాను హెచ్చరించారు. మీ వైసీపీ పార్టీలో ఎంతమంది నేరచరిత్ర కల్గిన నేతలు ఉన్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో మచ్చలేని మగమహారాజు జనసేనాని పవన్ కళ్యాణ్ ఒక్కరేని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, కౌలు రైతుల ఇబ్బందులను గ్రహించి సుమారుగా రూ.40 కోట్లు తన



కష్టార్జితాన్ని పేద ప్రజలకు పంచి పెట్టిన గొప్ప దార్శనికుడు పవన్ కళ్యాణ్ అన్నారు. నేడు రాష్ట్రంలో పల్లెపల్లెకు, తండాలకు అసలు రోడ్లంటే తెలియని (గిరిజన గ్రామాలకు) ప్రాంతాలకు వెళ్ళాలంటే నిత్యం నరకయాతన పడే ప్రజల ఇబ్బందులను స్వయంగా పరిశీలించి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తూ వారి ఆశీస్సులు పొందిన రాజనీతి కల్గిన వ్యక్తిని ఫ్యాకేజ్ అనడం వినసొంపుగా లేదని తెలిపారు. జబర్దస్త్ కామెడీ షోలతోటి కాలం వెళ్ళబుచ్చుకోమని తీవ్రంగా విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో రాక్షసక్రీడకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# న్యాయవిద్యార్థులకు సమాజం పట్ల అవగాహన ఉండాలి

**పెనమలూరు ఫిబ్రవరి6,ప్రభాతవార్త :** విద్యార్థులు నేర్చుకున్న చట్టాలను వృత్తిలో నిజజీవిత అంశాలకు జోడించి తమ క్లైంటుకు న్యాయం జరిగేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ జి.వి.కృష్ణయ్య తెలిపారు. కానూరు సిద్ధార్థ న్యాయకళాశాలలో శుక్రవారం నిజజీవిత పరిస్థితులలో చట్టం యొక్క అనువర్తనం అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి కృష్ణయ్య మాట్లాడుతూ న్యాయవిద్యార్థులు కళాశాలలో నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఒక చట్టం గురించి



తెలుసుకున్నప్పుడు ఆ చట్టంతో ముడిపడిఉన్న మరిన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యయేబలం, జ్ఞానమే శక్తి అన్నది నిత్యసత్యమని న్యాయవాదవృత్తిలో న్యాయవాదులు అన్ని అంశాలపట్ల, చట్టాలపట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థిదశలోనే పుస్తకపఠనంపై మక్కువ చూపాలని ప్రముఖ భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి హెచ్ ఆర్ ఖన్నా ఆత్మకథ, నెదర్‌రోజెస్ నార్ థార్న్స్, ఫాలి ఎస్.నిరిమన్ ప్రముఖ న్యాయవాది రాసిన బి ఫోర్ మెమరీ ఫేడ్స్ యాన్ ఆటోబయోగ్రఫీ, క్యాబినెట్ మంత్రి యం.సి.చాగ్లా ఆత్మకథ డిసెంబరులో గులాబీలు వంటి రచనలు న్యాయమూర్తులు, న్యాయవాదులు తప్పక పఠించాలని వివరించారు. చట్టాలను ఆకళింపు చేసుకొని నిజజీవితంలో అవగాహనతోకూడిన అమలుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి న్యాయకళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ దివాకరరావు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

# ఉండవల్లిలో కుంభకోణం కాఫీ షాపు ప్రారంభం

**తాడేపల్లి, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :** మంగళగిరి తాడేపల్లి నగర పాలకసంస్థ పరిధి ఉండవల్లి దేవుడు మాన్యం వద్ద జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దీక్ష మీడియా చైర్మన్ జొన్న రాజేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుంభకోణం కాఫీ షాపును శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కుంభకోణం కాఫీ షాపు ఏర్పాటు ఇదే తొలిసారి అని తెలిపారు. షాపు నిర్వహణలో నాణ్యతా, ప్రమాణాలను పాటించాలని ఈ సందర్భంగా చిల్లపల్లి సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఎంటిఎంసి అధ్యక్షులు మునగపాటి మారుతీ, శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ట్రస్ట్ బోర్డు సభ్యులు బళ్ళ ఉమామహేశ్వరరావు, ఉండవల్లి గ్రామ మాజీ సర్పంచ్ జొన్న శివశంకర్, బడే సాంబశివరావు, సాధు చంద్రశేఖర్, అంబటి తిరుపతి రావు, చాముండేశ్వరీ దేవి, జనసేన పార్టీ ఉండవల్లి గ్రామ అధ్యక్షులు రాజా రమేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, దినేష్ చక్రవర్తి, తెలుగుదేశం పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి ఉండవల్లి గ్రామ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు తోట సాంబశివరావు, బసివి రెడ్డి, లింగంశెట్టి కిషోర్, జంగాల సాంబశివరావు రోటరీ క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రత్యేక విద్యార్థులు




**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 6(ప్రభాతవార్త ) :** ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఆర్ట్ అండ్ కల్చరల్ కార్యక్రమం విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని మేరి స్టెల్లా కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని చిత్రలేఖనం, పెయింటింగ్, బొమ్మలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎమ్ రజనీ, సహిత విద్యా సమన్వయకర్త నారాయణ, సెక్టోరియల్స్ ఎఎంఒ అశోక్, శిరీష రాణి, విశ్వభారతి, ఎఎస్ఒ చక్రవర్తి పాల్గొన్నారు.

# మాజీ మంత్రి జోగి రమేష్ పరామర్శకు పోలీసు ఆంక్షల నడుమ కాలినడకన కాలసాని చెన్నారావు, వైకాపా యూత్ నేతలు

**ఎ కొండూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** టిడిపి గూండాల దాడికి గురైన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించటానికి ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం విచ్చేస్తున్న వైసిపి అధినేత మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన కార్యక్రమంలో భాగంగా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం వైసిపి నాయకులకు జాతీయ రహదారి-30పై పోలీసులు అడుగడుగున ఆంక్షలు విధిస్తూ మైలవరం మండలం బాడవ ఎన్‌హెచ్-30 టోల్‌ప్లాజా వద్ద అడ్డుకొనగా ఆంక్షలను సైతం లెక్కచేయకుండా యంగ్ డైనమిక్ లీడర్స్ ఎన్టీఆర్ జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాడ్డు) ఎ కొండూరు మండల యూత్ ప్రెసిడెంట్ చిమట రామకృష్ణ (రేజా) అన్నలు మాజీ మంత్రి జోగిరమేష్ నివాసానికి కాలినడకన సుమారు 50 కి.మీ వెళ్లారు. ఈ కార్యక్రమంలో



వైసిపి ప్రెసిడెంట్ మర్సకట్ల వెంకటేశ్వరరావు పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు వీరితో పాటు పెద్ద సంఖ్యలో కదం తొక్కారు.

# శ్రీవిద్య లగ్జరీ షోరూమ్ ప్రారంభంలో సినీ నటి పాయల్ రాజ్‌పుత్ సందడి

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** విజయవాడలో వారసత్వ ఫ్యాషన్ కోసం ఒక కొత్త గమ్యస్థానంగా హస్తకళ, సున్నితమైన డిజైన్ విస్తృత శ్రేణి జాతి




దుస్తులను ఒకే వేదికపై శ్రీ విద్య ప్రీమియం షోరూమ్‌ను నగరంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటి పాయల్ రాజ్‌పుత్ ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరయ్యారు. శ్రీవిద్య వ్యవస్థాపకులు ఓం ప్రకాష్ దేవాసి మాట్లాడుతూ 2015లో గుంటూరులో స్థాపించబడిన శ్రీవిద్య, నాణ్యమైన భారతీయ వస్త్రాలు ప్రత్యేక సందర్భాల దుస్తుల కోసం ఒక విశ్వసనీయమైన పేరుగా స్థిరంగా ఎదిగిందన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

**తిరువూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన 35 అంశాలు మీద చర్చించి



అమోదించడమైనది. అనంతరం ఆసుపత్రిలోని రోగులను సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు డా.జయసింహా, ఆకుల దుర్గ ప్రసాద్, మామిడి వెంకటమ్మ, సూపరింటెండెంట్ భానుతేజ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా తెదేపా అధ్యక్షునిగా వీరంకి వెంకటగురుమూర్తి

పెనమలూరు ఫిబ్రవరి6,ప్రభాతవార్త : కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షునిగా వీరంకి వెంకట గురుమూర్తి , ప్రధాన కార్యదర్శిగా గోపు సత్యనారాయణ, మరియు జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. నిమ్మకూరు గ్రామంలో జరిగిన ఈ వేదికపై పార్టీప్రతిష్టతకు భంగం వాటిల్లకుండా ప్రజాశ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందమూరి తారకరామారావు తనయులు నందమూరి రామకృష్ణ,



పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్లకుమార్ రాజా, మంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, కింజరపు అచ్చెన్నాయుడు, సవిత తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వవిప్ మరియు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, ఏపియస్ ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణ కార్యకర్తలు, నాయకులు, భారీసంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

మార్టూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు దుద్దుకూరు గ్రామానికి చెందిన ముప్పాళ్ళ ప్రసాద్‌కు అత్యవసర చికిత్స కొరకు ఎల్‌ఓసీ ద్వారా 12 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు.

# ఏపీ రవాణా శాఖతో మారుతి సుజుకీ అవగాహన ఒప్పందం

**అమరావతి, జనవరి 6, ప్రభాతవార్త :** మారుతి సుజుకీ సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్ ఏర్పాటు, నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖతో మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఒక అంగీకార



ఒప్పందంపై సంతకం చేసింది. ఏడీటీటీలు రాష్ట్రంలో ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి వంటి నాలుగు రీజనల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీస్ ప్రదేశాల్లో ఏర్పాటు చేయబడతాయి. ఎంవోఏ ద్వారా, మారుతి సుజుకీ ఈ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్‌ను ప్రారంభించిన తేదీ నుండి మూడు సంవత్సరాల వరకు ఆటోమేట్ చేస్తూ నిర్వహిస్తుందని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో హిసాషి తకేవుచి తెలిపారు.

# దీర్ఘకాలిక సంపద సృష్టి ప్రయాణంలో కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌కు 15ఏళ్లు

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కోటక్ మ్యూచువల్ ఫండ్) కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ తన 15 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసినట్లు ప్రకటించింది. ప్రారంభం నుంచి ఈ పథకం 16.59 శాతం సీఏజీఆర్‌ను అందిస్తూ వివిధ మార్కెట్ చక్రాల మధ్య కూడా స్థిరమైన బలమైన దీర్ఘకాలిక పని తీరును చూపించింది. ఈ సందర్భంగా నీలేష్ షా, మేనేజింగ్ డైరెక్టర్, కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ మాట్లాడుతూ కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ 15 సంవత్సరాలు పూర్తి చేయడం మా కోసం మాత్రమే కాదు, మమ్మల్ని నమ్మి పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లందరికీ గర్వకారణం.

# మాగీ 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా స్మారక తపాలా స్టాంప్ విడుదల

**అమరావతి, జనవరి 6, ప్రభాతవార్త :** భారతదేశంలో మ్యాగీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక ప్రత్యేక స్మారక తపాలా స్టాంపును నెస్లే ఇండియా చైర్మన్, ఎండి మనీష్ తివారీ, భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఇన్ని తరాలుగా, ప్రజలను ఏకం చేస్తూ వస్తున్న మ్యాగీకి ఇది ఒక గౌరవం. భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ, ఈ అద్భుతమైన ప్రయాణంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు మ్యాగీకి అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.



# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :** మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మార్కాపురం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో క్రింది స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని, భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐఐటి రూర్కీతో అమెజాన్ భాగస్వామ్యం

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** వ్యవసాయ వ్యర్థాల నుండి వినూత్న ప్యాకేజింగ్ సామగ్రిని అభివృద్ధి చేయడానికి అమెజాన్ ఇండియా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీతో భాగస్వామ్యంతో కలపేతర కాగితం సాంకేతికతను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. వర్జిన్ కలప గుజ్జుపై ఒత్తిడిని తగ్గించేందుకు, వ్యవసాయ వ్యర్థాలను దహనం చేయకుండా మళ్లించేందుకు ఈ సాంకేతికత తోడ్పడనుంది. తేలికైనవే అయినప్పటికీ, ఈ బలమైన ప్యాకేజింగ్ పదార్థాలు సంప్రదాయ కలప గుజ్జు కాగితం లేదా ప్లాస్టిక్ సంచులకు బదులుగా తిరిగి వాడదగిన, ఇంట్లోనే కంపోస్ట్ చేయగల ప్రత్యామ్నాయాలను అందిస్తాయి. ఈ పరిశోధన గోధుమ గడ్డి, బగాస్ వంటి పంట అవశేషాలను పేపర్ మెయిలర్స్ తయారీకి పనికొచ్చే అధికనాణ్యత గుజ్జుగా మార్చడంపై దృష్టి పెడుతుంది.

# వాహనాలపై బ్లూ లేదా తీవ్రమైన వైట్‌లైట్లు నిషేదం : కందుకూరు ఆర్టీవో

**కందుకూరు పిబ్రవరి 6,ప్రభాతవార్త :** వాహనాలకు తీవ్రమైన కాంతిగల అనధికారిక లైట్ల వినియోగం చట్టరీత్యానేరమని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి టీవీ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక ఆర్టీవో కార్యాలయ ఆవరణలో పలు వాహనాలను తనిఖీచేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలకు అమర్చుకున్న ఎల్‌ఈడీ లైట్స్ (డ్యాజిలింగ్ లైట్స్) వలన ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. తద్వారా అనేక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. బ్లూ లేదా తీవ్రమైన వైట్ లైట్లు వినియోగం నిషేధించినట్లు తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే తీవ్ర కాంతిగల బ్లూ లేదా వైట్ లైట్లు నిషేధించినట్లు తెలిపారు.

# అద్దంకిలో డ్వాక్ర మహిళలతో అవగాహన ర్యాలీ

**అద్దంకి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** అద్దంకిలోని డ్వాక్రమహిళలతో పట్టణ సి.ఐ. సుబ్బరాజు ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్స్ తదితర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సి.ఐ. సుబ్బరాజు మాట్లాడుతూ మహిళలు ప్రత్యేకంగా చట్టాలపై అవగాహన కలిగివుండాలని, పలు అంశాలపై ఆయన వివరించారు.

# పెద్దవడ్లపూడి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**మంగళగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను మంత్రి నారా లోకేష్ చొరవతో టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ



సహాయం అందిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. వైద్య చికిత్సలు, ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా చెక్కుల రూపంలో అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆలమూరి విజయ్ కుమార్‌కు రూ.3,26,445/, భావన సుధారాణికి రూ.2,86,735/, కూరపాటి ప్రమీల కు రూ.1,62,000/, జవ్వాది రత్నజలికి రూ.72,419/, చల్లపల్లి గంగాధర్ రావుకు రూ.53,047/, నెప్పల్లి శ్రీకాంత్‌కు రూ.40,350/, అన్నే నాగేశ్వరరావుకు రూ.35,000/ చొప్పున చెక్కులు అందజేయగా, మొత్తంగా రూ.9,75,996/ (తొమ్మిది లక్షల డెబ్బై ఐదు వేల తొమ్మిది వందల తొంబై ఆరు రూపాయలు) విలువైన ఆర్థిక సహాయం పంపిణీ చేయడం జరిగింది.సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సహాయం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందని టీడీపీ నాయకులు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అందజేసినవారి లో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, యేళ్ళ శివరామయ్య,మాదల రమేష్ బాబు, మొద్దుకూరి రమేష్ బాబు, నడవన దుర్గారావు, యేళ్ళ మల్లయ్య,యేళ్ళ నవీన్, కొప్పాక ఓంకార్, నున్నం గోపి , సుకవాసి కృష్ణ, గోపీ తదితరులు పాల్గొన్నారు.

# సందడి సందడిగా విజ్ఞానోత్సవ్

- -విమర్శలను అంగీకరిస్తేనే విజయం సాధ్యం
- -ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీఫ్ అద్వైతం
- -నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి
- -వర్సిటీ ఇంచార్జి వీసి ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్
- -రెండో రోజు వైభవంగా కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్
- -విద్యార్థులతో ముచ్చటించి....సందడిచేసిన సినీ తారలు
- -పోటా పోటీగా కొనసాగుతున్న పోటీలు
- -అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- -వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన విద్యార్థులు

**పొన్నూరు, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** ఒకటి కాదు.....రెండు కాదు...ఏకంగా 80ఈవెంట్లు, కనుచూపు మేర ఎటువైపు చూసినా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైకా



వ్యాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన.....ఇలా ఇకటేమిటి అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు నువ్వా నేనా అన్నట్లు పోటీపడి విజయాలు సాధిస్తున్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్-2కే26 పోటీలు విద్యార్థులను ఆసాంతం అబ్బురపరిచింది.మంచి విమర్శలను అంగీకరిస్తేనే మీరు విజయం సాధించగలరని ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం(చాంపియన్ మూవీ) అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి 19వ ఎడిషన్ విజ్ఞాన్స్ మహోత్సవ్ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం సందడి సందడిగా సాగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ ప్రారంభ దశలో ఉన్నవారైనా, అనుభవజ్ఞులైనా తప్పులు చేయడం సహజమని పేర్కొన్న ఆయన, మంచి విమర్శలను అంగీకరించడం ద్వారా మాత్రమే వ్యక్తి ఎదుగుదల సాధ్యమని వివరించారు. యువతకు సందేశంగా విజయానికి స్పష్టమైన నిర్వచనం లేదు. జీవితం ఎలా ప్రవహిస్తుందో అలా ముందుకు సాగాలని చెప్పారు. సినిమా నిర్మాణంపై మాట్లాడుతూ ఒక సినిమా తన నిడివి అంతా ప్రేక్షకులను ఆకట్టుకుంటే అది మంచి సినిమా అవుతుందని చెప్పారు. సినిమా గురించి లోతుగా అధ్యయనం చేస్తే మంచి స్క్రీన్‌ప్లే రాయగలమని తెలిపారు. జీవితాన్ని, పుస్తకాలను, సినిమాలను గమనిస్తే అనేక మంచి ఆలోచనలు లభిస్తాయన్నారు. సినిమాల నిర్మాణంలో ఏఐకీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది కొన్నిసార్లు కఠినమైన పాత్రను కూడా పోషిస్తుందని చెప్పారు. నటుడిగా ఎదగాలంటే భాషపై పట్టు అవసరమని, మంచి నటుడిగా మారాలంటే భాషలో నైపుణ్యం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

**నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి: విజ్ఞాన్స్ వీసి కేవీ క్రిష్ణకిషోర్**

ప్రతి ఒక్కరూ ఎప్పుడూ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ అన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా అనుభవాన్ని పెంపొందించుకునే అవకావం లభిస్తుందన్నారు. అయితే ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, వైఫల్యాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ, ఎప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలన్నారు. నిరంతర అభ్యాసం, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే విజయాలు మన సొంతమవుతాయన్నారు. కోచ్ చెప్పే సూచనలపై నమ్మకం ఉంచాలని, ఆయన తప్పులు సరిచేసి, సరైన మార్గంలో నడిపిస్తారని తెలిపారు. ప్రతి గేమ్ ఒక కొత్త అనుభవం, ప్రతి తప్పు ఒక కొత్త పాఠమని, క్రీడాకారులు ఎప్పుడూ సంతృప్తి చెందకుండా, మరింత



నేర్చుకోవాలనే ప్రయత్నం చేయాలన్నారు. నేరవేర్చాం అనుకోవడం కంటే ఇంకా నేర్చుకోవాలి అనే తపన ఉండాలన్నారు.

**పోటా పోటీగా క్రీడలు:** జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగు పందేలను నిర్వహించారు. వీటిపాటు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ,ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలన్నీ కూడా సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు:**

తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన కళలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెడుతూ మూడు రోజులపాటు జరగనున్న పోటీల్లో రెండో రోజు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. ముఖ్యంగా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. వీటితోపాటు మ్యూజిక్, లిటెరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య,సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇంచార్జి వీసి కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# కాజ వెంకటసుబ్రహ్మణ్యంకు విశ్వనాథ సాహిత్య అకాడమి జీవన సాఫల్య పురస్కారం

**గుంటూరు విద్య ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** గుంటూరు, విశ్వనాథ సాహిత్య అకాడమి దశమ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, సాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు డా



కాజ వెంకట సుబ్రహ్మణ్యంకు విశ్వనాథ సాహిత్య అకాడమి జీవన సాఫల్య పురస్కారంను అందించారు. ఈ వేడుకను వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు నిర్వహించారు. ఈకార్యక్రమానికి వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్. విశ్వనాథ సాహిత్య అకాడమి చైర్మన్ డా॥ మద్దినేని సింహకౌటిల్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింహకౌటిల్య చౌదరి మాట్లడుతూ సుధీర్ఘకాలంగా కూచిపూడి నాట్యానికి విశేషమైన సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం అందించటం జరిగిందని తెలిపారు. దేశ విదేశాలలో 60 మంది వెంకట సుబ్రహ్మణ్యం వద్ద శిక్షణను అభ్యసించిన వారు నాట్య గురువులుగా కూచిపూడి నాట్యానికి సేవలు అందిస్తున్నారనీ, రుక్మిణీ కళ్యాణం, గోదా కళ్యాణం వంటి 20కి పైగా నృత్య నాటికలను ఆయన రచించారనీ పేర్కొన్నారు. 350 యేళ్లనాటి తంజావూరి విజయ రాఘవ నాయకుడు రచించిన విప్రనారాయణ చరిత్రము యక్షగానానికి, త్యాగరాజ స్వామి 250 ఏళ్ల క్రితం రచించిన ప్రహ్లాద భక్తి విజయం, నౌకాచరితము యక్షగానాలకి సుబ్రహ్మణ్యం చేసిన నృత్యరూ పకల్పన అత్యద్భుతం అని కొనియాడారు. అనంతరం కాజ వెంకట సుబ్రహ్మణ్యం దంపతులను వివిఐటియూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సత్కరించారు.

# 8న ఉచిత వైద్య శిబిరం

**పొన్నూరు, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** పట్టణంలోని విద్యానగర్‌లోని శ్రీ కీర్తి హాస్పటల్ పదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు డాక్టర్ మారం శివకుమార్, డాక్టర్ కీర్తి తెలిపారు. వార్షికోత్సవ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో ర్యాండమ్ బ్లడ్ షుగర్ పరీక్ష, రక్తపోటు, ఈసీజీ, గుండె స్కాన్, కొలెస్ట్రాల్ పరీక్ష, శరీర బరువు సూచిక, ఎముకల బలాన్ని కొలిచే పరీక్ష, సాధారణ ఆరోగ్య పరీక్ష తదితర పరీక్షలను ఉచితంగా పొందవచ్చని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల యాజమాన్యం కోరింది.

# దేశవ్యాప్త కార్మికసమ్మెను జయప్రదం చేయండి : సిఐటీయు

**తెనాలి టౌన్ ఫిబ్రవరి6(ప్రభాతవార్త):** ఫిబ్రవరి12 న జరిగే దేశవ్యాప్త కార్మికసమ్మె గురించి ప్రచారం లో భాగంగా ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ,





ఫిబ్రవరి12న జరిగే సమ్మె సందర్భంగా ర్యాలీలో పాల్గొనాలని కోరారు రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికుల కు కనీస పెన్షన్ నెలకు రూ. 9000/వర్తింప చేయాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని,ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వున్నామనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కె.శంకరరావు, కె.భాస్కర్ చంద్,ఎస్.సుబ్రహ్మణ్యం, జీ.రవీంద్ర కె.దుర్గా ప్రసాద్,జీవి.రావు ధనలక్ష్మి, సామ్రాజ్యం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో, మార్కెట్ యార్డు ముఠా కార్మికులను ఉద్దేశించి జిల్లా సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ కె.బాబూప్రసాద్, మరియు సీఐటీయూ,షేక్. హుస్సేన్ వలి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో చప్పిడి ఆంజనేయులు,భాస్కరరావు టీ.రవి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా బేవరేజస్ గోడౌన్ వద్ద ముఠా కార్మికులను ఉద్దేశించి సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, షేక్.హుస్సేన్ వలి,చిన్న గోపాలరావు, ఎం.శ్రీనివాసరావు టీ.కోటేశ్వరరావు, వి.వెంకటరావు,మోహన్, జీ.బ్రహ్మం, రాంబాబు,మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నేత రమేష్ హత్య పై విచారణ జరిపించాలి

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ నేత టీఎం రమేష్ మాదిగ హత్యపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు జిల్లా



పాలనాధికారి కార్యాలయం ముందు ధర్నా చేస్తూ నినాదాలు పలికారు. ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ..కర్నూలు జిల్లా,తుగ్గలి మండలం, బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత రమేష్ మాదిగను ఈ నెల ఒకటో తేదీన అదే గ్రామానికి చెందిన కొందరు దుండగులు అమానుషంగా కొట్టి, హత్య చేయటం జరిగిందన్నారు. దీనిని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో తీవ్రస్థాయిలో ఖండిస్తున్నామన్నారు. అదే ప్రాంతానికి చెందిన బోయ కులానికి చెందిన ఓ మహిళకు అండగా నిలబడి, న్యాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిని జీర్ణించుకోలేని ఆ గ్రామానికి చెందిన కొందరు పోరంబోకు దుండగులు కక్ష పెంచుకొని రమేష్ ను దారుణంగా హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ హత్య మాదిగ జాతికి తీరని లోటని ఆవేదన చెందారు. రమేష్ హత్య వెనుక ఉన్న రాజకీయ మరియు పోలీసు కుట్రాలను బయటపెట్టి ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరపాలని, రమేష్ మాదిగ హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, ఐదు ఎకరాల సాగు భూమి అందివ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలనే డిమాండ్స్ తో జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి ఉన్నత పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏటుకూరు విజయకుమార్ మాదిగ, చిలుమూరి నాగరాజు మాదిగ, కారుమూరి బెనార్డు,వీరయ్య మాదిగలు, సొపాటి ప్రభాకర్, శ్రీధర్ మాదిగలు, ఉన్నం ధర్మారావు మాదిగ, కొమరాల శ్రీనివాసరావు, కిన్నెర నాగరాజు, వలివేటి భూషణం, దేవరకొండ బాబురావు, కొల్లిపర అరుణ్ కుమార్, సిద్ధిల ఇజ్రాయిల్, ఆర్.పి.రాజు మాదిగలు పాల్గొన్నారు.

# జనగణనలో కుల గణన ఫార్మెట్లో ఓబీసీ కాలమ్ చేర్చాలి : కేసన శంకరరావు

**మంగళగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీల జనాభా కచ్చితంగా తేల్చేందుకు,ఈసారి కేంద్రం చేపడుతున్న జనగణన ఫార్మెట్లో ప్రతి వ్యక్తి కులం తో పాటు ఓబిసి కాలమ్ కూడా చేర్చాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో "జనగణనలో సమగ్ర కుల గణన" అంశంపై జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కేంద్రం హామీ ఇచ్చి కూడా మాట తప్పితే మాత్రం ఆనాటి మండల్ ఉద్యమాన్ని మించి దేశం సమరశీల పోరాటాలతో రావణకాష్టమవుతుందని హెచ్చరించారు.అందుకే ఈ పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే కులగణనపై ప్రత్యేక చర్చ జరపాలని కోరుతున్నామన్నారు. కుల గణన విషయంలో కేంద్రం వెనకడుగు వేస్తే మాత్రం, ముందుగా 27 ఓబీసీ కేంద్ర మంత్రులఆపై ఓబీసీ పార్లమెంటు సభ్యులందరి రాజీనామాలకై ఉద్యమిస్తామని హెచ్చరించారు. 1931 వరకు జనగణనతో పాటే కులగణన జరిగాయితప్ప, మళ్లీ ఇంతవరకు జరగలేదన్నారు. గత ఏడాది ఏప్రిల్ 30 న ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో,ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి జరిపే జనగణనతో పాటు సమగ్ర కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చి కూడా తాత్సారం చేయడం తగదన్నారు. ఈనాటికీ గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించి అందులో ఓబీసీ కాలం చేర్చకుండా కేంద్రం ఓబీసీల పట్ల కపట ప్రేమ నటించడం దుర్మార్గమన్నారు. ఓబీసీల కుల గణన తేలక పోతే చట్టసభలు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు జరపడం గానిఓబీసీ మహిళకు మహిళా రిజర్వేషన్లలో సబ్ కోటా ఇవ్వడం సాధ్యం కాదన్నారు. అందుకే ప్రతి భారతీయుని కులంతో పాటు వారు ఎస్సీ నాఎస్టీ నాబీసీనామైనారిటీ నా అని తెలిపేలా కాలం లు తప్పక





జేర్చాలని శంకరరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈరోజు గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించివేస్తూ సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర నాయకులు మేకా వెంకటేశ్వరరావు, బత్తుల రాంబాబు, వాకా వెంకటేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# విభిన్నకథాంశంతో రూపొందిన చిత్రం "చైనాపీస్"

## ప్రమోషన్‌లో భాగంగా తెనాలి వచ్చిన చిత్ర యూనిట్

**తెనాలి టౌన్ ఫిబ్రవరి6,(ప్రభాతవార్త):** స్పై త్రిల్లర్ కథాంశంతో ఆద్యంతం రక్తికట్టించనున్న "చైనాపీస్" సినిమా ప్రేక్షక లోకాన్ని



మయమరిపపించే విధంగా ఉంటుందని చిత్ర దర్శకులు,రచయిత అక్కి విశ్వనాథరెడ్డి తెలిపారు."చైనాపీస్" చిత్రానికి సంబంధించి శుక్రవారం,స్థానిక సుల్తానాబాద్ గిస్మత్ హోటల్లో నిర్వహించిన ప్రమోషన్ లో చిత్ర యూనిట్ విలేకరులతో మాట్లాడారు.మూన్ లైట్ డ్రీమ్స్ నిర్మాణంలో చిత్రీకరిస్తున్న "చైనాపీస్" ఆద్యంతం సస్పెన్స్, స్పై త్రిల్లర్ ను తలపిస్తుందని దర్శకులు విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. తమకు ఎదురైన సైబర్ క్రైమ్ సమస్యలపై ఇద్దరు స్నేహితులు ఎదుర్కొన్న కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు యువ హీరో నిహాల్ కోదాటి చెప్పారు.తన స్నేహితుడిగా సూర్య శ్రీనివాస్ నటిస్తున్నట్లు హీరో నిహాల్ పేర్కొన్నారు.తాను ఒకప్పుడు విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుకున్నానని,ఈ చిత్ర ప్రమోషన్ లో భాగంగా తెనాలి వచ్చినట్లు చెప్పారు. ఈ చిత్రాన్ని మార్చి నెలలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు.ఈ సినిమా తన కెరియర్ లో బిగ్గెస్ట్ మైలురాయి అవుతుందన్నారు. ఒక పవర్ ఫుల్ లేడి క్యారెక్టర్‌తో సినీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు, ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శకులకు నటి శ్రీషా ఆనందం వ్యక్తం చేశారు."చైనాపీస్" సినిమా మంచి త్రిల్లర్ తో పాటు వినోదాన్ని అందించ బోతుందన్నారు.డైరెక్షన్ డిపార్ట్మెంట్ సురేష్, రోహిత్, మూవీ ప్రమోషన్స్ డిపార్ట్మెంట్ ఇంఛార్జి జంపని మనోజ్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసర్లంక రమణ, యువ క్రికెట్ అకాడమీ చైర్మన్ మాలిక్, యూసఫ్, చేతన్,సాధిక్,ఈ ప్రమోషన్లో పాల్గొన్నారు.

# వృద్ధురాలి అనుమానస్పద మృతి

**తెనాలి టౌన్,ఫిబ్రవరి6,(ప్రభాతవార్త):** గత మంగళవారం మందులు కొనుగోలుకై తెనాలి వచ్చి ఆచూకీ లేకుండా పోయిన, రూరల్ మండల గ్రామం నందివెలుగు కు చెందిన ఎం. మాణిక్యం(70) అనుమానాస్పద రీతిలో, పంట కాలువలో శవమై తేలింది. వివరాల్లోకి వెళితే నందివెలుగు గ్రామానికి చెందిన



మాణిక్యం మందులు కొనుగోలుకై తెనాలి పట్టణానికి వచ్చి అనంతరం కనిపించకుండా పోవడంతో ఆమె కుటుంబ సభ్యులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే శుక్రవారం కంచర్లపాలెం సమీపంలోని పంట కాలువలో అనుమానాస్పద మహిళ మృతదేహం దొరకడంతో పోలీసుల సమాచారంతో కుటుంబ సభ్యులు మాణిక్యంగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మాణిక్యం అనుమానాస్పదంగా మృతి చెందటంపై ఎవరైనా బంగారం కోసం హత్య చేశారా?లేక మరీ ఇతర కారణమైన ఉందా? అనే విషయంపై గల కారణాన్ని కనుగొనుటకై పోలీసులు విచారణ చేపట్టారు.

# పద్మశాలి సంక్షేమానికి కృషిచేస్తా

## పద్మశాలి సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ధనుంజయరావు

**తాడేపల్లి,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :** పద్మశాలీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం నూతన అధ్యక్షులు గుత్తికొండ ధనుంజయరావు అన్నారు.మంగళగిరి పట్టణ పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షులు గా ఈనెల 1వ తేది ఆదివారం జనరల్ బాడీ



సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తికొండ ధనుంజయరావు శుక్రవారం ఉదయం 8.30గంటలకు మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీబద్రావతి సమేత భావనారుషీ స్వామి వార్ల దేవాలయంలో సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు.ముందుగా సంఘ పెద్దలతో కలిసి కులదైవమైన శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామివార్లకు పూజలు నిర్వహించారు.అనంతరం అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు.సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన గుత్తికొండ ధనుంజయరావును పలువురు అభినందించారు.కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతకింది కనకయ్య,ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేర స్వామి,కోశాధికారి గంజి రవీంద్రనాద్,ఆ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున,పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులు తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళు,సహాయ కార్యదర్శి మునగపాటి వెంకటేశ్వరరావు,రామనాధం పూర్ణచంద్రరావు,వంగర లక్ష్మయ్య,జొన్నాదుల భిక్షరావ్,వంగర లక్ష్మయ్య,కొల్లి ప్రసాద్,కొల్లి పూర్ణ,కౌతరపు శ్రీను,తేడా త్రిమూర్తులు,జొన్నాదుల బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల సలహాతో మందులు తీసుకోవాలి

**కొల్లిపర, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** దీర్ఘకాలిక రోగులు వైద్యుల సలహాల మేరకు మందులను వినియోగించుకోవాలని కొల్లిపర మండల వైద్యాధికారి నీహ అన్నారు.శుక్రవారం స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహించారు.రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా అవసరమైన మందులను పంపిణీ చేశారు.రోగులకు సలహాలు, సూచనలిచ్చారు.ఈ సందర్భంగా



డాక్టర్ నీహ మాట్లాడుతూ ప్రతి నెలా బిపి,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.ముఖ్యంగా మహిళలు క్యాన్సర్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు,సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలోఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,పిహెచ్ఎన్ ప్రమీలారాణి, ఎంఎల్‌హెచ్‌పీ రమ్యజ్యోష్నా,ఎఎన్ఎం అనిత,డిఇవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు శేషారత్నం,జ్యోతి,సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియో

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** 2025లో అత్యంత విజయవంతమైన విక్రయాలను నమోదు చేసి, కొత్త కుషాక్‌ను ప్రవేశపెట్టిన తర్వాత, తన పెరుగుతున్న ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియోతో అదే జోరును కొనసాగిస్తోంది. తన అత్యధికంగా అమ్ముడవుతున్న కారు, కైలాక్ వేరియంట్‌ను విస్తరించడం ద్వారా మరియు కస్టమర్లకు మరిన్ని వేరియంట్లు, మెరుగైన ఎంపిక మరియు అధిక విలువను అందించడం ద్వారా, భారతీయ రోడ్లపై యూరోపియన్ టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే తన వ్యూహాన్ని ఈ బ్రాండ్ మరింత ముందుకు తీసుకెళ్లింది.

# స్ఫూర్తిని నింపిన టెడ్ఎక్స్ వివిఐటియు

**గుంటూరు విద్య ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు నిర్వహించిన "టెడ్ఎక్స్ వివిఐటియు " విద్యార్థులలో స్ఫూర్తినినింపి, ప్రేరణ కలిగించే విధంగా సాగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న అంశాలపై ప్రతిభావంతుల ఆలోచనల వ్యాప్తి కొరకు ఏర్పాటు చేయబడ్డ టెడ్ ఎక్స్ కార్యక్రమంలో, సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించి ఏవిధంగా ముందుకు సాగాలో విద్యార్థులకు తెలియజేస్తూ వక్తలు ప్రసంగించారు. విద్య, విజ్ఞానం, కళ, మానసిక ఆరోగ్యం, సామాజిక మార్పు వంటి అంశాలపై ఆలోచనలను పంచుకుంటూ ప్రపంచ ప్రఖ్యాత 9మంది వక్తలు వారి జీవితానుభవాలను తెలిపి, వారు అధిగమించన సవాళ్లను విద్యార్థులకు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్టసమయాలలో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వివిఐటి ప్రొ ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ గోపాల్ శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు ( అంతర్జాతీయ నైపుణ్యం మరియు మొబిలిటీ) సీతాశర్మా, టాలీవుడ్ నటుడు మరియు చెఫ్ జీవన్ కుమార్, డిఆర్డిఓ పరిశోధకురాలు స్వప్నా ఎమ్. ఉమెన్ ఫెలోషిప్ ప్రోత్సాహకురాలు సలోని



జైన్, సోషల్ మీడియా క్యాంపెయినర్ దేదీప్య అబ్బగాని, మానవ వనరుల నిపుణుడు రంగనాథ్ గంధం, వివిఐటి విద్యార్థులు సెరీనా జొసెఫిన్, సౌమ్యశ్రీ నూకల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

# అప్స గుంటూరు డివిజన్ అధ్యక్షునిగా నర్రా రాజేష్

**గుంటూరు విద్య ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గుంటూరు డివిజన్ అధ్యక్షులుగా ఎస్ ఎస్ వి హై స్కూల్ డైరెక్టర్ నర్ర రాజేష్ నాలుగో సారి ఎన్నికయ్యారు . అసోసియేషన్ పరంగా ఆయన అందించిన విస్తృతమైన సేవలకు గాను అసోసియేషన్ నాలుగవసారి ఆయనను గుంటూరు డివిజన్ అధ్యక్షులుగా నియమితులు కావడం ఎంతైనా అభినందనీయమని అసోసియేషన్ నాయకులు, వివిధ పాఠశాలల డైరెక్టర్లు నర్రా రాజేష్ ను అభినందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అసోసియేషన్ నాకు ఇచ్చిన గుంటూరు డివిజన్ బాధ్యతలకు ఎప్పటి మాదిరిగానే నూరు శాతం న్యాయం చేస్తానని, ప్రవేటు విద్యాసంస్థల యొక్క సమస్యల పరిష్కారం కొరకు జిల్లా రాష్ట్ర నాయకత్వంతో కలిసి పనిచేస్తానని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

07-02pg10exHMNWJQETLK 12 VJA_07-02pg10exHMNWJQETLK.qxd 07/Feb/26 12:13 AM Page 1





# బాక్సమ్ ఎలైట్‌లో దూసుకుపోయిన నీతు, ప్రీతి

**న్యూఢిల్లీ:** భారత బృందం బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ 2026లో తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించి మొత్తం 19 పతకాలను నిర్ధారించింది. శుక్రవారం జరిగిన టోర్నమెంట్ 3వ రోజునీతు (51 కిలోలు), ప్రీతి (54 కిలోలు) వారి వారి వెయిట్ కేటగిరీలలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల పోటీలో జదుమణి సింగ్ (55 కిలోలు) మరోసారి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ప్రధాన కోచ్ శాంటియాగో నీవా నేతృత్వంలోని భారత మహిళల బృందం 12 పతకాలను ఖాయం చేయగా, పురుషుల జట్టు 7 పోడియం ఫినిషింగ్‌లను సెమీఫైనల్ దశకు చేరుకుందని నిర్ధారించింది. నీతు అద్భుతమైన ఫామ్‌లో కెనడాకు చెందిన మెకెంజీ రైట్‌ను 5:0 తేడాతో ఓడించింది. ప్రీతి స్పెయిన్‌కు చెందిన మరియా గొంజాలెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్లినికల్ ప్రదర్శనతో, నిరంతర ఒత్తిడితో పోటీని నిర్దేశించిన తర్వాత రౌండ్ 3లో నిష్క్రమించవలసి వచ్చింది. పూనమ్ (54 కిలోలు) థాయిలాండ్‌కు చెందిన నట్నిచా చోంగ్‌ప్రోంగ్‌క్లాంగ్‌పై 5:0 తేడాతో మరో అద్భుతమైన విజయాన్ని నమోదు చేయగా, ప్రియా (60 కిలోలు) మరియు ప్రాంజల్ (65 కిలోలు) వరుసగా స్పెయిన్‌కు చెందిన లారా గలా మరియు చెక్ బాక్సర్ విక్టోరీ జిల్కోవాపై ఏకగ్రీవ విజయాలు నమోదు చేశారు. హోరాహోరీగా జరిగిన పోరులో కాజల్ (65 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన అక్బర్ ఇచ్‌షనోవాను 4:1 తేడాతో ఓడించింది. పురుషుల పోటీలో, జదుమణి సింగ్ 55 కిలోల విభాగంలో చైనీస్ తైపీకి చెందిన పెంగ్ చియాఫెంగ్‌ను 5:0 తేడాతో ఓడించాడు. మహమ్మద్ హుస్సామ్ ఉద్దీన్ (60 కిలోలు) ఉక్రెయిన్‌కు చెందిన అలీ దాలీపై ఆధిపత్యం సంపాదించాడు.

# టీ20ల్లో మోస్ట్ డేంజర్ బౌలర్స్, బ్యాటర్లను హడలెత్తించే వికెట్ టేకర్లు
















**న్యూఢిల్లీ:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీయడం అనేది ఏ బౌలర్ కైనా గొప్ప విషయం. ఈ క్రికెట్‌లో ఒక్క వికెట్ అయినా మ్యాచ్ ఫలితాన్ని మార్చేయగలదు. అందుకే ఈ వికెట్ టేకర్లు ప్రపంచ కప్‌లలో అంత ప్రాముఖ్యతను కలిగి ఉంటారు. బ్యాటర్లు మొదటి బంతి నుంచే దాడికి దిగే ఈ పొట్టి ఫార్మాట్‌లో, వరుసగా ప్రపంచ కప్‌లలో క్రమంగా వికెట్లు తీయడం అనేది క్రికెట్‌లో అత్యంత కష్టం. కానీ ఈ మోస్ట్ డేంజరస్ బౌలర్ల ఎలైట్ జాబితాలో టాప్ 5లో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ అగ్రస్థానంలో నిలిచాడు. వేగం లేదా స్పిన్ కంటే తన నియంత్రణ, సమతుల్యత, తెలివైన ఆలోచనలతో ఆయన ఈ విజయాన్ని అందుకున్నాడు. అయితే, 2026 ప్రపంచ కప్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంతో, ఆయన ఈ మెగా ఈవెంట్‌లో కనిపించడు. దాదాపు 20 ఏళ్ల కెరీర్‌లో ఆయన సగటు 20కి పైగా ఉండగా, ఎకానమీ రేటు 7 కంటే తక్కువగా ఉంది. ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది రెండో స్థానంలో ఉన్నాడు. అఫ్రిది ఎప్పుడూ బ్యాటర్లపై దాడి చేయడానికి భయపడలేదు. గాలిలోకి బంతిని విసిరి, భారీ షాట్లు ఆడేలా బ్యాటర్లను ప్రేరేపించి వికెట్లు పడగొట్టేవాడు. ప్రత్యర్థి జట్టు పటిష్టంగా ఉన్న సమయంలో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పడంలో ఆయన దిట్ట. అలాగే ఒత్తిడిలో బౌలింగ్ చేయడంలో శ్రీలంకు చెందిన లసిత్ మలింగ సిద్ధహస్తుడు. 38 వికెట్లతో ఆయన ఇప్పటికీ టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత భయంకరమైన బౌలర్లలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఆయన విలక్షణమైన బౌలింగ్ యాక్షన్, ప్రాణాంతకమైన యార్కర్లు ఎంతటి మేటి ఫినిషర్లనైనా ఇబ్బంది పెట్టేవి. ప్రపంచ కప్‌లో ఆయన ఒకే మ్యాచ్‌లో 5 వికెట్లు తీయడం అత్యంత మరపురాని ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో అత్యంత వేగంగా పైకి ఎదుగుతున్న శ్రీలంకు చెందిన బౌలర్ వానిందు హసరంగా.

కేవలం 19 మ్యాచ్‌లలోనే 37 వికెట్లు తీయడం ఆయన దూకుడుకు నిదర్శనం. 2026 ప్రపంచ కప్ పాక్షి కంగా శ్రీలంకలో జరగనుండటంతో, ఆయన ఈ జాబితాలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. రషీద్ ఖాన్ మాదిరిగానే, ఈయన కూడా అగ్రస్థానానికి చేరుకోవడానికి ఇంకా 14 వికెట్ల దూరంలో ఉన్నారు. చివరిగా అంతర్జాతీయ వేదికపై ఆఫ్ఘనిస్తాన్ తరఫున రషీద్ ఖాన్ ఒక గేమ్‌ఛేంజర్‌గా నిలిచారు. హసరంగాతో సమానంగా 37 వికెట్లతో ఆయన టాప్ 5లో కొనసాగుతున్నాడు. ఒత్తిడి సమయాల్లో బ్యాటర్లు ఆయన్ని ఎదుర్కోవడానికి చాలా ఇబ్బంది పడతారు.




ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఆదర్శ్ రామ్‌కు కాంస్యం
## ప్రవీణ్, మణికంఠ విఫలం

**న్యూఢిల్లీ:** 2026 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెటిక్స్ బృందం నిరాశపరిచింది. అయితే భారతదేశపు మొట్టమొదటి పురుషుల హైజంప్‌లో కాంస్య పతకాన్ని జె ఆదర్శ్ రామ్ గెలుచుకున్నాడు. శుక్రవారం చైనాలోని టియాంజిన్‌లో జరిగిన పోటీలో 28 ఏళ్ల ఆదర్శ్ ఫైనల్లో 2.19 మీటర్లు దూకి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకంతో చైనాలో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. అతడు 2.23 మీటర్ల మార్కును దాటడానికి ప్రయత్నించినా మూడు ప్రయత్నాలలోనూ విఫలమై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక ప్రవీణ్ చిత్రవేల్ నాల్గవ స్థానంలో నిలవగా, మణికంఠ హోబ్లిధర్‌పై అనర్హత వేటు పడింది. ఈ సీజన్‌లో ప్రవీణ్‌కి మంచి ఆరంభం లభించలేదు. అతను పురుషుల ట్రిపుల్ జంప్ పోడియంను 16.22 మీటర్లు జంప్ చేసి, ముగ్గురు చైనా అథ్లెట్ల కంటే 4వ స్థానంలో నిలిచాడు. తొలుత ప్రవీణ్ 15.66 మీటర్ల జంప్‌తో ప్రారంభించి తరువాతి జంప్‌లలో అతను దానిని స్వల్పంగా పెంచాడు. చివరి ప్రయత్నంలో 16.22 మీటర్లు దూకాడు. మరోవైపు భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్ మణికంఠ హోబ్లిధర్ పురుషుల 60మీటర్ల ప్రాథమికరౌండ్‌లో తప్పుడు ప్రారంభం కారణంగా అనర్హతను ఎదుర్కొన్నాడు. అధికారులు హీట్3లో పునఃప్రారంభించాలని పిలుపునిచ్చిన తర్వాత అతను నేరుగా రెడ్ కార్డ్ అందుకున్నాడు. దీనితో చైనాలో అతని ప్రచారం ఒక్క రేసు కూడా నడపకుండానే ముగిసింది.

# బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్.. భారత్ మహిళల, పురుషుల జట్లు ఓటమి




**న్యూఢిల్లీ:** 2026 బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ మహిళల, పురుషుల జట్లు క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించాయి. కింగ్‌డావోలో శుక్రవారం జరిగిన టైలో ఆతిథ్య చైనా చేతిలో భారత్ మహిళల జట్టు ఓటమిపాలైంది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్లు 0-3 తేడాతో పరాజయాన్ని ఎదుర్కొన్నారు. ప్రపంచ 10వ ర్యాంకర్ గావో ఫాంగ్ జీతో సహ అగ్రశ్రేణి ఆటగాళ్లు లైనప్‌లో ఉండటంతో, చైనా భారతదేశానికి గట్టి ప్రత్యర్థిగా నిలిచింది. 17 ఏళ్ల తన్వి శర్మపై 21-9, 21-9 తేడాతో ఘన విజయం సాధించి చైనా తరఫున గావో మ్యాచ్‌ను ప్రారంభించింది. తద్వారా ఆతిథ్య జట్టుకు ఈ టైకు బలమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత, ప్రపంచ నంబర్ 4 జోడీ జియా యి ఫ్యాన్-జాంగ్ షు జియాన్ 24-22, 21-17తో అగ్రస్థానంలో ఉన్న భారత ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌లను ఓడించారు. తొలి గేమ్‌లో అదనపు పాయింట్లు సాధించడానికి 7 పాయింట్ల లోటు నుండి తిరిగి రావడానికి, ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జంటపై యువ భారత జంట ధైర్యంగా పోరాడినా 22-24 తేడాతో దగ్గరగా ఓడి మ్యాచ్‌ను ముగించారు. మూడవ మ్యాచ్‌లో, రక్షిత శ్రీ సానుకూలంగా ప్రారంభించి, వెన్ జింగ్ జుతో జరిగిన తొలి గేమ్‌ను గెలుచుకుంది.

కానీ తరువాతి రెండు గేమ్‌లను 21-14, 15-21, 17-21 తేడాతో ఓడిపోయింది. అలాగే పురుషుల విభాగంలో కిదాంబి తన మ్యాచ్ గెలిచాడు. కానీ డబుల్స్ మరియు సింగిల్స్ లో ఆయుష్ శెట్టి తమ తమ మ్యాచ్ లలో ఓడిపోవడంతో భారత జట్టు 13 తేడాతో ఓటమిని ఎదుర్కొంది.

# జాగ్రెబ్ ఓపెన్..నీలం సిరోహికి రజతం



**న్యూఢిల్లీ:** జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్-2026, మహిళల 50 కిలోల విభాగంలో భారత్ అథ్లెట్ నీలం సిరోహి రజత పతకం గెలుచుకుంది. క్రొయేషియాలో జరుగుతున్న జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో భారత రెజ్లర్లు 4 పతకాలు గెలుచుకుని పతకాల పరుగును కొనసాగించారు. మహిళల 50 కిలోల విభాగంలో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది, అనుభ వజ్ఞురాలైన నీలం సిరోహి రజత పతకాన్ని గెలుచుకోగా, ముస్కా న్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాంస్య పతక పోరు లో ముస్కాన్ పోలాండ్‌కు చెందిన అగాటా వాలెర్జాక్‌పై టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేయగా, నీలం ఫైనల్‌లో జపాన్‌కు చెందిన అండర్ 23 ప్రపంచ ఛాంపియన్ హరునా మోరికావా చేతిలో 2-5 తేడాతో ఓడిపోయింది. నీలం అంతకుముందు ఆల్ఇండియన్ సెమీఫైనల్‌లో ముస్కాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

# ఆర్‌బిఐ నిర్ణయాలతో మార్కెట్లలో జోష్..
## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
### సెన్సెక్స్ 266, నిఫ్టీ 50 పాయింట్ల లాభం




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమావేశం నుంచి సానుకూల సంకేతాలు అందడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. 2027 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ పెంచడం మార్కెట్‌కు కలిసొచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి 83,580 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి 25,693 వద్ద ముగిసింది.
వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలన్న ఆర్‌బిఐ నిర్ణయంతో పాటు, స్థిరత్వానికి ప్రాధాన్యం ఇస్తామన్న సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. అయితే, బెంచ్‌మార్క్ సూచీలకు భిన్నంగా బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.02శాతం, స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.27శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్‌ఎంసిజి సూచీ 2.27 శాతం మేర భారీగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంకులు, రియల్టీ రంగాలు కూడా లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ ఐటీ 1.47 శాతం, ఫార్మా 0.72 శాతం మేర నష్టపోయాయి. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (ఆర్ఇఐటి) రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులకు అనుమతిస్తామని ఆర్‌బిఐ సూచించడం మార్కెట్‌కు మరింత మద్దతునిచ్చింది.

# గరిష్ట స్థాయికి విదేశీ మారక నిల్వలు
## 723.77 బిలియన్ డాలర్లకు చేరిక




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, జనవరి 23తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు కొత్త చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బంగారు నిల్వలు, విదేశీ కరెన్సీ ఆస్తులు రెండింటిలోనూ పెరుగుదల కారణంగా, ఈ వారంలో విదేశీ మారక నిల్వలు 8.053 బిలియన్ డాలర్లు పెరిగి 709.433 బిలియన్ డాలర్లకు చేరాయి. గత కొన్ని వారాలుగా, విదేశీ మారక నిల్వలు ఎక్కువగా పెరుగుదల ధోరణిలోనే ఉన్నాయి. దీనికి ముందు సెప్టెంబర్ 2024లో 704.89 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలలో అతిపెద్ద భాగమైన భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సిఎ) 2.367 బిలియన్ డాలర్లు పెరిగి 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బిఐ డేటా ప్రకారం, బంగారు నిల్వలు ప్రస్తుతం 123.088 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి, ఇది గత వారం కంటే 5.635 బిలియన్ డాలర్లు ఎక్కువ. డిసెంబర్ ప్రారంభంలో జరిగిన తాజా ద్రవ్య విధాన సమీక్ష సమావేశం తర్వాత, దేశ విదేశీ మారక నిల్వలు 11 నెలలకు పైగా వాణిజ్య దిగుమతులకు సరిపోతాయని ఆర్‌బిఐ పేర్కొంది. మొత్తంమీద, భారతదేశ బాహ్య రంగం పటిష్టంగా ఉంది. బాహ్య ఆర్థిక అవసరాలను సులభంగా తీర్చగలమని ఆర్‌బిఐ విశ్వాసంతో ఉంది. గణాంకాల ప్రకారం, 2025లో విదేశీ మారక నిల్వలు సుమారు 56 బిలియన్ డాలర్లు పెరిగాయి. 2024లో, నిల్వలు 20 బిలియన్ డాలర్లకు పైగా పెరిగాయి. 2023లో, భారతదేశం తన విదేశీ మారక నిల్వలకు సుమారు 50 బిలియన్ డాలర్లను జోడించింది, అయితే 2022లో మొత్తం 71 బిలియన్ డాలర్ల క్షీణత నమోదైంది. విదేశీ మారక నిల్వలు అనేవి ఒక దేశపు కేంద్ర బ్యాంకు లేదా ద్రవ్య అథారిటీ వద్ద ఉండే ఆస్తులు. వీటిని ప్రధానంగా అమెరికన్ డాలర్ వంటి రిజర్వ్ కరెన్సీలలో, మరియు తక్కువ మొత్తంలో యూరో, జపనీస్ యెన్, మరియు పౌండ్ స్టెర్లింగ్‌లలో ఉంచుతారు. రూపాయి విలువ తీవ్రంగా పడిపోకుండా నిరోధించడానికి ఆర్‌బిఐ తరచుగా ద్రవ్య లభ్యతను నిర్వహించడం ద్వారా, డాలర్లను అమ్మడం వంటి చర్యలతో జోక్యం చేసుకుంటుంది. రూపాయి బలంగా ఉన్నప్పుడు ఆర్‌బిఐ వ్యూహాత్మకంగా డాలర్లను కొనుగోలు చేస్తుంది మరియు బలహీనపడినప్పుడు విక్రయిస్తుంది.

# తగ్గిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా కుప్పకూలాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాలకు బ్రేక్ పడింది. ఇండియా బులియన్స్ వెబ్‌సైట్ ప్రకారం కిలో వెండి ధర రూ.2.47 లక్షలకు పడిపోగా, 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ.1.52 లక్షల వద్దకు చేరింది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, డాలర్ బలపడటం వంటి కారణాలతో ఈ పతనం చోటు చేసుకుంది. గత రెండు రోజులుగా లాభాల్లో పయనించిన వెండి, గురు వారం నాటి మార్కెట్ క్రాష్ తర్వాత కోలుకోలేకపోయింది. స్పాట్ మార్కెట్లో వెండి ధర ఏకంగా 20శాతం పతనమై ఔన్సుకు 71 డాలర్ల దిగువకు చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా రూ.26,850 (10శాతం) తగ్గి కిలో రూ.2,42,000 వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు సెషన్‌లో దీని ధర రూ. 2,68,850గా ఉంది. బంగారం ఫ్యూచర్స్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్ రూ.2,310 (1.51శాతం)తగ్గి 10గ్రాములు రూ.1,50,736 వద్ద ముగి సింది. గత నెలలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. అయితే, ఈ పెరుగుదల ఎక్కువ కాలం నిల వదని, ధరలు చాలా వేగంగా పెరిగాయని విశ్లేష కులుహెచ్చరించారు. వారి అంచనాలకు అను గుణంగానే గతవారం నుంచిమార్కెట్లలో భారీ దిద్దుబాటు మొదలైంది.

**ప్రధాన నగరాల్లో ధరలు:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగా రంధర రూ.1,52,180గా ఉండగా, ఢిల్లీలో రూ.1,51,910గాఉంది. దక్షిణ భారతనగరాల్లో ధరలు అత్యధికంగా ఉన్నాయి. చెన్నైలో తులం బంగారం ధర రూ.1,52,620 కాగా, హైదరాబాద్‌లో రూ.1,52,420, బెంగళూరులో రూ.1,52,300గా నమోదైంది. వెండి విషయానికొస్తే, చెన్నైలో కిలో వెండి ధర అత్యధికంగా రూ.2,47,590గా ఉంది. హైదరాబాద్‌లోరూ.2,47,260, బెంగళూరులో రూ.2,47,060 వద్ద ట్రేడ్‌అయ్యింది. ముంబైలో కిలోవెండి ధర రూ.2,46,870గా, ఢిల్లీలో రూ.2,46,440గాఉంది. కోల్‌కతాలో రూ. 2,46,540 వద్ద కొనసాగింది.

# ఫెడ్ భయం.. బిట్‌కాయిన్ డఢేల్

## క్రిప్టో ప్రపంచంలో మహా పతనం
## కనిష్ఠానికి పడిపోయిన బిట్‌కాయిన్
## ఒక్కరోజులోనే ఇన్వెస్టర్ల సంపద 100కోట్ల డాలర్ల ఆవిరి
## టెక్ షేర్ల అమ్మకాలతో క్రిప్టో విలవిల



**ముంబై, ఫిబ్రవరి 6:** డిజిటల్ బంగారంలా వెలిగిపోతుందనుకున్న క్రిప్టో మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రేడింగ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ విలువ 13 శాతం మేర క్షీణించి, సుమారు 63,295 డాలర్ల వద్ద 15 నెలల కనిష్ఠ స్థాయిని తాకింది. 2024 నవంబర్‌లో అమెరికాఅధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచినప్పటి నుంచి కొనసాగుతున్న జోష్‌ను ఈతాజా పతనం పూర్తిగా తుడిచిపెట్టేసింది. గత అక్టోబర్‌లో 1.26 లక్షల డాలర్ల రికార్డు స్థాయిని తాకిన బిట్‌కాయిన్, ఇప్పుడు ఆ గరిష్ఠాల నుంచి సగానికి పైగా విలు వను కోల్పోవడం గమనార్హం. కేవలం 24 గం టల వ్యవధిలోనే క్రిప్టో మార్కెట్లో సుమారు బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) విలువైన పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ప్రపంచ క్రిప్టో మార్కెట్ ఏకంగా 2 ట్రిలియన్ డాలర్ల సంపదను కోల్పోయింది. రెండో అతిపెద్ద కరెన్సీ అయిన 'ఇథీరియం' కూడా 13 శాతానికి పైగా నష్టపోయి 1,854 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బిట్‌కాయిన్ మైనింగ్ చేసే కంపెనీలు సైతం తమ వద్ద ఉన్న నిల్వలను అమ్మకానికి పెట్టవచ్చనే వార్తలు ఇన్వెస్టర్లలో మరింత గుబులు రేపుతున్నాయి.
క్రిప్టో పతనానికి కేవలం ఒక్క కారణం మాత్రమే కాదు, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు తోడయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి ఛైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను ట్రంప్ నామినేట్ చేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఆయన కఠినమైన ద్రవ్య విధానాలను అనుసరిస్తారనే భయం ఇన్వెస్టర్లలో మొద లైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై అంచనాలు తగ్గడంతో నాస్‌డాక్ వంటి అంతర్జాతీయ టెక్ ఇండెక్స్‌లు కుప్పకూలాయి. బిట్‌కాయిన్ కదలికలు టెక్ షేర్లతో ముడిపడి ఉండటంతో ఈ సెగ క్రిప్టోకు తగిలింది. బంగారం, వెండి ధరల్లో కనిపిస్తున్న విపరీతమైన అస్థిరత కూడా ఇన్వెస్టర్లను రిస్క్ అసెట్స్ నుంచి వెనక్కి తగ్గేలా చేసింది. ప్రస్తుత పతనం స్వల్పకాలిక సర్దుబాటు కాదని, మార్కెట్ పూర్తిగా గడ్డు కాలంలోకి ప్రవేశించిందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సంస్థాగత పెట్టుబడిదారులు క్రిప్టో ఇటిఎఫ్‌ల నుంచి బిలియన్ల కొద్దీ నిధులను వెనక్కి తీసుకుంటుండటం మార్కెట్ బలహీనతను స్పష్టం చేస్తోంది. బిట్‌కాయిన్ 60 వేల డాలర్ల స్థాయిని నిలబెట్టుకోకపోతే, అది మరింత దిగువకు జారుకునే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఎఐ పెనుముప్పు: అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
## భారత్ టెక్ కంపెనీలపై ప్రభావం చూపే అవకాశం: యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హెచ్చరిక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒకముప్పుగా పరిణమించిందని, ఈ టెక్నాలజీ వినియోగంపై రెగ్యు లేటర్లు నిఘాను కఠినతరం చేస్తున్నారని యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. సెనేట్ బ్యాంకింగ్ కమిటీ ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్ (ఎఫ్ ఎస్ఓసి) 2025 వార్షిక నివేదికలో ఏఐని నాలుగు ప్రధాన దృష్టి సారించాల్సిన అం శాల్లో ఒకటిగా చేర్చినట్లు బెస్సెంట్ తెలిపారు. "ఆర్థిక స్థిర త్వాన్ని బలో పేతం చేసేందుకు ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడానికి కౌన్సిల్ ప్రాధాన్యత ఇస్తోంది. ఏఐ అనేది ఒక గొప్ప సాధనం, కానీ అదే సమ యంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తుల ద్వారా ప్రమాదకరంగా కూడా మా రగలదు" అని ఆయన హెచ్చరించారు. ఫ్రాడ్ గుర్తింపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వాటిలో ఏఐ వినియోగం పెరుగుతోందని చెప్పారు. పెరుగుతున్న ముప్పులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాములతో పాటు అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఎఫ్ఎస్ఓసి పని చేస్తోందని బెస్సెంట్ వివ రించారు. ఏఐతో పాటు సైబర్ సెక్యూరిటీ కూడా ఆర్థిక సంస్థలకు, కీలక మౌలిక సదు పాయాలకు పెను సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. ఈ విచారణలో రిపబ్లికన్లు ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతించగా, డెమొక్రాట్లు మాత్రం తగిన రక్షణ చర్యలు లేకుం డా ఆర్థిక ఆవిష్కరణలు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు రుణాల జారీ, కస్టమర్ సర్వీస్ కోసం ఏఐని వేగంగా వినియో గిస్తున్న తరుణంలో అమెరికా రెగ్యులేటరీ సంకేతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈపరిణామాలు సరిహద్దు కార్యకలా పా లున్న భారత టెక్ కంపెనీలు, ఆర్థిక సంస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14